మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 23.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4

సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 79 || వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఢిల్లీకి రేవంత్.. 20వ సారి!

- రెండు రోజులపాటు హస్తినలోనే ముఖ్యమంత్రి బస
- పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో చర్చ
- పీసీసీ చీఫ్ పగ్గాలు మంత్రికి?.. ఇన్‌చార్జి కూడా మార్పు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రత్యేక విమానంలో వెళ్లారు. వారం కిందటే ఢిల్లీకి వెళ్లిరాగా.. మరోసారి పిలుపు రావడం గమనార్హం. రేవంత్‌రెడ్డి సీఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి వెళ్లడం ఇది 20వసారి. వారంతా రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉంటారని, అధిష్ఠానంతో చర్చలు జరుపుతారని సమాచారం. పీసీసీ అధ్యక్ష పదవి మార్పుపై 9వ పేజీలో

సీఎం శాఖలో పదోన్నతుల అగ్రాస్!

ఎస్సీ గురుకుల సొసైటీలో చేతులు మారిన కోట్లు.. డీఎల్, ప్రిన్సిపాల్ ప్రమోషన్లు, బదిలీల్లో అక్రమాలు

'అడిగినంత డబ్బు ముట్టజెప్పు.. కావాల్సిన ప్రమోషన్ పట్టు. నచ్చిన చోటుకు వెళ్లు' ఇదీ స్వయంగా సీఎం రేవంత్ అజమాయిషీలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సొసైటీ పరిధిలోని డీఎల్, ప్రిన్సిపాళ్ల ప్రమోషన్లు, బదిలీల తీరు.

ఓ అధికార పార్టీ నాయకుడు, ఓ యూనియన్ లీడర్, ఇద్దరు ఉన్నతాధికారులు, ఓ డాటా ఎంట్రీ ఆపరేటర్ చక్రం తిప్పి కోట్లు దండుకున్నారు. సమస్యలను చక్కదిద్దాల్సిన అధికారులే ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లకు సదరు వ్యక్తులతోనే రావాలని బాహాటంగా సూచించారు. వెరసి అనుభవం, అర్హతలున్నా ప్రమోషన్లు రాక కొందరు బలైతే, మరికొందరు స్థానికతనే కోల్పోయారు. ఈ వ్యవహారంపై సీఎస్‌కు ఫిర్యాదు చేసి 15రోజులు దాటినా ఇప్పటికీ చర్యల్లేవని ఉద్యోగులు వాపోతున్నారు



- చక్రం తిప్పిన సొసైటీలోని ఇద్దరు ఉన్నతాధికారులు
- ప్రభుత్వ మార్గదర్శకాలకు, సొసైటీ బైలాకు పాతర
- జోన్లకు జోన్లే మార్పు.. ఫోకల్ టు ఫోకల్ బదిలీలు
- అక్రమాలపై విచారణకు డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు
- సీఎస్‌కు, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్
- తప్పులు జరిగితే రాసివ్వండి: సొసైటీ సెక్రటరీ వర్షిణి

మ్యాకం రవికుమార్/హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలో మొత్తం 30 డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో 3 ప్రత్యేక డిగ్రీ కాలేజీలు మినహా 27 మహిళా డిగ్రీ కాలేజీల్లో మొత్తం 1017 మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం 2017, ఆ తర్వాత 2019లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టింది. తాజాగా 2022లో డీఎల్ పోస్టులు మంజూరు చేయగా, ఇటీవలే నియామకం చేపట్టింది. విధివిధానాలంటూ ఏమీలేకుండానే సొసైటీ ఇష్టారాజ్యంగా డిగ్రీ లెక్చరర్ల బదిలీలు నిర్వహించింది. పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు సంబంధించి వేర్వేరుగా సూపరింటెండెంట్లను నియమించి బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టిన సొసైటీ, డీఎల్‌కు సంబంధించి అలాంటి చర్యలేమీ చేపట్టలేదు. కనీస అర్హతలు లేనివారిని ఇన్‌చార్జిలుగా నియమించి ప్రక్రియను మమ అనిపించింది. ఇదే అదునుగా సదరు ఉన్నతాధికారులు అక్రమాలకు తెరలేపారని తెలుస్తున్నది. వాస్తవంగా డిగ్రీ గురుకుల కాలేజీల్లో 2019 మార్చి, అదే ఏడాది ఆగస్టు, తాజాగా ఇటీవల నియామకాలు చేపట్టారు. 2019, 2020లో రిక్రూట్‌మెంట్ అయినప్పుడు మెరిట్ ప్రకారం ఆయా డీఎల్ సబ్జెక్టులకు సంబంధించి 80శాతం మంది వాళ్ల దగ్గరి ప్రాంతాల కాలేజీలను ఎంచుకున్నారు. కేవలం 20శాతం అంటే దాదాపు 170 మంది వరకు తమకు వచ్చిన మెరిట్ ఆధారంగానే దూరప్రాంతాల్లో పోస్టింగ్ ఎంచుకోవాల్సి వచ్చింది. ఐదేండ్లుగా ఇబ్బందులు పడుతున్న వారంతా రిక్వెస్ట్ బదిలీలు సైతం పెట్టుకున్నారు. ఇక 8వ పేజీలో



గల్లా పట్టి అడుగు.. ఈ సిగ్గులేని సర్కారును!

▶ మొదటిపేజీ తరువాయి...


అయితయని తొలుత చెప్పి, చివరికి రూ.7,500 కోట్లు రైతుల ఖాతాల్లో వేశారని, ఎక్కడి రూ. 49 వేల కోట్లు, ఎక్కడి రూ.7,500 కోట్లు అని ఎద్దేవా చేశారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి మోసగించిన కాంగ్రెస్ నేతలను ప్రజలు ఎక్కడికక్కడ గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతోపాటు డిక్లరేషన్లపైనా వెంటపడుతూనే ఉంటామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో గురువారం నిర్వహించిన రైతు నిరసన దీక్షలో కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి పాల్గొని ప్రసంగించారు.

'చేవెళ్ల చెల్లెమ్మగా పిలుచుకొనే వ్యక్తి సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గంలోని నర్కోడా గ్రామానికి మూడు రోజుల కిందట పెండ్లికి వెళ్లిన. అక్కడ గ్రామంలో కళ తప్పిందని ప్రజలు చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మా బతులుకు ఆగమైనయ్ అని అంటున్నరు. అన్న వస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయింది. రేవంత్ రెడ్డి చెప్పుడు మాటలు విని ఆగమైపోయినం అని అంటున్నరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'డిసెంబర్ తొమ్మిదినాడే తొలి సంతకం రూ. 2 లక్షల రుణమాఫీపై పెడతానని సోనియాగాంధీ మీద ఒట్టేసి రేవంత్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలో లంకె బిందెలు ఉంటాయనుకున్నా కానీ అవి లేనే లేవు. ఎట్ల రుణమాఫీ చేయాలే అన్నట్టుగా మాట మార్చారు. కొత్తగా వచ్చాడు కదా ఆయనకు కొంత టైమ్ ఇద్దామని మేము కూడా ఎదురుచూశాం. ఇదే రేవంత్‌రెడ్డి బ్యాంకర్లతో సమావేశం పెట్టారు. 2 లక్షల రుణమాఫీ కోసం రూ.49 వేల కోట్లు కావాలని బ్యాంకర్లు చెప్పారు. దాంతో తప్పించుకొనేందుకు నాటినుంచి చావు తెలివితేటలు స్టార్ట్ చేయడం మొదలు పెట్టారు. ఒక్క ఏడాది కడుపు కట్టుకుంటే రూ.40 వేల కోట్లు కట్టేస్తా.. అని 9 వేల కోట్లు కట్ చేసి మీడియా ముందు మాట్లాడారు. ఆ తర్వాత జూలైలో మంత్రివర్గంలో చర్చించి ఏదోవిధంగా కటింగ్ పెట్టాలని సీఎంకు మంత్రులు సలహా ఇచ్చారు. దాంతో రైతుల రుణమాఫీపై ఆంక్షలు మొదలుపెట్టారు. అందుకే క్యాబినెట్‌లో మీటింగ్‌నాటికి దాన్ని రూ.31 వేల కోట్లకు తగ్గించారు. ఇక బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీని మీద గట్టిగా అడిగితే రేవంత్‌కు చెప్ప చేతకాలేదు' అని కేటీఆర్ మండిపడ్డారు.

కాంగ్రెస్ దొంగ పార్టీ: మహమూద్ అలీ

అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ దొంగ పార్టీ అని మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల అబద్ధాలు నమ్మి మోసపోయామని రైతులు బాధపడుతున్నారని చెప్పారు. 14 ఏండ్లు పోరాడి తెలంగాణ సాధించిన కేసీఆర్.. పదేండ్లు కష్టపడి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే 8 నెలల్లోనే రేవంత్ రెడ్డి భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ నాడు పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొస్తే నేడు ఆ పరిశ్రమలు బయటకు వెళ్లిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ రైతు సంక్షేమ పార్టీ అని చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతుల ఆత్మహత్యలు జరుగలేవని, ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యం అయ్యాయని చెప్పారు.





చేవెళ్ల ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ధర్నాకు హాజరైన రైతులు, ప్రజలు

> ప్రభుత్వాన్ని నడపడం అంటే మాటలు చెప్పినంత ఈజీ కాదు. చెట్టుకు కట్టేసి కొడతా, తొండలు జొర్రకొడతా అని గతంలో రేవంత్ అన్నారు. ఇప్పుడు హామీలు నెరవేర్చకుంటే ప్రజలే ఆయనకు ఆ పనిచేస్తారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో మీరే ఆలోచించాలి. అన్ని ప్రాజెక్టులను రద్దు చేసి ప్రజలను ఆగం చేస్తుండు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు.. భారత రైతు సమితి కూడా. మొత్తం రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు పోరాటం ఆపేది లేదు. రుణమాఫీ మాత్రమే కాదు, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లపైనా వెంటపడతాం. -కేటీఆర్

నిండు శాసనసభలో ఆడబిడ్డను ఏడిపించారు

రేవంత్‌రెడ్డికి పాలన చేతనైతలేదని, ఇంట్లో దోమలు కుడుతున్నాయని, బయట కుక్కలు కరుస్తున్నాయని సబితక్క చెప్తే కోపం వచ్చి మహిళా శాసనసభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, మహిళలపై లైంగికదాడులు పెరిగాయని, పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని అంటే సీఎం జీర్ణించుకోలేకపోయారని విమర్శించారు. 'ఒక ఆడబిడ్డ నాలుగున్నర గంటలు నిలబడి మైక్ ఇవ్వమంటే ఇవ్వకుండా ఏడిపించి దుర్మార్గంగా వ్యవహరించారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సబిత లాంటి నేతను నిండు శాసనసభలో అవమానించారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చే సత్తా లేని కారణంగానే ఇలా తప్పుడు వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం సభలో రైతు రుణమాఫీ మొత్తం అయిపోయిందని సీఎం చెప్పడంతో మొత్తం రైతులు తిరగబడ్డారు. దీంతో రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నది. నీ సొంత ఊళ్లో రైతులకు వంద శాతం రుణమాఫీ అయినట్టు రైతులు చెప్తే రాజీనామా చేస్తా అని నేను సవాల్ చేసినా. నా సవాల్‌కు సమాధానం లేదు. స్పందన లేదు. 49 వేల కోట్ల నుంచి 17 వేల కోట్లకు తీసుకొచ్చారు. అదన్నా నిజం అనుకున్నాం. కానీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రైతులకు రూ.7,500 కోట్లు మాత్రమే వేసినం అని చెప్పారు. ఎక్కడ రూ. 49 వేల కోట్లు? ఎక్కడి రూ.7,500 కోట్లు? అంటే రూ.7500 కోట్లతో దీన్ని ఇక్కడికే ఖతం చేద్దామని చూస్తున్నారు. రైతన్నలు ఆలోచించాలి. మోసం చేసినోన్ని గల్లా పట్టి నిలదీయాలి' అని పిలుపునిచ్చారు.

రుణమాఫీలో కటింగ్ పెడితే.. రైతు భరోసాలోనూ కటింగ్‌లే

ఇప్పుడు రుణమాఫీలో కటింగ్ పెడితే వచ్చే రైతు భరోసాలో కూడా రేవంత్‌రెడ్డి కటింగ్‌లు పెడతారని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలు, రైతులు ఇప్పుడు వదిలిస్తే తర్వాత కూడా ఇదే విధంగా కోతలు పెట్టుకుంటుపోతారని తెలిపారు. 'మేం అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తాం. రుణం తీసుకోని రైతులు ఎవరైనా ఉంటే ఉరికిపోయి తెచ్చుకోండి' అని రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో చెప్పారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మొత్తం రుణంమాఫీ అయితదని అనుకున్న అని నర్సాపూర్‌లో ఒక రైతు చెప్పాడు. 9 నెలల లేటుకుగాను వడ్డీ అడుగుతున్నారంట. రైతుల మిత్తితోసహా ఎలాంటి కొర్రీలు, ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నదే మన డిమాండ్. కేసీఆర్ ఉన్నప్పుడు 72 లక్షల మంది రైతులకు రైతుబంధు వేశాం. అప్పుడు లేని సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నయ్. రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తున్నారు. మనం అడగాల్సింది అధికారులను కాదు. కాంగ్రెస్ నాయకులను అడగాలె. ఇవ్వాళ ఇద్దరు మహిళా జర్నలిస్టులు ఏం పాపం చేశారు. నిజంగా రుణమాఫీ వంద శాతం అయితే మహిళా జర్నిస్టులపై దాడులు చేయించావ్. ముఖ్యమంత్రి పుట్టిన ఊరు కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులను కొట్టి వారితో అసభ్యంగా ప్రవర్తిస్తారా?' అని కేటీఆర్ నిలదీశారు.

> కేసీఆర్ ఉన్నప్పుడు 72 లక్షల మంది రైతులకు రైతుబంధు వేశాం. అప్పుడు లేని ఆధార్ సమస్యలు, సాంకేతిక సమస్యలు, రేషన్‌కార్డు సమస్యలు, బ్యాంకు సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నయ్. రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తున్నరు. మనం అడగాల్సింది అధికారులను కాదు.. కాంగ్రెస్ నాయకులను. -కేటీఆర్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలి

రుణమాఫీపై ప్రజలు తాము ఓట్లు వేసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అధికారులు చుట్టూ తిరగాల్సిన గర్జు మనకెందుకు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉంటే తమ తరపున పోరాటం చేయాలని రైతులు అడగాలని సూచించారు. ఇవ్వాళ్టి పోరాటం మొదటి అడుగు మాత్రమేనని, రైతులందరికీ మొత్తం రూ. 2 లక్షలు రుణంమాఫీ చేసే వరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. 'మాటలు చెప్పినంత ఈజీ కాదు ప్రభుత్వాన్ని నడపటం. చెట్టుకు కట్టేసి కొడుతా, తొండలు జొర్రకొడుతా అని గతంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పుడు ఆయన చెప్పిన హామీలు నేరవేర్చకుంటే అదే పని ఆయనకు ప్రజలు చేస్తారు. ఏ ఊరిలోకి అయిన సరే వెళ్లి అడుగుదాం ఒక్కరైనా నీ పాలనను మెచ్చుకుంటున్నారా? కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉందో మీరే ఆలోచించాలి. అన్ని ప్రాజెక్టులు రద్దు చేసి ప్రజలను ఆగం చేస్తుండు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు. భారత రైతు సమితి కూడా. మొత్తం రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు పోరాటం ఆపేది లేదు. ఒక్క రుణమాఫీ మాత్రమే కాదు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు మీద కూడా వెంటపడుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీకి సంబంధించి అయిన వెంటాడటమే. ప్రజాస్వామ్యబద్ధంగా ఒక్కటై కాంగ్రెస్ 420 హామీలను ప్రజల ముందుపెడదాం. రేవంత్‌రెడ్డి లాగా మనం బజారు భాష మాట్లాడాల్సిన అవసరం లేనే లేదు. రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరిగే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటాం. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే' అని హెచ్చరించారు.

> రుణమాఫీపై ప్రజలు తాము ఓట్లు వేసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలి. అధికారుల చుట్టూ తిరగాల్సిన గర్జు మనకెందుకు? -కేటీఆర్

సూర్యచంద్రులు ఉన్నంత వరకు కేసీఆర్ ఉంటరు: సబితా ఇంద్రారెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు అంశంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నోటికొచ్చినట్టు రేవంత్‌రెడ్డి మాట్లాడటం నీచశైలికి నిదర్శనమని మాజీ మంత్రి, చేవెళ్ల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేయాలనుకోవడం మూర్ఖత్వమని విమర్శించారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు కేసీఆర్ పేరు ఉంటదని చెప్పారు. మనం తాగే భగీరథ నీళ్లలో, మన ఊళ్లో ఏపుగా పెరిగిన చెట్ల నీడల్లో కేసీఆర్ కనిపిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇలా ఎప్పుడైనా రుణమాఫీపై దరఖాస్తులు ఇచ్చామా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల జాబితాను సిద్ధం చేద్దామని, వారం, పది రోజుల్లో నియోజకవర్గంలో రుణమాఫీ కాని రైతుల జాబితాను ఈ రోడ్డు మీదుగా వెళ్లే రేవంత్‌రెడ్డి ముఖాన కొడదామని పేర్కొన్నారు. ఇవ్వాళ మహిళా జర్నలిస్టులను కొట్టిపించిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు ప్రజల పక్షాల బీఆర్ఎస్ వెంటాడుతూనే ఉంటుందని చెప్పారు.

ప్రైవేటు హౌస్ వెనుక డోర్ నుంచి ఎవరొస్తున్నారు: స్వామిగౌడ్

ముఖ్యమంత్రి హోదాలో ఎవరైనా అధికారిక నివాసాన్ని వాడుకుంటారని, ప్రైవేటు హౌస్ వెనుకడోరు నుంచి ఎవరొస్తున్నారని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ రేవంత్‌రెడ్డిని నిలదీశారు. వెనుకడోరు నుంచి వచ్చి ఎవరెవరు ముఖ్యమంత్రిని కలుస్తున్నారని ప్రశ్నించారు. అదానీలు, అంబానీలకు వెనుకడోరు తీస్తున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో మాయమైపోయిన పచ్చజెండాలు ఇటీవల హైదరాబాద్ నగరంలో ఎలా రెపరెపలాడాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు, ఉద్యోగులకు, మహిళలకు, రైతులకు కుచ్చుటోపీ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లోకం పోకడ



పొద్దున బ్యాంకుకు, మధ్యాహ్నం కలెక్టరాఫీసుకు, సాయంత్రం వ్యవసాయ కార్యాలయానికి తిరిగినా రుణమాఫీ కాలేదు గానీ, వ్యవసాయం మాత్రం మాఫీ అయింది!

రుణమాఫీ బూటకం: సత్యవతిరాథోడ్



మహబూబాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతుందని.. రైతులకు రుణమాఫీ చేశామని అబద్ధపు మాటలు చెబుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. గురువారం మానుకోట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులకు తీరని ద్రోహం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై పోరాటం ఆగదు: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట అర్బన్, ఆగస్టు 22 : తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తామన్న 49 వేల కోట్ల రుణమాఫీని వెంటనే చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేసేందుకే రైతుల పక్షాన బీఆర్ఎస్ ధర్నాకు దిగిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయలేకనే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ ప్రజలను బహిరంగంగానే మోసం చేసిందని విమర్శించారు. రుణమాఫీ ఎంత చేశారో చెప్పడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాఫీకి కొర్రీలెందుకు?: శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్ , ఆగస్టు 22 : రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ఇప్పుడు కొర్రీలు ఎందుకు పెడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలమూరులో నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. రేవంత్ సర్కార్ బుర్ర కథలు చెప్పి.. రైతుల చెవుల్లో కాంగ్రెస్ నేతలు పూలు పెట్టారని ధ్వజమెత్తారు. 25 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని, 75 శాతం మందికి ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి రైతులు 'పాలిచ్చే బర్రెను విడిచిపెట్టి.. దున్నపోతులాంటి ప్రభుత్వాన్ని కొట్టంలో కట్టేసుకున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా కదంతొక్కి ప్రభుత్వం మెడలువంచి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పోరాడుతామని స్పష్టం చేశారు.

రైతులను దగా చేసిన రేవంత్: కొప్పుల



కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఆగస్టు 15 లోగా 2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టేసి రైతులను దగా చేశాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. అనేక కొర్రీలు పెట్టి వేలాది మందికి ఎగనామం పెట్టారని ఆరోపించారు. వెంటనే షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నేతృత్వంలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల కోరు అని, మోసపూరిత మాటల్లో ఆరితేరిండని మండిపడ్డారు.

ప్రతి రైతుకూ మాఫీ చేయాల్సిందే: పువ్వాడ



ఖమ్మం, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చివరి రైతు వరకూ రుణం మాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఖమ్మంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీపై అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసగించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేయాలన్నారు.

రైతును మోసగించిన రేవంత్: జోగు



ఆదిలాబాద్, ఆగస్టు 22: రెండు లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశాడని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. ఆదిలాబాద్‌లో జరిగిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులపై ప్రేమ కనపరిచి అధికారంలోకి తర్వాత గాలికి వదిలేసిందని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో రైతుల ఆందోళనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులందరికీ బ్యాంక్‌లోన్ రద్దు అయ్యేంత వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

తెలంగాణతల్లి విగ్రహాన్ని రేవంత్ పెట్టడమంటే

గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టే!

తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణం • రుణమాఫీపై గ్రామగ్రామాన ఉద్యమాలు: కేటీఆర్

- ప్రతి గ్రామం వెళ్తాం.. రిలే దీక్షలు చేస్తాం
- ఉద్యమకాలంనాటి నిరసనలు మళ్లీ చేస్తాం
- రైతు రుణమాఫీపై అబద్ధాలు చెప్పినందుకు ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- రాహుల్‌గాంధీకి రేవంత్‌రెడ్డికి అదానీతో పాటు అనేక అంశాలపై భిన్నాభిప్రాయాలు
- కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి బానిసలు
- 9 నెలల్లో రేవంత్ సాధించిన విజయం ఏంటంటే ఢిల్లీకి 20 సార్లు పోయిరావటమే
- రాజ్యసభకు తెలంగాణ నుంచి అర్హులే లేరా?
- కేసీఆర్ గుర్తులు చెరిపేయాలంటే తెలంగాణ ఉండదు
- మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్


హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): మహాత్మాగాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఎంత దరిద్రంగా ఉంటదో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి లాంటి తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణంగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ తల్లి అంటే తెలంగాణ జాతి అస్థిత్వానికి ప్రతీక, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఎలా ఆ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠారని ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో గురువారం నాటి ధర్నాలు మొదటి స్టెప్ మాత్రమేనని, రెండోస్టెప్‌లో ప్రతి గ్రామం వెళ్తామని, రిలే దీక్షలు చేస్తామని, రుణమాఫీ అయ్యేవరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఉద్యమకాలంనాటి నిరసనలు మళ్లీ చేస్తామని స్పష్టంచేశారు. గురువారం చేవెళ్లలో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రుణమాఫీపై తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ ఏయే ప్రాంతాల్లో సమావేశాలు పెట్టిందో వాటిని అమలు చేయాలంటూ ఆ ప్రాంతాల్లోనే సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై కూడా బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. రుణమాఫీ పేరుతో ఎన్నో మీటింగ్‌లు పెట్టి ఇన్ని నెలల తమాషా తర్వాత రైతు బంధు మూడు విడతల్లో రూ.7,500 కోట్లు మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతుంటే మంత్రులు ఇరుక్కుపోతున్నారని పేర్కొన్నారు.

అప్పులపైనా సర్కార్ అసత్యాలు

రాష్ట్రం అప్పులపైనా రేవంత్‌రెడ్డి సర్కార్ అసత్యాలు, దుష్ప్రచారాలు చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. జీతభత్యాలు, పెన్షన్లు, అప్పులకు మిత్తీలు లాంటి కచ్చితమైన ఖర్చులుపోనూ రాష్ట్ర రెవెన్యూ మిగులు బడ్జెట్‌లోనే ఉన్నదని తెలిపారు. 2014లో రూ.370 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటే, 2023లో రూ.5,900 కోట్లు సర్‌ప్లస్‌గా వారికి ఇచ్చామని వెల్లడించారు. చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవటం కోసం సీఎం, మంత్రులు అప్పులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ప్రజాఅంశాల నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'రైతు రుణమాఫీపై అబద్ధాలు చెప్పినందుకు ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి. ఆగస్టు15లోగా ఎలాగూ రుణమాఫీ చేయలేదు. కనీసం ఎప్పటిలోగా చేస్తారో అదైనా చెప్పాలి. రైతు భరోసాను ఎప్పటిలోగా రైతుల ఖాతాలో వేస్తారో కూడా చెప్పాలి' అని డిమాండ్ చేశారు. విత్తనాల నుంచి మొదలుకొని యూరియా, ఎరువులు, విద్యుత్తు వరకు అన్నింటా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రాహుల్, రేవంత్ మధ్య భిన్నాభిప్రాయాలు

రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డికి మధ్య అదానీతో పాటు అనేక అంశాలపై విభిన్న అభిప్రాయాలు ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. అదానీ అక్రమాలపై రాహుల్ మాట్లాడితే, రేవంత్‌రెడ్డి అదానీతో ఒప్పందాలు చేసుకొంటున్నారని తెలిపారు. అదానీ సంస్థల అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని తాము ముందు నుంచీ డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. పదేండ్లపాటు తమ మెడమీద కత్తిపెట్టినా అదానీ కంపెనీని రాష్ట్రంలోకి రానివ్వలేదని చెప్పారు. అదానీ విద్యుత్తు మీటర్లను, అదానీ బొగ్గును తెలంగాణలోకి రానియ్యలేదని, కానీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, తెలంగాణలో అదానీ వ్యాపారాలు చేస్తున్నారని వివరించారు. రూ.12,400 కోట్ల మేరకు అదానీతో పెట్టుబడులకు సంబంధించి రేవంత్‌రెడ్డి ఎంవోయూ కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. అసలు అదానీ మంచివాడా? చెడ్డవాడా? అనే విషయాన్ని రాహుల్, రేవంత్‌రెడ్డి కూర్చొని తేల్చుకొని అభిప్రాయం చెప్పాలని చురక అంటించారు.



రాహుల్ వద్ద మార్కుల కోసమే రాజీవ్ విగ్రహం

అద్భుతంగా కట్టుకున్న సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలన్నదని తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా రేవంత్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా, 'రాహుల్‌గాంధీ అయ్య విగ్రహం పెట్టి రాహుల్‌గాంధీ దగ్గర మార్కులు కొట్టేయాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని నేను కూడా అనవచ్చు. రేవంత్ తన పార్టీ నాయకుల దగ్గర మార్కులు వేయించుకోవడానికి తెలంగాణ జాతి మొత్తాన్ని అవమానిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి రేవంత్‌రెడ్డికి ఉన్న సమస్య ఏమిటి? రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహాలు తక్కువయ్యాయా? గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఎంత దరిద్రంగా ఉంటదో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి లాంటి తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణంగా ఉంటుంది. పదేండ్లలో మీరెందుకు పెట్టలేదంటే.. 10 సంవత్సరాల్లో నూతన సచివాలయం కట్టలేదన్న విషయం తెలివి తక్కువ రేవంత్‌రెడ్డికి తెలియదు. సచివాలయం ప్రారంభంకాగానే తెలంగాణ తల్లి విగ్రహం పెడతామని ప్రకటించాం. స్థలాన్ని కూడా కేటాయించాం' అని వెల్లడించారు.

అహంకారంతో మాట్లాడితే అన్ని పేర్లు మార్చుతం

తాము అధికారంలో ఉన్నన్ని రోజులు రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరు మార్చలేదని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే, మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల పేర్లతో ఉన్న పథకాల పేరు మార్పును పరిశీలిస్తామని తెలిపారు. ఇదే అహంకారంతో మాట్లాడితే.. కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతి పథకం పేరును కచ్చితంగా మారుస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి బానిసలు అని అభివర్ణించారు. 9 నెలల్లో రేవంత్‌రెడ్డి సాధించిన గొప్ప విజయం ఢిల్లీకి 20 సార్లు పోయిరావడమేనని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ గుర్తులను తుడిపేయాలని అంటే తెలంగాణ ఉండదు. తెలంగాణ లేకుండా చేసేందుకు రేవంత్‌రెడ్డి ఏదైనా కుట్ర చేస్తున్నాడేమో చూడాలి. తెలంగాణ అనే పేరును ఏమైనా మారుస్తాడేమో!' అని వ్యాఖ్యానించారు.

తెలంగాణేతరులకు పదవులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అన్ని పదవులను తెలంగాణేతరులకు అప్పజెప్పుతున్నదని కేటీఆర్ ఆక్షేపించారు. రాజ్యసభకు ఎంపికయ్యే అర్హతలు ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎవరూ రాష్ట్రంలో లేరా? మన వీ హనుమంత్‌రావుకు ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు కూడా తెలంగాణకు చెందిన వ్యక్తి కాదని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు వేరే ప్రాంత వ్యక్తి అభిషేక్ మనుసింఘ్వీని పంపారని తెలిపారు. మాదిగ సామాజికవర్గానికి రాజ్యసభ స్థానం ఇస్తామని మోసం చేసి సింఘ్వీకి చోటు కల్పించారని పేర్కొన్నారు. సింఘ్వీ తెలంగాణ కోసం కొట్లాడుతాడు అని సీఎం అంటే.. మరి తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు గాడిదలు కాస్తారా? అని నిలదీశారు. ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన తెలంగాణ ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని అన్నారు.

రిజర్వేషన్లపై ప్రభుత్వానికి స్పష్టత లేదు

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టేందుకు ప్రభుత్వం భయపడుతున్నదని కేటీఆర్ వెల్లడించారు. బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. స్థానిక సంస్థలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. ఎన్నికలకు వెళ్లాలంటే ముందు బీసీ జనగణన చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని తాము అనుకోవడం లేదని పేర్కొన్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

డెంగీ విజృంభణ

వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్య, దోమల బెడద అనేవి ఏటా వేధిస్తూనే ఉంటాయి. ఇవి అంతిమంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తికి దారి తీస్తాయి. సకాలంలో ప్రభుత్వం నివారణ చర్యలు చేపడితే వీటిని అదుపులో ఉంచవచ్చు. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతల్లో అలాంటివేమీ ఉన్నట్టు కనిపించడం లేదు. రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ జ్వరాలే ఇందుకు నిదర్శనం. డెంగీ వ్యాప్తిపై విడుదలైన తాజా గణాంకాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. జూలై 1 నుంచి ఆగస్టు 18 మధ్యకాలంలో రాష్ట్రంలో మూడువేలకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో దేశంలో 32 వేల కేసులు నమోదయ్యాయి. అంటే జాతీయ స్థాయితో పోలిస్తే రాష్ట్రంలో కేసులు పదిశాతం మేర ఉంటాయన్న మాట. అందులో అత్యధిక కేసులు గ్రేటర్ హైదరాబాద్‌లో నమోదైనవే. డెంగీతో పాటు ఇతర సీజనల్ వ్యాధులూ వ్యాపిస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. కనీసం ఇంటికొకరు ఈ రోగాల బారిన పడుతున్నారు. ఫలితంగా సర్కారు దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. వైద్యపరీక్షల కిట్ల కొరత కారణంగా బాధితులను ప్రైవేటు కేంద్రాలకు పంపిస్తున్నారు.

భారత్‌లో డెంగీ వ్యాప్తి అధికంగా ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ కూడా ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. ముందస్తు హెచ్చరికల జారీ, దోమల నివారణకు చర్యలు చేపట్టడంలో వైఫల్యమే దీనికి కారణమని తెలిపింది. రెండు మాసాల క్రితం సగటు కేసులు తగ్గినట్టు కనిపించినప్పటికీ గత ఐదారు వారాల్లో ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. ఇది ప్రభుత్వ నిర్వహణ లోపాలవైపు వేలెత్తి చూపిస్తున్నది. సాధారణంగా వర్షాకాలానికి ముందే ప్రభుత్వం సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంపై దృష్టిపెట్టాలి. సంబంధిత మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షలు జరపాలి. వైద్యాధికారులను అప్రమత్తం చేయాలి. దోమల నివారణకు చేపట్టిన చర్యలపై దృష్టిసారించాలి. మందులను సిద్ధం చేయాలి. కానీ, ప్రభుత్వం చురుగ్గా స్పందించిన దాఖలాలేవీ కనిపించడం లేదు. కేవలం తూతూమంత్రం సమావేశాలతో, మొక్కుబడి చర్యలతో సరిపెట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి.

స్వరాష్ట్ర సాధన తర్వాత ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నిరంగాలతో పాటు ప్రజారోగ్య రంగాన్ని పటిష్ఠం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ట్రాక్టర్లను సమకూర్చారు. గ్రామ పంచాయతీలకు, పురపాలికలకూ నెలనెలా క్రమం తప్పకుండా నిధులు అందజేశారు. అన్నిస్థాయిల్లో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేశారు. గ్రామీణ వైద్య వ్యవస్థను మెరుగుపర్చి ప్రజలకు భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానలు నెలకొల్పారు. ఎక్కడికక్కడ వైద్యపరీక్ష సౌకర్యాలూ ఏర్పాటు చేశారు. ఇలా కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి అందించిన ఉత్తమస్థాయి వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ సర్కారు దారుణంగా విఫలమైంది. రాష్ర్టాన్ని ప్రజారోగ్య సంక్షోభంలోకి నెట్టివేసింది. ప్రస్తుత పరిస్థితికి పారిశుద్ధ్య నిర్వహణాలోపం, ప్రజారోగ్య విభాగం సన్నద్ధతాలోపం.. రెండూ కారణమేనని చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నష్టనివారణ చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, దోమల నివారణ, దవాఖానల బలోపేతానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు కూడా దోమలవ్యాప్తిని అరికట్టడంలో తమ వంతు తోడ్పాటు అందించడమూ ముఖ్యమే.


కాంగ్రెస్‌కు పటేల్ విగ్రహ పాఠాలు

తెలంగాణ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై కాంగ్రెస్ వైఖరిని గమనించినప్పుడు అనేక విషయాలు మనసుకు వస్తాయి. ఇటీవలి పరిణామాల నుంచి ఒక ఉదంతాన్ని చెప్పుకొని, ఇతర అంశాల చర్చలోకి తర్వాత వెళదాం. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 2014లో ఓడి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 600 అడుగుల సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని 2018లో గుజరాత్‌లో ప్రతిష్ఠించారు. 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' పేరిట నర్మదా నదీ తీరాన గల ఆ విగ్రహం మొత్తం ప్రపంచంలోనే అన్ని విగ్రహాల కన్నా ఎత్తయినది.

అందుకు ఖర్చు రూ.2989 కోట్లు. పటేల్‌కు ఉక్కు మనిషి అని, వలస పాలన తర్వాత దేశంలోని సంస్థానాలన్నింటినీ విలీనం చేయడంతో పాటు మొత్తం దేశం కోసం ఒక పాలనాయంత్రాంగాన్ని నెలకొల్పినవాడనే ప్రతిష్ఠ ఉంది. ఆ విధంగా తన విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' అయింది. కాంగ్రెస్ వారికి ఇదంతా తెలుసు. అయినప్పటికీ ఆయన విగ్రహం ఏర్పాటును అప్పుడు రకరకాల పేర్లతో నానాయాగీ చేశారు. దానితో దేశప్రజల దృష్టిలో ప్రతిష్ఠ కాస్తా బీజేపీకి లభించగా, కాంగ్రెస్ అప్రతిష్ఠపాలైంది.



టంకశాల అశోక్



ఇప్పుడు మరొకటి చెప్పుకుందాం. సర్దార్ పటేల్ జీవిత చరిత్రను సాధికారికంగా రచించిన చరిత్రకారుడు రాజ్‌మోహన్‌గాంధీ. ఆ గ్రంథం ఉపోద్ఘాతంలో ఈ విధంగా ఉంది. 'స్వతంత్ర భారతదేశ వ్యవస్థ ఒక చట్టబద్ధతను, శక్తి సంపన్నతను సమకూర్చుకోవటానికి ప్రధానంగా ముగ్గురు వ్యక్తులు చేసిన కృషి కారణమనాలి. వారు గాంధీ, నెహ్రూ, పటేల్. కానీ, ఆ గుర్తింపు నెహ్రూకు పూర్తిగా లభించి, గాంధీ విషయంలో భక్తిశ్రద్ధలతో జరగగా, పటేల్‌ను ఎవరూ ఎక్కువగా పట్టించుకోలేదు. 1989లో నెహ్రూ జన్మదిన శత వార్షికోత్సవాల సందర్భంగా వెయ్యి బిల్‌బోర్డులు వెలిశాయి. ఆయనకు స్మారకంగా టెలివిజన్ సీరియళ్లు ప్రసారమయ్యాయి. అనేకానేక ఇతర ఉత్సవాలు, కార్యక్రమాలు జరిగాయి. 1975 అక్టోబర్ 31న పటేల్ శత వార్షికోత్సవ సమయంలో, ఇందుకు పూర్తి భిన్నంగా, మనకేమీ కనిపించలేదు. ఆ తర్వాత కూడా, ఆధునిక భారతపు అద్భుత సుపుత్రులలో ఒకరి జీవితంపై కప్పిన తెరలను అప్పుడప్పుడు, పాక్షికంగా మాత్రమే తొలగదీశారు'.

పటేల్ విగ్రహ ఉదంతానికి, తెలంగాణ తల్లి విగ్రహ విషయానికి సంబంధం ఏమిటని అనిపించవచ్చు. ఆ సంబంధం ఏమిటో చూద్దాం. కొద్ది మాటల్లో చెప్పాలంటే, స్వాతంత్ర్యోద్యమ ఖ్యాతి యావత్తూ గాంధీతో పాటు నెహ్రూకు మాత్రమే లభించాలని, దానిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వాధిపత్యానికి నెహ్రూను (ఆ తర్వాత ఆయన వారసులను మాత్రమే) అర్హులను చేయాలన్న ఆలోచనలో ఇందుకు మూలాలున్నాయి. దేశమంతటికీ నేటికీ ఆరాధనీయునిగా మారిన సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్యం వచ్చే సమయానికి జీవించిలేరు గాని, కనీసం తనకు లభించవలసిన ఖ్యాతి విషయంలోనూ వీలైనన్ని ఆటంకాలు సృష్టిస్తూ పోయారు. అదంతా కూడా నెహ్రూ, ఆయన వంశీకుల కోసం. అందుకే బోస్ అస్థికలశం దేశానికి స్వాతంత్ర్యం లభించిన 77 ఏండ్ల తర్వాత కూడా ఒక పరాయి దేశమైన జపాన్ రాజధాని టోక్యో సమీపాన రెంకోజీ ఆలయంలోనే ఉండిపోయింది. దానిని భారత ప్రభుత్వం కోరిన వెంటనే అప్పగించగలమని ఆలయ ప్రధాన పూజారి చాలాకాలం క్రితమే ప్రకటించినా కదలిక లేదు. తన మరణానికి సంబంధించిన రహస్య పత్రాలు భారత ప్రభుత్వం వద్ద ఇప్పటికీ రహస్యంగానే ఉన్నాయి.

పటేల్ విషయంలో గాని, నేతాజీ విషయంలో గాని ఇవన్నీ ఎవరి కోసం జరిగాయన్నది ప్రశ్న. దేశం కోసమా? లేక నెహ్రూ, ఆయన వారసుల కోసమా? ఇదంతా చేయడంలో ఎవరి భాగస్వామ్యం ఉందన్నది మరొక ప్రశ్న. నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే, స్వాతంత్ర్యోద్యమ ప్రతిష్ఠపై, అది తెచ్చిపెట్టిన అధికారంపై ఏకచ్ఛత్రాధిపత్యం ఆ వంశపు కోరిక కాగా, ఆ వంశాన్ని ఆశ్రయించి, పొగుడుతూ, ఎప్పటికప్పుడు లాభపడుతూ, ఆ వంశానికి ఇంటాబయటా ఎదురులేకుండా చూడాలన్నది కాంగ్రెస్‌లోని ఆశ్రిత గణాల నిరంతర ప్రయత్నం. ఆ క్రమంలో వారు చేసిన అనేక అకృత్యాల జాబితా అంతా ఇక్కడ రాయలేం గాని, ఆ వంశపు అధికారానికి, స్వయంగా తమ అధికారానికి ఆటంకం కాగలవనుకునే ప్రాంతీయ భావనలను, ప్రాంతీయ శక్తులను, ప్రాంతీయ సంస్కృతులను, ప్రజల మనోభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడం, అవమానించడం, తొక్కివేయడం ఒక తప్పనిసరి అవసరమని ఆ పార్టీ లేదా ఆ వంశపు అధినాయకులు, వారి ప్రాంతీయ తాబేదార్లు తలపోశారు. ఆ ప్రకారమే ఇన్ని దశాబ్దాలుగా వ్యవహరిస్తూ వస్తున్నారు.

సర్దార్ పటేల్‌ను, నేతాజీ బోస్‌ను చీకటి గదులలోకి తోసివేయజూడటం నుంచి మొదలుకొని, ఇప్పుడు తెలంగాణ తల్లి అనే ప్రజల ఆరాధ్య దేవత విగ్రహాన్ని సచివాలయం ఎదుట నుంచి గాయబ్ చేసి, తమ అధికార ప్రదాతల వంశస్తుడి విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించజూడటం వరకు అన్నీ కూడా ఒకే మూలం నుంచి పుట్టుకొచ్చిన అధికార తాబేదారీ చర్యలే.

సర్దార్ పటేల్‌ను, నేతాజీ బోస్‌ను చీకటి గదులలోకి తోసివేయజూడటం నుంచి మొదలుకొని, ఇప్పుడు తెలంగాణ తల్లి అనే ప్రజల ఆరాధ్య దేవత విగ్రహాన్ని సచివాలయం ఎదుట నుంచి గాయబ్ చేసి, తమ అధికార ప్రదాతల వంశస్తుడి విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించజూడటం వరకు అన్నీ కూడా ఒకే మూలం నుంచి పుట్టుకొచ్చిన అధికార తాబేదారీ చర్యలే. కానీ, ఆ మాట బయటకు ఒప్పుకోవడం కాస్త ఇబ్బంది అవుతుంది గనుక, అందుకు 'త్యాగాలు' అనే ముసుగు తొడిగి, ప్రచారాలు చేసి, ప్రజలను నమ్మించజూస్తారు. ప్రజలట్లా నమ్మితేనే తమ అధికార జూదం విజయవంతంగా సాగుతుంది గనుక. ఇందులో నెహ్రూకు సంబంధించినంత వరకు త్యాగాలు, అర్హతలు, సమర్థతలు, దార్శనికత విషయంలో ఎటువంటి సందేహాలు లేవు. కుమార్తె ఇందిరను ప్రమోట్ చేసిన బంధుప్రీతి వరకు, అట్లాగే పటేల్, బోస్‌ల స్మృతిని అంతగా బయటకు రానివ్వకపోవటం వరకు నిజమే. వ్యక్తిగత అర్హతల విషయంలో మాత్రం సందేహాలు లేవు. తన వల్ల పార్టీ బతికింది తప్ప, తన మనుగడ కోసం పార్టీని ఉపయోగించుకోవలసిన అగత్యం ఆయనకు ఏర్పడలేదు. అట్లాగే ఆయన ఫెడరల్ నీతికి కట్టుబడి ప్రాంతీయ భావనలను గౌరవించారు తప్ప వాటిని తొక్కివేయజూడలేదు. నెహ్రూ తర్వాత ఈ కోణాల నుంచి అన్నీ మారసాగాయి. ఇందిర, రాజీవ్‌ల హత్యలు తీవ్రంగా ఖండించవలసినవే గాని, పంజాబ్ రాజకీయాలు, స్వర్ణమందిరంపై దాడి, సిక్కుల మనోభావాల విషయంలో ఇందిర గాని, శ్రీలంక వ్యవహారంలో రాజీవ్ గాని మితిమీరిన జోక్యం చేసుకోని పక్షంలో ఆ దురంతాలు సంభవించేవి కావు. కచ్చితంగా చెప్పాలంటే వారిద్దరిది అటువంటి దురంతాలకు బలి కావడం తప్ప, దేశం కోసం త్యాగం కాదు.

దేశం కోసం స్వాతంత్ర్యోద్యమ కాలంలో, ఆ తర్వాతా సర్దార్ పటేల్ ఘనమైన కార్యాలు అనేకం చేసినా, ఆయన కన్నా నెహ్రూయే ప్రధానమంత్రి పదవికి తగిన నాయకుడని స్వయంగా గాంధీజీ నిర్ణయించడంలో ఎన్నో ఆలోచనలు ఉన్నాయి. అవి సరైనవే కూడా. ఆ వివరాలు ఇక్కడ అసందర్భం గాని, కొన్ని లోపాలు ఉన్నప్పటికీ నెహ్రూ మహా నాయకుడు. అయినప్పటికీ 1952 నాటి మొదటి ఎన్నిక గడిచి 1957లో రెండో ఎన్నికలు వచ్చేసరికే ఆయన పార్టీ పలు రాష్ర్టాల్లో పరాజయాలు ఎదుర్కోవడం మొదలైంది. అందులోనే, వైఫల్యాలను నిజాయితీగా అంగీకరిస్తూ.. ప్రజాభిప్రాయాలను గౌరవించి అందుకు తగినట్లు వ్యవహరించక తప్పదని ప్రకటించడంలో ఆయన ప్రజాస్వామికత, గొప్పదనం ఉన్నాయి. కానీ, తన వారసులకు ఇవేమీ లేకపోయాయి. వారు, వారి అనుచరులు తమ నాయకుల కోసం, వారి అధికారం కోసం, అట్లాగే వారిని ఆశ్రయించి తాము కూడా అధికారం సంపాదించుకునేందుకు అన్నింటినీ తొక్కివేయడం సాగించారు. పటేల్, సుభాష్ చంద్రబోస్‌ల స్మృతులను తొక్కివేయటం, ప్రజాస్వామ్యాన్ని తొక్కివేయడం, ఫెడరలిజాన్ని తొక్కివేయడం, ప్రాంతీయ ప్రజాభిప్రాయాలను, సంస్కృతులను తొక్కివేయడం వంటివన్నీ అందులో ఉన్నాయి. ప్రాంతీయ భావనలు, పార్టీలు వరుసగా పుట్టుకువచ్చి కాంగ్రెస్ పుట్టి ముంచింది అందువల్లనే. కనుకనే వారు ప్రతీసారి ఆ పార్టీల వద్ద దేబిరించవలసిన పరిస్థితులు క్రమంగా ఏర్పడ్డాయి. ఇటీవలి 2024 ఎన్నికలతో సహా.

సమస్య ఎక్కడున్నది? ఫ్రాన్స్‌లో బోర్బన్ రాజవంశం ఒకటుండేది. వారి వందల ఏండ్ల చరిత్రలోకి ఇక్కడ పోలేం గానీ, వారికి సంబంధించిన ఒక సామెత ఉంది. వారు తమ చరిత్రకు సంబంధించి ఏదీ మరిచిపోరు, ఏదీ నేర్చుకోరు (ఫర్‌గెట్ నథింగ్, లెర్న్ నథింగ్) అని. కాంగ్రెస్ విషయమై, అంతకన్నా ముఖ్యంగా నెహ్రూ-గాంధీ కుటుంబ విషయమై ఈ సామెత బాగా సరిపోతుంది. వారికి చరిత్ర పాఠాలు నేర్చుకునే లక్షణమే ఉంటే.. పటేల్, సుభాష్ చంద్ర బోస్‌ల స్మృతులను తొక్కివేసి, ఇంకా తొక్కివేస్తూనే ఉండేవారు కాదు.

పటేల్ విగ్రహ ప్రతిష్ఠాపనను బీజేపీకి, ప్రధాని మోదీకి వదలడం గాక తామే ఆ పని చేసేవారు. నేతాజీ చితాభస్మ కలశాన్ని ఎన్నడో జపాన్ నుంచి తెప్పించేవారు. కానీ, ఆ పనులు చేయనిది ఎందుకు? వారికి అధికార లాలస తప్ప ప్రజాభిప్రాయాలను, సంస్కృతిని గౌరవించే సంస్కారం లేదు. ఇంత చేసినా చివరకు అధికారం చేజిక్కించుకోగలమనే భ్రమలు, దురహంకారం కూడా చాలా ఉన్నాయి. రాజీవ్ గాంధీ పేరిట హైదరాబాద్‌లో, తెలంగాణలో ఇప్పటికే తగినన్ని ఉన్నాయి. అయినా మరొక విగ్రహం కావాలంటే, ఒకటి కాకపోతే పది పెట్టుకోవచ్చు. కానీ, తెలంగాణ తల్లి విగ్రహం కోసమని కొంతకాలం కిందటే నిర్దిష్టంగా గుర్తించిన స్థలంలోనే ఆమెను తోసిరాజని మరీ ఆయన విగ్రహం నెలకొల్పడం అంత తప్పనిసరి అవసరమా? అధికార తాబేదారీకి ఒక పరిమితి అక్కరలేదా? పాఠాలు నేర్చుకుంటే వారే బాగుపడతారు. కాస్త ప్రశాంతంగా ఆలోచించే విజ్ఞులెవరూ వారిలో లేరా? పటేల్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉదంతం నుంచి పాఠాలు నేర్చుకోరా?

చేతగాక రోత మాటలు



సంపత్ గడ్డం
78933 03516

అబద్ధాలు చెప్పడం, దుష్ప్రచారాలు చేయడంలో కాంగ్రెస్ నాయకులను, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మించినవారు లేరు. అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు ఇప్పుడు వాటిని నెరవేర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. హామీలను అమలుచేయలేక కేసీఆర్‌పై విషం గక్కే కార్యక్రమాన్ని ముందటేసుకున్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి రోతపుట్టించేలా మాటలు మాట్లాడుతూ, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ అడుగడుగునా నిలదీస్తుండటంతో కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ రాజకీయాలకు తెరదీసింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత దూషణలకు దిగడం, సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఈ కోవలోనివే. తన హోదాను మరిచి రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.


గతంలోనూ రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడటాన్ని మనం చాలాసార్లు చూశాం. దురదృష్టవశాత్తు గతంలో కాలుజారి కేసీఆర్ పడిపోతే.. అసెంబ్లీకి రాలేక ముఖం చాటేస్తున్నారంటూ హేళన చేశారు. ఇప్పుడు తాజాగా రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో చిన్నారుల ముందు మరోసారి జుగుప్సాకరంగా మాట్లాడారు.

అధికారం కట్టబెట్టిన ప్రజలకు మంచి చేయకుండా ప్రతిపక్ష నేతలపై బురదజల్లే కార్యక్రమం ముందటేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ పాలకులు చేస్తున్న వ్యక్తిగత విమర్శల పట్ల ప్రజల్లో అసహనం మొదలైంది.

మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రజల బతుకుల్లో మార్పులు తేవాల్సిందిపోయి... పేర్లు, చిహ్నాల మార్పుతో భవిష్యత్తు తరాలకు తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి గురించి తెల్వకుండా చేయాలని కుట్ర పన్నుతున్నది. మొన్నటి వరకు తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పాలకులు.. ఇప్పుడు ఏకంగా సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టే దుస్సాహసం చేస్తున్నారు. ఇవన్నీ తెలంగాణ సమాజాన్ని అవమానించడమే.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెట్టాలి. ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన ఇతర 400 హామీలను అమలు చేయాలి. కేసీఆర్‌పైనో, గత బీఆర్ఎస్ సర్కార్‌పైనో అభాండాలు వేస్తూ ఎంతో కాలం కాలయాపన చేయలేరు. ఈ విషయాన్ని పాలకులు గ్రహించాలి. రోత మాటలు, రెచ్చగొట్టే ప్రసంగాలు తెలంగాణ సమాజానికి మంచివి కావు.

కేసీఆర్ గుర్తులను చెరిపేస్తానని పదే పదే చెప్తున్న రేవంత్ రెడ్డి ఒక్క విషయాన్ని తెలుసుకోవాలి. కేసీఆర్ గుర్తులను చెరిపేయడమంటే.. తెలంగాణ అస్తిత్వాన్ని కాలరాయడమే. ఆత్మగౌరవం కోసం సబ్బండ వర్గాలు చేసిన పోరాటాన్ని చరిత్ర పుటల్లో నుంచి కనుమరుగు చేయడమే. తెలంగాణ అస్తిత్వానికి ముప్పు వాటిల్లిన ప్రస్తుత తరుణంలో మరోసారి తెలంగాణ సమాజం ముక్తకంఠంతో నినదించాల్సిన అవసరం ఉంది.



'దేశం మేలు కోసం' అని ప్రజలను మభ్యపెట్టి అకస్మాత్తుగా ప్రభుత్వాలు తీసుకొనే నిర్ణయాల వెనుక రాజకీయ దురుద్దేశమే దాగి ఉంటుంది. ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ, మోదీ పాలనలో పెద్ద నోట్ల రద్దు లాంటివి ఆ కోవకు చెందినవే. స్వీయ ప్రయోజనాల కోసం జన జీవితాలను అతలాకుతలం చేసిన నిర్ణయాలివి. ఈ మధ్య సీఎం రేవంత్ రెడ్డి పుర్రెలో పుట్టిన హైడ్రా ధ్వంసరచన కూడా అలాంటి బాపతే. హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూముల రక్షణ పేరిట మొదలైన ఈ సంస్థ దూకుడు వెనుక ఉన్న రాజకీయ కోణం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. ముందుగా చెరువు పరిధిలో ఉన్న కొన్ని కట్టడాలను కూల్చేసి శభాష్ అనిపించుకుని, మెల్లగా ప్రత్యర్థుల ఆస్తుల వైపు హైడ్రా రూటు మార్చింది.

హైడ్రా వెనుక రాజకీయ కుట్ర!



బి.నర్సన్
94401 28169



జన్వాడలో ప్రదీప్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను కూల్చివేసేందుకు రంగం సిద్ధమైంది. హైడ్రా కన్ను ప్రత్యేకంగా ఆ కట్టడంపై పడటానికి కారణం దాన్ని బీఆర్ఎస్ నేత కేటీఆర్ లీజుకు తీసుకోవడమేనని తెలుస్తోంది. ఆ ఫామ్‌హౌజ్ తనది కానప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే దాన్ని దగ్గరుండి మరీ కూల్చివేయిస్తానని కేటీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు కూడా ఇందుకు ముందుకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ముందుజాగ్రత్తగా ప్రదీప్ రెడ్డి తన ఫామ్‌హౌజ్ కూల్చివేతపై స్టే కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం హైడ్రా కూల్చివేతలపై విస్మయం వ్యక్తం చేసింది. అంతేకాదు, ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఒక శాఖ అనుమతి ఇస్తే మరొక శాఖ కూల్చివేస్తుందా? యజమాని వద్దనున్న డాక్యుమెంట్లు చూస్తున్నారా? నోటీసులు ఇస్తున్నారా? బఫర్ జోన్ మార్కింగ్ అయిందా? నీటిపారుదల శాఖ నోటిఫికేషన్ ఉందా? హైడ్రాను ఎలా ఏర్పాటు చేశారు? దాని చట్టబద్ధత ఏమిటి? ఏ నిబంధనలను పాటించి, ఏయే నిర్మాణాలను కూల్చారో వివరించాలంటూ తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేసింది. ఇప్పటికైనా ఒకరు కోర్టు తలుపులు తట్టడం వల్ల హైడ్రా దూకుడుకు కళ్లెం పడే అవకాశం వచ్చింది.

కోర్టు ప్రశ్నల నేపథ్యంలో హైడ్రా ఏకపక్ష ధోరణిపై టీవీల్లో కథనాలు వెలువడుతున్నాయి. 'అన్ని అనుమతులతో కట్టిన అపార్ట్‌మెంట్‌ను ఎలాంటి నోటీసు లేకుండా కూలదోస్తే నా బతుకేం కావాలి?' అని ఓ రియల్టర్ పడుతున్న వేదనను ఓ చానల్ ప్రసారం చేసింది. 'గండిపేట సమీపంలో రెండు రోజుల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెస్టారెంట్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. ఇప్పటికే రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాం. ముందే సమాచారమిచ్చి ఉంటే.. ఏసీలు, ఫ్రిజ్ లాంటి విలువైన వస్తువులనైనా దక్కించుకొనేవాళ్లం' అని దాన్ని లీజుకు తీసుకున్న వ్యాపారి లబోదిబోమంటూ బోరున విలపించారు.

జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం మూలాలను వాడుకొని హైడ్రా ఏర్పడింది. నిజానికి వరదలు, తుఫాన్లు లాంటి ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను ఆదుకొనే సాహస వీరుల దళమిది. ఆ చట్టం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పరిధిని విస్తృతపరిచి నగరంలో అకస్మాత్తు వైపరీత్యాలను సృష్టించే అధికారాలను దానికి కట్టబెట్టింది. అయితే పుట్టగానే పరుగులు పెట్టినట్లు అది రోజూ నగర పరిధిలోని భవంతులను నేలమట్టం చేస్తున్నది. జీహెచ్ఎంసీ ఆధీనంలో పనిచేసే ఈ సంస్థకు రాష్ట్రంలోని వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుచ్ఛక్తి, పోలీస్ విభాగాలు సైన్యంగా తోడుంటున్నాయి. ఆక్రమణదారును ఈ విభాగాలన్నీ కలిసి కదలకుండా చేస్తున్నాయి.

హైడ్రాకు చైర్మన్ సీఎం కాగా.. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. జీవో 99 ద్వారా ప్రభుత్వం ఒక స్వయంప్రతిపత్తి సంస్థగా హైడ్రాకు ఇచ్చిన విస్తృత అధికారాల మూలంగా 'ఈ కూల్చివేతలు ఆగవు, వెనక్కి తగ్గేది లేదు, ఎవరున్నా వదిలేది లేదు' అని దాని కమిషనర్ రంగనాథ్ తెగేసి చెప్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన మున్సిపల్, ఇతర విభాగాల అధికారులపై కూడా చర్యలుంటాయని ఆయన కరాఖండిగా చెప్తున్నారు. ఇప్పటికే ఇరవై చెరువుల పరిధిలోని వంద ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఉన్న చట్ట విరుద్ధమైన నిర్మాణాలను కూల్చివేశామని హైడ్రా ప్రకటించింది. ఈ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తమ ప్రాంతంలోని చెరువులు, పార్కులకు అక్రమార్కుల చెర నుంచి విముక్తి లభిస్తున్నందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కూల్చివేతల్లో రెండు రకాల నిర్మాణాలున్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేసి కట్టిన భవంతులు మొదటి రకానికి చెందినవి. శాస్త్రిపురం చెరువు వద్ద కూల్చివేసిన భవంతి అలాంటిదే. జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు రెండో రకానివి. నిజాంపేట్‌లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని కూల్చివేసిన మూడు భవంతులు ఈ కోవకు చెందినవే. పక్కాగా అధికారుల అనుమతులతో నిర్మిస్తున్నందువల్ల ఎందరో వాటిలో ఫ్లాట్‌లు కొనుక్కొని ఉంటారు. మొదటి రకం నిర్మాణాల కూల్చివేతల వల్ల నష్టపోయేది కబ్జాదారుడే. కానీ, రెండో రకం అలా కాదు. వాటిని కూల్చివేస్తే సాధారణ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఇలాంటి భవంతుల కూల్చివేతల వల్ల బిల్డర్‌కు పోయేదేం లేదు. అందుకే ఈ వ్యత్యాసాన్ని గుర్తించి కూల్చివేతల ప్రాధాన్యాన్ని నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అక్రమ వెంచర్లకు అనుమతులిచ్చిన అధికారులపై కూడా చర్యలుంటాయని హైడ్రా బాస్ రంగనాథ్ అంటున్నారు. కూల్చివేతలతో పాటే ఆ పని కూడా మొదలుపెడితే ప్రజలు సంతోషిస్తారు. వాస్తవానికి చట్టాలను జీహెచ్ఎంసీ సరిగ్గా అమలుచేస్తే ఇలాంటి నిర్మాణాలే ఉండవు. ఎప్పటికప్పుడు నగరంలోని కట్టడాలను పర్యవేక్షిస్తే అనుమతులు లేని పనులేవీ సాగవు. కోట్లాది రూపాయల నిర్మాణ సామగ్రి, ఇంజినీర్ల శ్రమ, కూలీల స్వేదం బూడిదపాలు కావు. దుమ్ము, ధూళి, శిథిలాలతో నగరం సిమెంటు దిబ్బ కాదు. కూల్చివేత ఖర్చు ప్రభుత్వంపై పడదు. తప్పంతా అధికారుల్లో ఉంచుకొని శిక్ష ప్రజలకు వేస్తున్నట్లుంది ఈ వ్యవహారం. చేపట్టిన కార్యం అభినందించదగినదే అయినప్పటికీ అమాయకుడికి శిక్ష పడకూడదనే సహజ న్యాయం అణచివేతకు గురవుతున్నది.

హైడ్రా కూల్చివేతలు ఇలాగే కొనసాగితే నగరంలో అశాంతి నెలకొనవచ్చు. దాని కమిషనర్ పోలీస్ అధికారి కాబట్టి, అంతా మిలిటరీ దాడి లాగా సాగుతోంది. ఒక సర్జికల్ ఆపరేషన్ మాదిరి లక్ష్యం వైపు హైడ్రా పయనిస్తోంది. అయితే ఈ కూల్చివేతల్లో ఒక్క సామాన్యుడు నష్టపోయినా దాని పాపం ప్రభుత్వానిదే. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు. ఒక్కసారిగా తుఫానులా మీద పడకుండా ఏదైనా ఒక న్యాయ సూత్రాన్ని పాటించాలి. కోర్టు సూచనలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి.

నిజంగానే హైదరాబాద్ స్థిరాస్తులను కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే అఖిలపక్షం ద్వారా అన్ని పార్టీలను కలుపుకొని పోవాలి. ఆక్రమణదారులకు ముందుగా నోటీసులిచ్చి వారి వద్ద ఉన్న అనుమతులను పరిశీలించాలి. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి కూడా ఇలాంటి నిర్మాణాలున్నాయని విపక్షాలు అంటున్నాయి. వారి వద్ద నుంచి సమాచారం తీసుకొని ముందుగా అధికార పార్టీ నేతల అక్రమ కట్టడాలను కూల్చి తమ నిజాయితీ నిరూపించుకోవాలి. రాజకీయ దురుద్దేశంతో కాకుండా నగరాన్ని బాగుచేద్దామనే సత్సంకల్పంతో ముందడుగేస్తే అందరూ ముందుకొస్తారు.

నమస్తే తెలంగాణ

ఓవర్ లోడ్ బస్సులను నడపలేం



ములుగు జిల్లా తాడ్వాయి జాతీయ రహదారిపై బస్సును నిలిపిన డ్రైవర్

రెండు చోట్ల ఆర్టీసీ బస్సులను నిలిపిన డ్రైవర్లు • 'బస్సు నీ అయ్యదా? నీదా? ఎవలం దిగేది లేదు' • ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికుల ఆగ్రహం

హుజూరాబాద్ టౌన్/తాడ్వాయి, ఆగస్టు 22: ఆర్టీసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కడంతో.. ఓవర్ లోడ్ బస్సులను నడపలేమంటూ ఇద్దరు డ్రైవర్లు రెండుచోట్ల బస్సులను నడిరోడ్డుపైనే నిలిపారు. ఇలాగైతే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, వెంటనే బస్సు దిగాలని ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను వేడుకున్నా వినిపించుకోలేదు. పైగా 'బస్సు నీ అయ్యదా? నీదా? ఎవలం దిగేది లేదు.. బస్సు పోనియ్యి' అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనలు గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటు చేసుకున్నాయి. సిరిసిల్ల బస్సు వరంగల్ వెళ్తుండగా హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఎక్కారు. డ్రైవర్ చెప్పినా బస్సు దిగలేదు. ఓవర్ లోడ్‌తోనే బస్సును బస్టాండ్ నుంచి బయటకు తీసుకొచ్చి నడిరోడ్డుపైనే నిలిపారు. ప్రయాణికులు సహకరిస్తేనే బస్సు ముందుకు కదులుతుందని చెప్పారు. ఎట్టకేలకు ప్రయాణికులు సహకరించడంతో బస్సు ముందుకు కదిలింది. కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు భూపాలపల్లికి వెళ్లేందుకు మధ్యాహ్నం ప్రయాణికులతో తాడ్వాయికి చేరుకుంది. అక్కడ ఒకే బస్సులో 130 మంది ప్రయాణికులు ఎక్కారు. దీంతో కండక్టర్ కొంత మంది బస్సు దిగాలని, వెనుక వచ్చే బస్సులో ఎక్కాలని సూచించారు. తన మాటను వినకుండా కొందరు మహిళలు వాగ్వాదానికి దిగారు. మహిళల మాటలకు తాళలేక డ్రైవర్ బస్సు దిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వెళ్లేందుకు యత్నించారు. బస్సులో ఉన్న పురుష ప్రయాణికులు డ్రైవర్‌ను సముదాయించడంతో సుమారు 60 మంది ప్రయాణికులు బస్సు దిగారు. డ్రైవర్ 70 మంది ప్రయాణికులతో బస్సు భూపాలపల్లికి వెళ్లిపోయారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నడిరోడ్డుపై నిలిచిపోయిన బస్సు

పెచ్చులూడిన బస్టాండ్ పైకప్పు

ముగ్గురికి గాయాలు.. దవాఖానకు తరలింపు

భైంసా, ఆగస్టు 22: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పైకప్పు పెచ్చులూడి ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికురాలు శ్రీలత తన కూతురు సహస్రతో కలిసి గురువారం నందిపేట్ నుంచి కుభీర్‌కు వెళ్తున్నది. బస్టాండ్ ప్రాంగణంలో కుభీర్ ప్లాట్ ఫాం వద్ద కూర్చున్నది. వారి పక్కనే సంగీత అనే ప్రయాణికురాలు కూడా ఉన్నది. ఇంతలో బస్టాండ్‌లోని పైకప్పు పెచ్చులు ఊడి పడటంతో శ్రీలత చేయికి, తలకు గాయాలయ్యాయి. కూతురు సహస్రకు, సంగీతకు కూడా గాయాలవడంతో వెంటనే చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎం హరిప్రసాద్, ఆర్డీవో కోమల్‌రెడ్డి దవాఖానకు చేరుకుని పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



పెచ్చులు ఊడిన భైంసా బస్టాండ్‌లోని పైభాగం

రాత్రివేళ మహిళలకు ఉచిత ప్రయాణం అబద్ధం

ఎమర్జెన్సీ నంబర్ మాది కాదు..లూథియానా పోలీసులది

సోషల్ మీడియాలో ప్రచారంపై తెలంగాణ పోలీసుల వివరణ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాత్రివేళల్లో మహిళలు పోలీసులకు ఫోన్‌చేస్తే ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తారంటూ రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వార్త బూటకమని తేలింది. ఇది తమపై జరుగుతున్న దుష్ప్రచారమని తెలంగాణ పోలీసులు ఖండించారు. ఎలాంటి ఎమర్జెన్సీ అయినా బాధితులు 100 నంబర్‌కు మాత్రమే ఫోన్ చేయాలని స్పష్టం చేశారు. 'రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య అత్యవసర పరిస్థితి ఉన్న మహిళలు 1091 లేదా 7837018555 నంబర్లకు ఫోన్ చేస్తే.. స్థానిక పోలీసు వాహనం వచ్చిన మిమ్మల్ని సురక్షితంగా ఇంటి వద్ద దించుతుంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. స్పందించిన పోలీస్ శాఖ 7837018555 నంబర్ తమది కాదని, అది పంజాబ్‌లోని లూథియానా పోలీసులకు సంబంధించిందని మిగతా రాష్ట్రాల పోలీసులకు దానితో సంబంధం లేదన్నారు. తెలంగాణ పోలీసులకు సంబంధం లేని విషయాలను వైరల్ చేసి ప్రజలను అయోమయానికి గురిచేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 100కి కాల్ చేయాలని సూచించారు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్‌బీఐ బ్యాంకులో బారులు తీరిన రైతులు

ఎవరు ముందొస్తే వారికే రుణమాఫీ

రోజుకు 30 మంది రైతులకే టోకెన్లు

నర్సింహులపేట, ఆగస్టు 22: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజులపాటు ఆడిట్ పేరుతో రుణమాఫీ డబ్బులు రెన్యూవల్ చేయకపోవడంతో రైతులు బ్యాంకు వద్ద బారులు తీరారు. దీంతో రుణమాఫీ రెన్యూవల్‌కు సంబంధించి గురువారం ఉదయం 30 మంది మాత్రమే బ్యాంక్ అధికారులు టోకెన్లు ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 30 మందికి మాత్రమే రెన్యూవల్ చేస్తే ఇంత మందికి ఎన్ని రోజుల్లో చేస్తారు? బ్యాంకు చుట్టూ ఎన్ని రోజులు తిరగాలి? అని ఆవేదన చెందుతున్నారు. ఎస్‌బీఐ పరిధిలో సుమారు 2800 మంది రుణం తీసుకుంటే 1200 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని అధికారులు చెప్తున్నారు.

బ్యాంకు వద్ద చెప్పులతో క్యూలైన్

మాఫీ అయిందో లేదో తెలుసుకునేందుకు రాక

నెల్లికుదురు ఎస్‌బీఐ వద్ద బారులు తీరిన రైతులు

నెల్లికుదురు, ఆగస్టు 22: పదేండ్ల క్రితం ఎరువులు, విత్తనాల కోసం రైతులు తెల్లవారుజామునే షాపుల ఎదుట చెప్పులు వదిలి క్యూలైన్ కట్టేవారు. ఇప్పుడు అవే పరిస్థితులు వచ్చాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద గురువారం రుణ మాఫీ కోసం రైతులు క్యూలో చెప్పులు పెట్టి ఉదయం 7 గంటల నుంచి అధికారుల కోసం ఎదురుచూశారు. వారు వచ్చాక రైతులు బారులు తీరి రుణ మాఫీ విషయం తెలుసుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. రోజూ బ్యాంకుకు వస్తున్నా ఫలితం మాత్రం లేదని రైతులు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు గ్రామాల వారీగా తేదీలు ప్రకటించకపోవడంతో మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఒకేసారి వచ్చి బ్యాంకు ముందు బారులుదీరారు.



నెల్లికుదురు ఎస్‌బీఐ వద్ద క్యూలైన్‌లో చెప్పులు ఉంచిన రైతులు



జన్నారం ఎస్‌బీఐ మేనేజర్ మహేశ్‌తో రైతుల వాగ్వాదం

డబ్బులిస్తేనే రుణమాఫీ చేస్తా

- **ఎస్‌బీఐ కాంట్రాక్ట్ ఉద్యోగి డిమాండ్**

జన్నారం, ఆగస్టు 22: రుణం మాఫీ చేసేందుకు ఎస్‌బీఐ కాంట్రాక్ట్ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన ఘటన గురువారం మంచిర్యాల జిల్లా జన్నారంలో జరిగింది. హాస్టల్ తండాకు చెందిన మ్యాక ఎర్రయ్యకు రూ.1.5 లక్షల రుణమాఫీ అయినట్టు జాబితాలో వచ్చింది. అయితే, రూ.20 వేల లంచం ఇస్తేనే మాఫీ చేస్తామని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి పరంకుస సాయిరామ్ స్పష్టంచేశాడు. దీంతో గురువారం మధ్యాహ్నం రైతు ఎర్రయ్య ఆ ఉద్యోగికి రూ.15 వేలు ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న రైతులు బ్యాంక్ వద్దకు చేరుకొని మేనేజర్ మహేశ్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సాయిరామ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కవితకు అస్వస్థత ఎయిమ్స్‌లో పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో తీహార్ జైలులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురయ్యారు. ఆమె కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు. దీంతోపాటు ఆమెకు పలు గైనిక్ సంబంధమైన సమస్యలు తలెత్తినట్టు సమాచారం. తీహార్ జైలు అధికారులు గురువారం ఆమెను ఎయిమ్స్‌కు తీసుకువచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నివేదికలను ఎయిమ్స్ వైద్యులు జైలు అధికారులకు పంపించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య

బాలాపూర్‌లో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

బడంగ్‌పేట, ఆగస్టు 22: రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి దారుణహత్యకు గురయ్యాడు. స్థానిక గణేశ్ చౌక్ చౌరస్తా సమీపంలోని మండి@37 రెస్టారెంట్ వద్ద గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో మొంద్రు ప్రశాంత్ (21)ను కత్తులతో దాడి చేసి చంపేశారు. మృతుడు నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం మధ్యలోనే ఆపేశాడు. గురువారం రెస్టారెంట్ ముందు పాన్‌షాపు వద్ద ఉండగా, నలుగురు వ్యక్తులు వచ్చారని, వారిలో ఒక వ్యక్తి కత్తితో ప్రశాంత్‌ను పొడిచారని పోలీసులు తెలిపారు. సిగరెట్ తీసుకొనే దగ్గర గొడవ జరిగిందని డీసీపీ సునీతా రెడ్డి వెల్లడించారు. కాగా, ప్రశాంత్ హత్యపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్‌ఎస్‌యూఐ ఎన్నికల నేపథ్యంలోనే విభేదాలు వచ్చి హత్య జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్‌ఎస్‌యూఐ ఎన్నికల ప్రచారంలోనూ ప్రశాంత్ పాల్గొన్నట్టు తెలిపారు. నిందితులు గంజాయి మత్తులో ఊగుతారని పేర్కొన్నారు. కాగా, నిందితులు కాంగ్రెస్ నేతలను ఆశ్రయించినట్టు సమాచారం.

ఓటరు నమోదుకు అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తప్పొప్పులను సవరించుకునే వీలు కల్పిస్తున్నది. వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1నాటికి 18 ఏండ్లు పూర్తయ్యేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, వచ్చే జనవరి 1న 18 ఏండ్లు నిండేవారి పేర్లను ఈసారి సవరణ జాబితాలో నమోదు చేయనున్నారు.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ వివరాలు..

- **దరఖాస్తుల స్వీకరణ :** అక్టోబర్ 18 వరకు
- **ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల :** అక్టోబర్ 29
- **అభ్యంతరాల స్వీకరణ :** అక్టోబర్ 29-నవంబర్ 28వరకు
- **అభ్యంతరాల పరిష్కారం :** డిసెంబర్ 24
- **ఓటర్ల తుది జాబితా విడుదల:** జనవరి 6, 2025

తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేని వర్షాలు

మరో 5రోజులపాటు వానలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : తెలుగు రాష్ట్రాల్లో మరో 5 రోజులపాటు వర్షాలు కురువనున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. తెలంగాణలో మంచిర్యాల, నిర్మల్, సిరిసిల్ల, కుమ్రంభీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, నిజామాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి జిల్లా రేవెల్లిలో అత్యధికంగా 9.65సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.

జనవరి నుంచి సన్న బియ్యం

మొదటిపేజీ తరువాయి...

గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి విజిలెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్ బియ్యం దారి తప్పితే చర్యలు కఠినంగా ఉంటాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. పట్టుబడితే తక్షణమే డీలర్‌షిప్ రద్దు చేస్తామని తెలిపారు. రేషన్ డీలర్ల ఆదాయం పెంపు దిశగా అడుగులు వేస్తున్నామని, వారి న్యాయమైన డి మాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1,6 29 రేషన్ డీలర్ల భర్తీ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డీఎస్ చవాన్ ఇతర 8 శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లోగా నెల్లికల్లు లిఫ్ట్ భూసేకరణ

నెల్లికల్లు ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులను ఏప్రిల్ మాసాంతానికి పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతికి భూసేకరణ అడ్డుకావద్దని, రైతులతో త్వరితగతిన సంప్రదింపులు జరపాలని సూచించారు. నెల్లికల్లు లిఫ్ట్ పనులపై ఈఎన్సీ అనిల్‌కుమార్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ అజయ్‌కుమార్‌తో సచివాలయంలో గురువారం జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. అటవీశాఖ భూములకు అదనంగా చెల్లించాల్సిన నిధుల ప్రతిపాదనలను రూపొందించాని, పెండింగ్‌లో ఉన్న 23 కోట్ల విద్యుత్తు బకాయిలతోపాటు పెరిగిన బకాయిల ప్రతిపాదనలు తక్షణమే పంపాలని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా నిర్మించతలపెట్టిన చెక్ డ్యామ్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు తీసుకోవడంతోపాటు 5 చెక్ డ్యామ్‌లకు తక్షణమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పాల్గొన్నారు.

..25న కోర్టుకు రండి

మొదటిపేజీ తరువాయి..

దాఖలు చేసిన పరువు నష్టం దావాను కోర్టు విచారణకు స్వీకరించింది. సెక్షన్ 499 ఐపీసీ, 125 పీపుల్స్ రెప్రెజెంటేషన్ చట్టం కింద రేవంత్‌పై పరువునష్టం దావా నమోదైంది. విచారణ సందర్భంగా.. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉత్తర్‌ప్రదేశ్ కేసులో 125 ప్రజాప్రాతినిధ్యం చట్టం గురించి కోర్టు వివరించిందని, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌పై గజేంద్రసింగ్‌షెకావత్ దాఖలు చేసిన కేసులో సమన్లు జారీచేయడాన్ని ఫిర్యాదుదారుడు ప్రస్తావించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

గోడదూకి.. 4 కిలోమీటర్లు నడిచి..

- **ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని పోలీసులకు విద్యార్థుల ఫిర్యాదు**
- **వెంటనే విచారణకు ఆదేశించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేస్తున్నారని, ఆమె నుంచి రక్షించాలంటూ ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. జైనథ్ మండలానికి చెందిన బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న మావలలో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్నది. ఇందులో పదో తరగతి చదువుకుంటున్న 46 మంది విద్యార్థులు ఉదయం 3గంటల సమయంలో స్కూల్ గోడదూకి 4కిలోమీటర్ల దూరం నడిచి ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు ఇటీవల ఈ పాఠశాల ప్రిన్సిపాల్ గంగన్న బదిలీపై వెళ్లగా.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట నుంచి సంగీత ఇక్కడికి వచ్చారని, పాఠశాలలో భోజనం, కరెంటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని అడిగితే ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని, టీసీలు ఇస్తా, బ్యాడ్ కండక్ట్ అని తమ సర్టిఫికెట్లపై రాస్తా అంటూ బెదిరిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వేధింపులు భరించలేక ఐదుగురు పిల్లలు ఆత్మహత్య ఆలోచన చేసినట్టు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు 4 గంటలు పోలీస్‌స్టేషన్‌లో ఉండగా.. పోలీసులు కలెక్టర్, ఎస్పీకి సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు విద్యార్థులకు నచ్చజెప్పి వారికి టిఫిన్ పెట్టించి బస్సుల్లో స్కూల్‌కు పంపించారు.

నాడు పశువుల కాపరి.. నేడు పీహెచ్‌డీ హోల్డర్

జాగ్రఫీలో పీహెచ్‌డీ అందుకున్న కత్తి వీరయ్య



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : నిరుపేద కుటుంబంలో పుట్టి పశువుల కాపరిగా మారిన ఓ యువకుడు, అనంతరం పట్టుదలతో చదివి పీహెచ్‌డీ పట్టా సాధించాడు. అతనే సూర్యాపేట జిల్లా మునగాల మండలం విజయరాఘవపురం(రామసముద్రం)గ్రామానికి చెందిన కత్తి వీరయ్య. ఉస్మానియా యూనివర్సిటీ జాగ్రఫీ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రొఫెసర్ లక్ష్మయ్య గైడెన్స్‌లో 'అప్లికేషన్ ఆఫ్ జీఐఎస్ అర్బన్‌ల్యాండ్ యూజ్ చేంజెస్ ఇన్ సూర్యాపేట మున్సిపల్ ఏరియా నల్లగొండ డిస్ట్రిక్ట్' అనే అంశంపై వీరయ్య పీహెచ్‌డీ పొందారు. తన పాఠశాల విద్యను నేరుగా మూడో తరగతి నుంచి ప్రారంభించానని, నాటి నుంచి నేటి వరకు చదువుతూనే ఉద్యమాల్లో పాల్గొంటూ.. అంబేద్కర్ చెప్పినట్టు మనం ఏ సమాజం నుంచి వచ్చామో ఆ సమాజం అభివృద్ధి కోసం పాటుపడాలనే భావనతో జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూ పీహెచ్‌డీ సాధించినట్టు వీరయ్య తెలిపారు.

మంద కృష్ణ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- **ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి**

ఖైరతాబాద్, ఆగస్టు 22 : మాలలు మనువాదులు అంటూ వ్యాఖ్యానించిన ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి కో కన్వీనర్లు జీ చెన్నయ్య, చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. మంద కృష్ణ వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. మాలలు ఎప్పటికీ అంబేద్కరిస్టులేనని పేర్కొన్నారు. నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మనువాద పార్టీ బీజేపీతో మంద కృష్ణ పొత్తు పెట్టుకున్నట్టు ఆరోపించారు.

అకారణంగా నిర్బంధం

రుణమాఫీపై నిరసనలు పూర్తయ్యాక అదుపులోకి..

చొప్పదండిలో గురువారం రాత్రి కొనసాగిన అరెస్టులు

కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చొప్పదండి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. దహనం చేస్తున్న సందర్భంలో పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లిపోయాక ఇదేరోజు రాత్రి ఒక్కో నాయకున్ని పోలీసులు అరెస్టు చేశారు. ఏనుగు రవీందర్‌రెడ్డిని ఇదే రోజు రాత్రి కరీంనగర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. చొప్పదండి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి శేఖర్‌ను కూడా పోలీసులే అరెస్టు చేసి ఉంటారని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ గన్ను శ్రీనివాస్‌రెడ్డిని కూడా చొప్పదండి పోలీసులు గురువారం రాత్రే అరెస్టు చేశారు. నిరసన కార్యక్రమాలు ముగిసిన తర్వాత బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని వదిలేశారని, మళ్లీ రాత్రి పూట ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందని, దీని వెనక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి ఉన్నదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టంచేస్తున్నారు. మల్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొరండ్ల నరేందర్‌రెడ్డిని గంటన్నర పాటు స్టేషన్‌లో నిర్బంధించారు.



చొప్పదండి ఠాణా వద్ద మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



వర్చువల్‌గా వలంటీర్ల శిక్షణను ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

కమ్యూనిటీ మీడియేటర్లకు శిక్షణ

- **వర్చువల్‌గా ప్రారంభించిన సీజే**

హైదరాబాద్, ఆగస్టు 22, (నమస్తే తెలంగాణ): ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించే నిమిత్తం కమ్యూనిటీ మీడియేటర్ వలంటీర్లకు శిక్షణ తరగతులను గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే హైకోర్టు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల ప్రోత్సాహానికి న్యాయ సేవాధికార సంస్థ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో మూడ్రోజులపాటు శిక్షణ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కే సురేందర్, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



ఆలయ గోదాంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

రాజన్న ఆలయంలో ఏసీబీ సోదాలు

వేములవాడ టౌన్/మన్సూరాబాద్, ఆగస్టు 22: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. రాజన్న ఆలయంలోని ప్రధాన విభాగాల్లో కొద్ది రోజులుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ రేంజ్ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు, ఆడిట్ శాఖలకు చెందిన అధికారులు వివిధ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టారు. పలు విభాగాల్లో తనిఖీలు చేశారు. గోదాం విభాగంతోపాటు లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో వినియోగిస్తున్న సరుకుల శాంపిళ్లను తీసుకున్నారు.

విద్యుత్తు లైన్ల మార్పునకు 18 వేల లంచం

వెంచర్‌లో అడ్డుగా ఉన్న విద్యుత్తు లైన్లను తొలగించి నూతనంగా ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసేందుకు లంచం తీసుకుంటూ విద్యుత్తు శాఖ టెక్నికల్ డీఈ ఏసీబీ అధికారులకు చిక్కారు. గురువారం రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి గ్రామ పరిధిలో ఓ వ్యక్తి రెండు ఎకరాల స్థలంలో వెంచర్ చేస్తున్నాడు. ఆ వెంచర్‌లో నుంచి 33కేవీ, 11కేవీ విద్యుత్తు లైన్లు ఉన్నాయి. వాటిని తొలగించడంతోపాటు హై ఓల్టేజీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వెంచర్ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. ఆ ఫైల్ సరూర్‌నగర్ సర్కిల్ టెక్నికల్ డీఈ టీ రామ్మోహన్ వద్దకు చేరింది. వెంచర్‌లోని విద్యుత్తు లైన్ల షిఫ్టింగ్‌కు రూ.10 వేలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు.

తీరని రుణం.. రైతుల రణం

• ఆలేరులో రైతు గర్జన



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు రైతు ధర్నాలో పాల్గొన్న ప్రసంగిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు సునీతా మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్

• పాలమూరు రణనినాదం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

• ధర్మపురిలో ధర్మపోరాటం



జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో జరిగిన రైతు ధర్నాలో పాల్గొన్న రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

రుణమాఫీ మోసం.. బీఆర్ఎస్ రణం


ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ • గులాబీ శ్రేణుల్లో కదనోత్సాహం • కదం తొక్కిన రైతులోకం

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): 'కొర్రీలొద్దు...కోతలొద్దు.. ప్రతి రైతురూ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి', 'రుణమాఫీలో కోత.. సీఎం మాటలేమో రోత'.. అంటూ గురువారం రాష్ట్రమంతా రైతుల నినాదాలతో మార్మోగింది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు రైతుల నినాదాలతో హోరెత్తాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు సమస్త పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని ప్రదర్శించాయి. కళాకారులు ఆటపాటలతో సర్కార్‌పై గళమెత్తారు. కేటీఆర్ చేవెళ్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పాల్గొనగా, ఆలేరు, జనగామ నియోజకవర్గాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ధర్నాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నరసింహావతారం


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సాక్షిగా రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం ప్రకటించింది. దేవుళ్ల మీద ఒట్టేసి, మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డికి సద్బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, మాధవరం కృష్ణారావు, బీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, మేడె రాజీవ్‌సాగర్, దూదిమెట్ల బాలరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, మంత్రి శ్రీదేవి, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి సహా ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా పాల్గొన్నాయి.

• తొర్రూరులో సమరభేరి




మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రుణమాఫీ ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి

• పిడికిలెత్తిన బాల్కొండ



నిజామాబాద్ జిల్లా బాల్కొండలో జరిగిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో హాజరైన బీఆర్ఎస్ నేతలు, రైతులు

• కదంతొక్కిన సూర్యాపేట



సూర్యాపేట జిల్లా కేంద్రంలో రైతు దీక్షలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నేతలు, రైతులు

• నినదించిన మానుకోట



మహబూబాబాద్‌లో జరిగిన ధర్నాలో నినదిస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

• కరీంనగర్ పాలి కేక



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రైతుధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు

• ఖమ్మం రైతు మలికేక



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

• ప్రణమిల్లిన నర్సాపూర్



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

• పోరుబాట పట్టిన వనపర్తి



వనపర్తి జిల్లా కేంద్రంలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు, రైతులు

• కుమ్రంభీం పోరాట స్ఫూర్తి



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శుక్రవారం FRIDAY 23.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14 + 4 Pages: 14 + 4 | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 79 ॥ వెల (Price) రూ.6.50 | చవితి

శుక్రవారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-36. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: చవితి ఉదయం 10-39 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం: రేవతి రాత్రి 7-54 వరకు. వర్జ్యం: ఉదయం 8-59 నుంచి ఉదయం 10-28 వరకు. రాహుకాలం: ఉదయం 10-44 నుంచి పగలు 12-18 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-43 నుంచి పగలు 1-33 వరకు. అమృతకాలం: సాయంత్రం 5-43 నుంచి రాత్రి 7-10 వరకు.



శాంతియుత నిరసనలను అడ్డుకోవద్దు: సుప్రీం › ll

న్యాయస్థానం విజ్ఞప్తితో వైద్యుల సమ్మె విరమణ



పోలీస్‌స్టేషన్లో జర్నలిస్టు సరిత కంటతడి (ఇన్‌సెట్లో) విజయారెడ్డి

కొండారెడ్డిపల్లిలో గూండారాజ్

- ఇష్టారాజ్యంగా రెచ్చిపోయిన కాంగ్రెస్ మూక
- రుణమాఫీపై ఆరాతీసిన జర్నలిస్టులపై దాడి
- కెమెరాలు, ఫోన్లు, చిప్‌లు లాక్కున్న వైనం
- సీఎం సొంతూరికే వస్తారా అంటూ బెదిరింపు
- కార్లలో వెంటాడి మరీ వేధించిన దారుణం
- పోలీస్‌స్టేషన్‌లోనూ మహిళలపై దౌర్జన్యం
- సాక్ష్యం ఉందా అంటూ పోలీసుల నిర్లిప్తత
- ఎస్పీకి కేటీఆర్ ఫోన్.. ఆ తర్వాతే కదలిక
- ఎస్కార్ట్ ఇచ్చి హైదరాబాద్‌కు పంపిన తీరు
- దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు



మహిళా జర్నలిస్టులపై దాడిచేసిన ఘటనలో నిందితుడు అనిల్. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సన్నిహితంగా ఉన్న ఫొటో (ఫైల్)

సీఎం సొంత ఊరిలో మహిళా జర్నలిస్టులపై దాష్టీకం

ప్రజల పక్షాన ప్రశ్నించడమే నేరమన్నట్టు.. అక్షరంపై అధికారం కక్ష కడుతున్నది. సామాన్యులపై దాడులు సర్వసామాన్యమైన చోట జర్నలిస్టులపైనా దాడులకు తెగబడుతున్నది... ఇద్దరు మహిళా జర్నలిస్టులు ఆవుల సరిత, విజయారెడ్డిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి ప్రగల్భాల నేపథ్యంలో ఆయన సొంతూరు కొండారెడ్డిపల్లిలో వాస్తవ పరిస్థితిని ప్రపంచానికి చెప్పాలనుకోవడమే వారు చేసిన నేరం! సీఎం ఇలాకాలో రైతులు రుణమాఫీపై ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకోవడమే వారు చేసిన పాపం! భజంత్రీలుగా ఉండలేక స్వతంత్రంగా సాహసించడాన్ని మరుగుజ్జు మనస్తత్వం తట్టుకోలేకపోయింది. అంతే.. ఏలికకు కోపం వచ్చింది! పది నిమిషాల్లోనే పదుల సంఖ్యలో గూండాలు రంగంలోకి దిగారు. మహిళా పాత్రికేయులను చుట్టుముట్టారు. గురువారం ఉదయం నుంచి సుమారు నాలుగు గంటలపాటు భయానక కాండ కొనసాగింది. కెమెరాలు, ఫోన్లు గుంజుకున్నారు. వారిని బురదలోకి నెట్టేశారు. తీసుకోబోతే ఒకరికొకరు ఫోన్లు విసిరేసుకుంటూ వెకిలి ఆట ఆడారు. పట్టుకుని వేధించారు. వెళ్లిపోతుంటే వెంటాడారు. పదుల సంఖ్యలో కార్లతో వారిని చేజ్ చేశారు. ఇంత జరుగుతున్నా వారికి రక్షణగా ఎవరూ రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. భీతిల్లిపోయిన మహిళా జర్నలిస్టులిద్దరూ రక్షణ కోరుతూ తామే › 7వ పేజీలో



సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో రుణమాఫీపై వార్తల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టు సరితను అడ్డగించి దాడిచేస్తున్న కాంగ్రెస్ మూకలు

- **రేవంత్ రైతు ద్రోహం.. కేటీఆర్ అల్టిమేటం**

రైతన్న ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

- **రేవంత్ దైవ ద్రోహం.. హరీశ్ పరిహారం**





రైతుల రుణాల మాఫీలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ చేవెళ్లలో గురువారం రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, బీఆర్ఎస్ నేత స్వామిగౌడ్, కార్తీక్‌రెడ్డి తదితరులు



దేవుళ్లపై ఒట్టు పెట్టి మరీ రుణమాఫీ చేయలేకపోయిన సీఎం రేవంత్‌ను క్షమించాలని కోరుతూ యాదగిరిగుట్టలో పూజలు నిర్వహిస్తున్న మాజీమంత్రి హరీశ్, నేతలు కాలేరు వెంకటేశ్, వివేకానంద, లక్ష్మారెడ్డి, గొంగిడి సునీత, దేశపతి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల తదితరులు

గల్లా పట్టి అడుగు.. ఈ సిగ్గులేని సర్కారును!

రుణమాఫీ వదిలేస్తే.. భరోసా ఎగవేతే

- ఇప్పుడు విడిచిపెడితే.. వరుసగా కోతలు పెట్టుకుంట పోతరు
- వందశాతం మాఫీ ఎప్పటిలోగా చేస్తారో తేదీ ప్రకటించాలె
- రుణమాఫీపై రైతులకే కాదు దైవానికీ రేవంత్‌రెడ్డి ద్రోహం
- అధికారులను కాదు.. కాంగ్రెసోళ్లను నిలదీయాలె: కేటీఆర్
- సర్కార్ ధోకాపై బీఆర్ఎస్ నిరసన.. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఆగస్టు 15లోగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్టేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా రుణమాఫీ చేయకుండా దైవ ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. రుణమాఫీపై నమ్మించి మోసం చేసిన సిగ్గులేని కాంగ్రెస్ సర్కారును గల్లాపట్టి అడగాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి ప్రజలు తనను నమ్మరని భావించి ఎక్కడికిపోతే అక్కడ దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులతో ఓట్లు వేయించుకొని రేవంత్‌రెడ్డి అవతలపడ్డారని మండిపడ్డారు. 'పంద్రాగస్టులోగా రైతులందరికీ రుణమాఫీ చేయలేదని తేలిపోయింది. ఎప్పటిలోగా వందశాతం రుణమాఫీ చేస్తావో గడువు తేదీని ప్రకటించు' అని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. రుణమాఫీకి రూ.49 వేల కోట్లు › 5వ పేజీలో

కేసీఆర్ హయాంలో 72 లక్షల మంది రైతులకు రైతుబంధు వేశాం. అప్పుడు లేని సమస్యలు ఇప్పుడెందుకు వస్తున్నయ్. రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తున్నారు. మనం అడగాల్సింది అధికారులను కాదు. రుణమాఫీ ఎందుకు కాలేదని ఓట్లు వేసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ గల్లా పట్టి నిలదీయాలె.

> మాటలు చెప్పినంత ఈజీ కాదు ప్రభుత్వాన్ని నడపడం. చెట్టుకు కట్టేసి కొడుతా, తొండలు జొర్రకొడుతా అని గతంలో రేవంత్ మాట్లాడిండు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే అదే పని ఆయనకు ప్రజలు చేస్తారు. ఒక్క రుణమాఫీ మాత్రమే కాదు.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్ల మీద కూడా వెంటపడుతం. - కేటీఆర్



తుంగతుర్తి మండలం తిరుమలగిరిలో ధర్నా టెంటును కూల్చివేసి, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొడ్తున్న పోలీసులు

నిరసనపై కాంగ్రెస్ విధ్వంసకాండ

- బీఆర్ఎస్ శాంతియుత ధర్నాపై దాడి.. రాళ్లు, గుడ్లు విసిరి కాంగ్రెస్ మూకల వీరంగం
- పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలు.. నేతల కార్లు, వాహనాల అద్దాలు ధ్వంసం
- గంటపాటు బీభత్సం.. చేష్టలుడిగిన పోలీసులు.. తుంగతుర్తి నియోజకవర్గంలో ఘటన
- గాయపడినవారిని పరామర్శించేందుకు వస్తున్న మాజీ మంత్రిని అడ్డుకున్న పోలీసులు
- రేవంత్ డైరెక్షన్‌లోనే దాడులు.. మోసాలను కప్పిపుచ్చేందుకు హింస : జగదీశ్‌రెడ్డి › 4

రేవంత్.. నీ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకో!

- రుణమాఫీపై రైతులనే కాదు.. దేవుళ్లను మోసం చేసిన చరిత్ర నీది
- రేవంత్‌ను క్షమించాలని, ప్రజలను కాపాడాలని నర్సన్నకు మొక్కినం
- 46% మందికే రుణమాఫీ.. పూర్తిగా చేయలేదని మంత్రులే చెప్తున్నరు
- రుణమాఫీపై శ్వేతపత్రం ఇవ్వాలి.. 7 నెలల వడ్డీని సర్కారే భరించాలి
- త్వరలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతు యాత్ర: మాజీ మంత్రి హరీశ్
- సీఎం పాపం ప్రజలకు తాకకుండా యాదగిరిగుట్టలో పరిహార పూజలు
- ఆలేరు, జనగామలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన

యాదాద్రి భువనగిరి/జనగామ, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పాప పరిహారం కోసం తాను ఒట్టు పెట్టిన దేవుళ్ల వద్దకు వెళ్లి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో దగా పడుతున్న రాష్ట్ర రైతాంగానికి అండగా నిలబడేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో రైతుయాత్ర చేపడుతారని వెల్లడించారు. గురువారం ఆయన పలువురు బీఆర్ఎస్ నేతలతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ తూర్పు గోపురం వద్ద పాప పరిహార పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత హరిత హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత ఆలేరు పట్టణంలో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే పల్లా › 4వ పేజీలో

సెప్టెంబర్ 1 నుంచి స్పామ్ మెసేజ్‌లను నిషేధించండి › ll

టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశం

గ్రూప్-2 షెడ్యూల్ విడుదల


డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీ కోసం పరీక్ష తేదీలను టీజీపీఎస్సీ కొత్తగా విడుదల చేసింది. ఈ పరీక్షలను డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం వెబ్‌నోట్ విడుదల చేసింది. ఈ పరీక్షలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, 3, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు పేపర్ 2, 4 పరీక్షలు నిర్వహించనున్నారు.

పేపర్/సబ్జెక్టు.. పరీక్ష తేదీ

- **పేపర్-1** జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ — డిసెంబర్ 15, 2024 (ఉదయం)
- **పేపర్-2** హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ — డిసెంబర్ 15, 2024 (మధ్యాహ్నం)
- **పేపర్-3** ఎకనామిక్స్ అండ్ డెవలప్‌మెంట్ — డిసెంబర్ 16, 2024 (ఉదయం)
- **పేపర్-4** తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ — డిసెంబర్ 16, 2024 (మధ్యాహ్నం)

ఖర్గేను కాదనలేక.. అదానీని అనలేక!



అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఈడీ ఆఫీసు ముందు కాంగ్రెస్ ధర్నాలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

- ఈడీ ఆఫీస్ ముందు ధర్నాలో ముఖ్యమంత్రి తర్జన భర్జన
- అదానీని విమర్శించేందుకు నోరు రాని రేవంత్‌రెడ్డి
- సెబీ చైర్‌పర్సన్ రాజీనామా, బర్తరఫ్‌పైనే ఫోకస్ › 8
- సంబంధం లేకున్నా రాజీవ్ విగ్రహ ప్రస్తావన
- కేసీఆర్, కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలకే పరిమితం
- విస్మయం వ్యక్తం చేస్తున్న రాజకీయ విశ్లేషకులు

వచ్చే నెల 25న కోర్టుకు రండి!

సీఎం రేవంత్‌కు కోర్టు సమన్లు

రిజర్వేషన్ల మీద తప్పుడు ప్రచారంపై బీజేపీ నేత కేసు

నాంపల్లి కోర్టులు, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): బీజేపీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు గురువారం సమన్లు జారీచేసింది. వచ్చే నెల 25న ఆయన గానీ, ఆయన తరఫున న్యాయవాది గానీ కోర్టుకు హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు › 10వ పేజీలో

జనవరి నుంచి సన్నబియ్యం

- పీడీఎస్ బియ్యం దారితప్పితే చర్యలు
- పట్టుబడితే ఏకంగా డీలర్ షిప్ రద్దు
- డీలర్ల సమస్యలను పరిష్కరిస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తామని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సచివాలయంలో › 10వ పేజీలో

156 ఫిక్స్‌డ్ డోస్ మందులపై నిషేధం

న్యూఢిల్లీ : 156 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందులపై కేంద్రం నిషేధం విధించింది. జ్వరం, జలుబు, అలెర్జీలు, నొప్పుల కోసం ఉపయోగించే యాంటీబ్యాక్టీరియల్ మందులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటి వల్ల హాని జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సురక్షితమైన ప్రత్యామ్నాయ మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం ఈ నెల 12న జారీ చేసింది. రెండు లేదా మూడు క్రియాశీలక ఔషధ పదార్థాలు నిర్దిష్ట నిష్పత్తిలో ఉండే మందులను ఎఫ్‌డీసీ మందులు అంటారు. వీటిని కాక్‌టెయిల్ డ్రగ్స్ అని కూడా పిలుస్తారు. నొప్పుల నుంచి ఉపశమనం కోసం ఉపయోగించే అసెక్లోఫెనాక్ 50 ఎంజీ+పారాసిటమాల్ 125 ఎంజీ ట్యాబ్లెట్ కాంబినేషన్ కూడా నిషేధానికి గురైన ఎఫ్‌డీసీ మందుల జాబితాలో ఉంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ఈ ఎఫ్‌డీసీలను అధ్యయనం చేసి, ఇవి అహేతుకమైనవని చెప్పిందని ఈ నోటిఫికేషన్ పేర్కొంది.

సెప్టెంబర్ 1 నుంచి ఆ మెసేజ్‌లను నిషేధించండి

టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: టెలికాం కంపెనీలకు భారత టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి వినియోగదారులకు ఏపీకే ఫైల్స్, యూఆర్ఎల్‌లు, ఓటీటీ లింక్‌లు, బ్లాక్ లిస్టులో ఉన్న కాల్‌బ్యాక్ నెంబర్లతో కూడిన మెసేజ్‌లను పంపరాదని ఆదేశించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని తెలిపింది. కొంతమంది మోసగాళ్ల బారి నుంచి వినియోగదారుల రక్షణ, స్వచ్ఛమైన మెసేజింగ్ విధానం కోసం ఈ ఆదేశాలు జారీ చేసినట్టు ట్రాయ్ తెలిపింది. అలాగే టెలీమార్కెటింగ్ కాల్స్‌కు సంబంధించి ట్రాయ్ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. సెప్టెంబర్ 30 నుంచి అన్ని టెలీ మార్కెటింగ్ కాల్స్‌కు సంబంధించిన నెంబర్లు విధిగా '30 140'తో ప్రారంభం కావాలి. కాగా, రిజిస్టర్ కాకుండా స్పామ్ కాల్స్ చేస్తున్న టెలీమార్కెటీర్ల నెంబర్లను రెండేండ్ల పాటు బ్లాక్ లిస్టులో పెట్టాలని గత వారం ట్రాయ్ టెలికం కంపెనీలకు ఆదేశాలు ఇచ్చింది.



నటుడు విజయ్ పార్టీ జెండా ఆవిష్కరణ

చెన్నై: తమిళ సినీ నటుడు విజయ్ ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ తమిళగ వేట్రి కళగం (టీవీకే) జెండాను గురువారం ఆవిష్కరించారు. పనైయూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జెండా పైన, కింద జేగురు (మెరూన్) రంగు, మధ్యలో పసుపు రంగు ఉన్నాయి. మధ్యలో రెండు ఏనుగులు, వాటి మధ్యలో వాగాయ్ పువ్వు ఉంది. వాగాయ్ అంటే తమిళంలో విజయం అని అర్థం. విజయ్ మాట్లాడుతూ, టీవీకే పార్టీ జెండా వెనుక చారిత్రక ప్రాధాన్యం ఉందని, రాష్ట్ర స్థాయి సమావేశంలో దాని గురించి వివరిస్తానని చెప్పారు. తాను దీనిని జెండాగా భావించడం లేదని, తమిళనాడు భావి తరాల విజయకేతనంగా భావిస్తున్నానని తెలిపారు. విజయ్ పార్టీతో తమిళ రాజకీయాల్లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరుగుతాయి.

రాజకీయం చేయకండి

- కోల్‌కతా హత్యాచార ఘటనపై కేంద్రం, బెంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇచ్చిన సీబీఐ
- ఎఫ్ఐఆర్‌కు ముందే పోస్టుమార్టమా?
- క్రైమ్‌సీన్‌ను భద్రపర్చడంలో నిర్లక్ష్యం
- ఎఫ్ఐఆర్ నమోదుకు 14 గంటలా?
- బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్నలు
- నా 30 ఏండ్ల వృత్తి జీవితంలో ఇలాంటి ప్రక్రియ చూడలేదు: జస్టిస్ పార్దివాలా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను రాజకీయం చేయొద్దని కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల తరఫు న్యాయవాదులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించారు. గురువారం కోల్‌కతా ఘటనపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపు న్యాయవాది కపిల్ సిబల్ మధ్య తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా కోర్టు చర్యలు తీసుకోవాలని కపిల్ సిబల్ కోరగా తుషార్ మెహతా స్పందిస్తూ..'పశ్చిమ బెంగాల్ మంత్రి ప్రకటన మా దగ్గర ఉంది. వారి లీడర్‌కు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వేళ్లు నరికేస్తామని చెప్పారు.' అని వ్యాఖ్యానించారు. దీనికి కపిల్ సిబల్ బదులిస్తూ.. 'నేను కూడా బెంగాల్ ప్రతిపక్ష నేత ప్రకటన చదువుతా. బుల్లెట్లు పేలుతాయని సువేందు అధికారి అన్నారు' అని పేర్కొన్నారు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్.. 'దయచేసి దీనిని రాజకీయం చేయకండి. వేగవంతమైన, సమర్థమైన విచారణ తర్వాత చట్టం తన పని తాను చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. కాగా, వాదనల సందర్భంగా కపిల్ సిబల్ నవ్వారని ఆరోపిస్తూ తుషార్ మెహతా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రైమ్ సీన్‌ను మార్చేశారు: సీబీఐ

హత్యాచార ఘటనపై విచారణ జరుపుతున్న సీబీఐ గురువారం ఉదయం దర్యాప్తు పురోగతిపై సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. ఘటన జరిగిన ఐదో రోజున సీబీఐ దర్యాప్తు బాధ్యతను తీసుకుందని, అప్పటికే క్రైమ్ సీన్‌ను మార్చేసినట్టు సీబీఐ తరపున తుషార్ మెహతా పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పట్టుబట్టినా వినలేదని, అంత్యక్రియలు పూర్తైన తర్వాత రాత్రి 11.45కు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ఇది నేరాన్ని కప్పిపెట్టే ప్రయత్నమే అని అన్నారు. మృతురాలి కుటుంబాన్ని తప్పుదోవ పట్టించారని, వారి కూతురు ఆత్మహత్య చేసుకుందని బెంగాల్ పోలీసులు చెప్పారని తెలిపారు. అయితే, అంతా వీడియో తీశారని, క్రైమ్ సీన్ ఏమీ మార్చలేదని కపిల్ సిబల్ పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో ఆర్జీ కార్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, మరో నలుగురు వైద్యులకు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు అనుమతించింది.



కోల్‌కతా వైద్య విద్యార్థిని మృతి కేసును విచారణ చేస్తున్న సుప్రీం కోర్టు ధర్మాసనం

కేసు నమోదుకు ముందే పోస్టుమార్టమా?: సుప్రీం

ట్రైనీ డాక్టర్‌ది అసహజ మరణమని కేసు నమోదు చేయడానికి ముందే పోస్టుమార్టం జరిపేయడం తీవ్రంగా కలవరపరుస్తున్నదని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా వ్యాఖ్యానించారు. ఈ ఘటనను మొదటిసారి నమోదు చేసిన పోలీస్ అధికారి విచారణకు రావాలని ధర్మాసనం ఆదేశించింది. ఘటన జరిగినట్టు ఉదయం 10.10 గంటలకు జనరల్ డైరీలో నమోదైతే క్రైమ్ సీన్‌ను భద్రపర్చడం, ఆధారాలను సీజ్ చేయడం వంటివి రాత్రి 11.30కు చేయడం తీవ్రమైన విషయమని కోర్టు వ్యాఖ్యానించింది. 'ఈ కేసులో మీ రాష్ట్రం(బెంగాల్) పాటించిన మొత్తం ప్రక్రియను నా 30 ఏండ్ల వృత్తి జీవితంలో ఎన్నడూ చూడలేదు' అని కపిల్ సిబల్‌ను ఉద్దేశించి జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. ఘటన జరిగిన తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఎందుకు 14 గంటల సమయం పట్టిందని కపిల్ సిబల్‌ను సీజేఐ ప్రశ్నించారు.

వైద్యుల భద్రతకు వెంటనే చర్యలు తీసుకోండి

దేశవ్యాప్తంగా వైద్యుల భద్రత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర వైద్య శాఖ కార్యదర్శి వారం లోగా అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో మాట్లాడి వైద్యుల భద్రతకు భరోసా కల్పించాలని సూచించింది. తాము ఏర్పాటుచేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్ అందరి సూచనలు తీసుకొని వైద్యుల భద్రత కోసం ఒక జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందిస్తుందని పేర్కొన్నది.



ధర్నా చేస్తూనే కోర్టు విచారణను వీక్షిస్తున్న ఆర్‌జీ కర్ దవాఖాన వైద్యులు

శాంతియుత నిరసనలను అడ్డుకోవద్దు

- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం
- వెంటనే విధుల్లో చేరాలని వైద్యులకు సూచన
- సమ్మె విరమిస్తున్నట్టు వైద్య సంఘాల ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 22: శాంతియుతంగా చేసే నిరసనలను అడ్డుకోవద్దని, అంతరాయం కలిగించొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోల్‌కతా హత్యాచార ఘటనను గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 'శాంతియుత నిరసనలను అడ్డుకోవద్దని, అంతరాయం కలిగించొద్దని మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఈ ఘటనకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దు' అని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌తో ధర్మాసనం పేర్కొన్నది. నిరసనలు తెలియజేస్తున్న వైద్యులు, విద్యార్థులకు ఆబ్సెంట్ వేస్తున్నారని, పరీక్షలు రాయనివ్వడం లేదని ఎయిమ్స్ నాగ్‌పూర్ వైద్యుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే, విధులకు రాకపోయినా, హాజరైనట్టు నమోదు చేయమని తాము ఆదేశించలేమని కోర్టు పేర్కొన్నది.

న్యాయం, వైద్యం ఆగిపోవద్దు

న్యాయం, వైద్యం ఆగిపోవడానికి వీలు లేదని, వైద్యులు వెంటనే విధుల్లోకి చేరాలని కోర్టు సూచించింది. విధుల్లోకి చేరిన వైద్యులు, సిబ్బందిపై నిరసనల్లో పాల్గొన్నందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది.

సమ్మె విరమించిన వైద్యులు

కోల్‌కతా ఘటనకు నిరసనగా 11 రోజులుగా కొనసాగుతున్న సమ్మెను వైద్యులు విరమించారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు సమ్మె విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ గురువారం ప్రకటించింది. ఢిల్లీ ఎయిమ్స్, ఆర్ఎంఎల్ వైద్యులు సైతం సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్టు ప్రకటించారు. ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆగస్టు 12 నుంచి దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మె ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎమర్జెన్సీ సేవలకు మాత్రం వైద్యులు హాజరయ్యారు. కాగా, పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ మాత్రం సమ్మెను కొనసాగిస్తామని చెప్పింది.

నిందితుడిలో కనిపించని పశ్చాత్తాపం

కోల్‌కతా: ఆర్‌జీ కర్ దవాఖానలో ట్రైనీ డాక్టర్ (31) హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ (33) పశు ప్రవృత్తి కలవాడని, అశ్లీలతకు బానిస అని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వర్గాలు తెలిపాయి. సంజయ్ మానసిక స్థితిని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన వైద్య బృందం విశ్లేషించినపుడు ఈ విషయం తెలిసింది. నిందితుడు పశ్చాత్తాపం వ్యక్తం చేయడం లేదని, జరిగిన ప్రతి విషయాన్నీ గుక్కతిప్పుకోకుండా వివరించాడని సీబీఐ వర్గాలు తెలిపాయి. నేరం జరిగిన ప్రదేశంలో సంజయ్ ఉన్నట్లు తెలిపే సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని చెప్పాయి. ఈ కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించిన సంగతి తెలిసిందే.

దేశంలో రోజుకు 90 రేప్ కేసులు

అత్యాచార నేరాలపై కఠిన చట్టాలు చేయాలి.. మోదీకి మమత లేఖ

కోల్‌కతా, ఆగస్టు 22: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ దవాఖానలో హత్యాచార ఘటనతో దేశం అట్టుడుకుతున్న క్రమంలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి గురువారం లేఖ రాశారు. అత్యాచార నేరాలలో నేరస్తులకు తీవ్రమైన శిక్షను విధించేలా కేంద్రం కఠిన చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ కేసుల విచారణ త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. సీఎం ప్రధాన సలహాదారు అలపన్ బందోపాధ్యాయ గురువారం ఆ లేఖను మీడియాకు చదివి వినిపించారు. దేశంలో రోజుకు దాదాపు 90 లైంగిక దాడి కేసులు నమోదవుతున్నాయని, అందులో చాలామంది బాధితులు హత్యకు గురవుతున్నారని మమత తన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా కేంద్రం చట్టంలో మార్పులు చేయాలని కోరారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి విచారణ 15 రోజుల్లో ముగించాలని ఆమె ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

బడిలోనే రక్షణ లేకపోతే విద్యాహక్కుకు అర్థమే లేదు

బద్లాపూర్ కేసును సుమోటోగా స్వీకరించిన బాంబే హైకోర్టు

ముంబై: మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో పసిపిల్లలపై ఓ పాఠశాల స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనను బాంబే హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. పిల్లలకు పాఠశాలలు సురక్షితం కాకపోతే.. ఇక విద్యాహక్కు గురించి మాట్లాడటంలో అర్థం లేదని పేర్కొన్నది. ఈ కేసులో పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజాగ్రహం తీవ్ర స్థాయిలో వ్యక్తం కాకపోతే, అధికార యంత్రాంగం కదలడం లేదని దుయ్యబట్టింది. ఇద్దరు బాలికలపై లైంగిక దాడి ఘటన అమానుషమైనది మాత్రమే కాకుండా, అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొంది. బద్లాపూర్ పోలీసులు నిర్వహిస్తున్న ఒరిజినల్ కేస్ డైరీ, ఎఫ్ఐఆర్ నకలు, ఈ కేసుకు సంబంధించిన ఇతర పత్రాలను ఈ నెల 27న సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు బాలికలపై లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. 3-4 ఏళ్ల వయసుగల ఈ ఇద్దరిపైనా అదే పాఠశాలలో పని చేస్తున్న పురుష అటెండెంట్ లైంగిక దాడి చేసినట్లు తెలియడంతో పెద్ద ఎత్తున ప్రజాగ్రహం వ్యక్తమైంది. ఈ నెల 12, 13 తేదీల్లో ఈ దారుణం జరిగినప్పటికీ పోలీసులు ఈ నెల 16న కేసు నమోదు చేశారు.

బెంగళూరులో నల్లా బిల్లుల మోత!

- పరోక్షంగా చెప్పిన డిప్యూటీ సీఎం డీకే
- వాటర్ బోర్డు నష్టాల్లో ఉందని ప్రకటన

బెంగళూరు, ఆగస్టు 22: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనుంది. బెంగళూరులో నల్లా బిల్లులు పెంచాలని సిద్ధరామయ్య సర్కారు భావిస్తున్నది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి, బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి డీకే శివకుమార్ పరోక్షంగా వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నల్లా బిల్లులు పెంచాలనే ప్రతిపాదన ఏడెనిమిది ఏండ్ల నుంచి ఉంది. వాటర్ బోర్డు(బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) నష్టాలతో నడుస్తున్నది. కరెంటు బిల్లులు కట్టడానికి కూడా పైసలు లేవు. పనులు ఎలా చేయాలి? వేరే మార్గం లేదు. క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా ప్రజలపై ఏదో ఓ భారం వేస్తూ వస్తున్నది. రెండు నెలల క్రితమే కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పాల ధరలను లీటరుకు రూ.2 పెంచింది. ఏడాదిలో ధరలు పెంచడం ఇది రెండోసారి. ఆ తర్వాత పెట్రో ధరలపై సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.02 పెరిగింది. ఇప్పుడు బెంగళూరు వాసుల నల్లా బిల్లులు పెంచేందుకు సిద్ధమైంది.

గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చేసిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్ లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

అవసరమనుకుంటే ఆ లేఖపై విచారణ.. ముడా స్కామ్‌పై కర్ణాటక హోంమంత్రి

సీఎం సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి 2014లో 'మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ముడా)కి రాసిన లేఖను ట్యాంపరింగ్ చేశారని, అందులోని కొన్ని వ్యాఖ్యల్ని వైట్‌నర్‌తో చెరిపివేశారన్న ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలపై అవసరమనుకుంటే, సిట్ లేదా దర్యాప్తు సంస్థ దృష్టిసారిస్తుందని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర చెప్పారు. అత్యంత ఖరీదైన విద్యానగర్ లే-అవుట్‌లో తనకు భూమి ఇవ్వాలని బీఎం పార్వతి ఆ లేఖలో కోరారు. అయితే, దీనిని వైట్‌నర్‌తో ఉద్దేశపూర్వకంగా కొట్టివేశారు. ముడా కుంభకోణం బయటపడ్డాకనే ఆధారాలు చెరిపేయాలనే లక్ష్యంతోనే ఇలా కొట్టేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ, 'ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలేంటో నాకు తెలియదు. కానీ, సీఎం భార్య రాసిన లేఖలోని అంశాలపై అవసరమనుకుంటే దర్యాప్తు సంస్థ దృష్టి సారిస్తుంది' అని చెప్పారు.

అక్రమాస్తుల కేసులో డీకేను ప్రశ్నించిన లోకాయుక్త



అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డీకే శివకుమార్ గురువారం లోకాయుక్త పోలీస్ ముంగిట హాజరయ్యారు. కేసుకు సంబంధించి మూడు గంటల పాటు ఆయన్ని లోకాయుక్త అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. రాష్ట్ర మంత్రిగా డీకే 2013-18 మధ్య పెద్ద ఎత్తున అక్రమాస్తులు ఆర్జించారని సీబీఐ 2020 సెప్టెంబర్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో వచ్చాక, కేసును సీబీఐ నుంచి లోకాయుక్తకు బదిలీ చేసింది. సీబీఐ విచారణను నిరాకరించింది. అయినప్పటికీ కేసు దర్యాప్తు సీబీఐ ఆపటం లేదని డీకే శివకుమార్ మండిపడ్డారు. 'సీబీఐ ఈ కేసును విచారించటం ఆపాలి. కానీ అలా చేయటం లేదు. నన్ను, నా వాళ్లను సీబీఐ వేధిస్తున్నది. నాకు సమన్లు ఇవ్వకుండా, నన్ను విచారణ చేయకుండా, నా బంధువులు, స్నేహితుల్ని వేధిస్తున్నది. లోకాయుక్త కూడా అదే చేస్తున్నది' అని డీకే అన్నారు.

అమెరికాలో వ్యభిచారం కేసులో

తెలుగు వ్యక్తుల అరెస్ట్

టెక్సాస్ : అమెరికాలోని టెక్సాస్‌లో వ్యభిచారం కేసులో తెలుగువారు అరెస్టయ్యారు. వ్యభిచారాన్ని నిరోధించే లక్ష్యంతో టెక్సాస్‌లోని డెంటాన్ కౌంటీ పోలీసులు ఈ నెల 14, 15 తేదీల్లో జరిపిన దాడుల్లో లైంగిక సేవలను పొందడానికి వచ్చిన 21 మందిని అరెస్ట్ చేశారు. అందులో భారత్‌కు చెందిన ఏడుగురు విటులు కూడా ఉన్నట్టు డెంటాన్ కౌంటీ షరీఫ్ కార్యాలయం తెలిపింది. అరెస్టయిన వారిలో నిఖిల్ కుమ్మరి, గల్లా మోనిష్, కార్తీక్ రాయపాటి, నబీన్ శ్రేష్ఠ, అమిత్ కుమార్, జైకిరణ్ రెడ్డి మేకల ఉన్నారు. డెంటాన్ వాసులైన నిఖిల్ బండి, నిఖిల్ కుమార్‌లు అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారన్న ఆరోపణలపై అభియోగాలు నమోదు చేసినట్టు చెప్పారు. మిగిలిన ఐదుగురు విటులు లైంగిక సేవలు పొందడానికి రాగా, అరెస్ట్ చేశామన్నారు. వారిలో జైకిరణ్‌పై 18 ఏండ్లలోపు మైనర్‌తో వ్యభిచారానికి ప్రయత్నించినట్టు అదనపు అభియోగాలు నమోదు చేశారు.

టెక్సాస్‌లో 90 అడుగుల హనుమాన్ విగ్రహం



హ్యూస్టన్: అమెరికాలోని టెక్సాస్‌లో 90 అడుగుల ఎత్తైన హనుమంతుడి కాంస్య విగ్రహం ఏర్పాటైంది. ఇది అగ్రరాజ్యంలోనే మూడో అతిపెద్దది. దీనికి 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' (ఐక్యతా విగ్రహం) అని పేరు పెట్టారు. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన విగ్రహాల్లో ఒకటైన ఇది.. భారతదేశం వెలుపల ఉన్న అత్యంత ఎత్తైన ఆంజనేయుడి విగ్రహంగానూ రికార్డులకెక్కింది. టెక్సాస్‌లోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా మరో రికార్డు కూడా సొంతం చేసుకుంది. సుగర్ ల్యాండ్‌లోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో చినజీయర్ స్వామి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి 18 వరకు ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిస్వార్థం, భక్తి, ఐక్యతకు గుర్తుగా ఈ విగ్రహాన్ని నిర్వాహకులు అభివర్ణించారు.



రైతు సమస్యల పరిష్కారానికి

త్వరలో కమిటీ

సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి త్వరలో కొందరు సభ్యులతో ఒక కమిటీని వేయనున్నట్టు సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. రైతులకు సంబంధించిన తాత్కాలిక సమస్యలను ఈ కమిటీకి తెలియజేయాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాలను ఆదేశించిన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కేసును సెప్టెంబర్ 2వ తేదీకి వాయిదా వేసింది. తమ డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 13 నుంచి ఆందోళన చేస్తున్న రైతులను కలిసి హైవేపై నిలిపి ఉంచిన ట్రాక్టర్లు, ట్రాలీలను తొలగించేందుకు ఒప్పించాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు సూచించింది. రైతుల నిరసనలను నిరోధించడానికి శంభు సరిహద్దు వద్ద అంబాలలో హర్యానా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



ఒళ్లంతా పచ్చబొట్లతో గిన్నిస్ రికార్డ్

లండన్, ఆగస్టు 22: అత్యధిక పచ్చ బొట్లు కలిగిన వ్యక్తిగా అమెరికా మహిళ ఎస్పరెన్స్ లుమినెస్కా ఫ్యూయెర్‌జినా(36) గిన్నిస్ రికార్డ్ సృష్టించారు. 99.98 శాతం శరీరాన్ని ఆమె పచ్చబొట్లతో నింపేశారు. 'చీకటిని అందంగా మార్చడం' అనే ఇతివృత్తంతో తన దేహాన్ని కాన్వాస్‌గా మార్చుకున్నారు. బ్రిడ్జ్‌పోర్ట్‌కు చెందిన ఈ మాజీ ఆర్మీ ఉద్యోగిని అందమైన డిజైన్ల పచ్చబొట్లతో శరీరాన్ని నింపేశారు. గిన్నిస్ రికార్డ్ కలిగిన వారిని ప్రశంసిస్తూ పెరిగిన ఆమె తనకు రికార్డ్ దక్కడంపై కృతజ్ఞతలు తెలిపారు. మహిళల శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి పచ్చబొట్ల రికార్డ్‌తో ప్రయత్నించానని చెప్పారు.

2,492 క్యారెట్ల భారీ వజ్రం

బోట్స్‌వానా గనిలో లభ్యం.. గత వందేండ్లలో అతిపెద్దది



న్యూఢిల్లీ : బోట్స్‌వానాలోని సుప్రసిద్ధ వజ్రాల గని కరోవేలో భారీ వజ్రం దొరికింది. దీని బరువు 2,492 క్యారెట్లు అని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. దీనిని ఎక్స్-రే టెక్నాలజీ సహాయంతో గుర్తించినట్లు కెనడియన్ మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కార్పొరేషన్ తెలిపింది. ఇది అత్యధిక నాణ్యత కలిగిన వజ్రం అని వివరించింది. దక్షిణాఫ్రికాలో 1905లో 3,106 క్యారెట్ల కలినన్ వజ్రం దొరికిందని, ఆ తర్వాత దొరికిన అతి పెద్ద వజ్రం ఇదేనని పేర్కొంది. కలినన్ వజ్రాన్ని జెమ్స్‌గా ముక్కలు చేశారని, వీటిలో కొన్ని జెమ్స్ బ్రిటిష్ క్రౌన్ ఆభరణాల్లో ఉన్నాయని తెలిపింది. వజ్రాలు అధికంగా దొరికే దేశాల్లో బోట్స్‌వానా రెండోది. ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచంలోని అతి పెద్ద వజ్రాలన్నీ ఇక్కడ దొరికినవే కావడం విశేషం. కరోవే గనిలో 2019లో దొరికిన 1,758 క్యారట్ల సెవెలో వజ్రం ఇప్పటి వరకు రెండో అతి పెద్ద వజ్రంగా రికార్డుల్లో ఉండేది. దీనిని ఫ్రెంచ్ ఫ్యాషన్ హౌస్ లూయిస్ వుయిట్టన్ కొనుగోలు చేసింది.



కేరళ సీఎస్‌గా.. భర్త నుంచి బాధ్యతలు

తిరువనంతపురం, ఆగస్టు 22: కేరళ అత్యున్నత స్థాయి అధికార యంత్రాంగంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ బాధ్యతలను భర్త నుంచి భార్య అందుకోబోతున్నారు. ప్రస్తుత ఆ రాష్ట్ర సీఎస్ డాక్టర్ వీ వేణు ఆగస్టు 31న రిటైర్ కాబోతున్నారు. ఆయన పదవీ విరమణ నేపథ్యంలో కొత్త సీఎస్‌గా ఆయన భార్య శారద మురళీధరన్‌ను ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఎంపిక చేయటం వార్తల్లో నిలిచింది. ఐఏఎస్ దంపతులు వరుసగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా నియమితులు కావటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. వేణు, శారద ఇద్దరూ 1990 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు.

గుండెజబ్బుల చికిత్సకు పైథాన్‌లు

కొలరాడో యూనివర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనం



న్యూయార్క్, ఆగస్టు 22: కార్డియాక్ ఫైబ్రోసిస్ లాంటి గుండెజబ్బులను నయం చేయడానికి పైథాన్లు ఉపయోగపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. బౌల్డర్‌లోని కొలరాడో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పైథాన్లపై అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా ఒక పైథాన్‌కు 28 రోజుల పాటు ఆహారం ఏమీ ఇవ్వకుండా ఉంచి, తర్వాత దాని శరీర బరువులో పావు వంతు బరువైన ఆహారాన్ని అందించారు. ఇలా ఆహారాన్ని ఇచ్చినప్పుడు మిగతా పాముల కంటే ఈ పాము శరీరంలో గణనీయ మార్పులు వచ్చినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. మయోఫిబ్రిల్స్‌గా పిలిచే గుండె కండరంలో చాలా మార్పు వచ్చిందని, 24 గంటల్లో 25 శాతం మేర గుండె వ్యాకోచించిందని, గుండె కణజాలం సైతం మృదువుగా మారిందని, పల్స్ రెట్టింపు అయ్యిందని తేల్చారు. ఈ ప్రక్రియలో అనేక ప్రత్యేకమైన జన్యువులు ఉత్తేజితమై పాములో జీవక్రియను పెంచినట్టు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆహారం పూర్తిగా జీర్ణమైన రెండు వారాల తర్వాత పాములోని అన్ని వ్యవస్థలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ గుండె మాత్రం కొంత పెద్దగా, బలంగా మారినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. మనుషుల్లో కార్డియాక్ ఫైబ్రోసిస్ వంటి గుండె సమస్యలు వచ్చినప్పుడు గుండె కణజాలం బిగుసుకుపోతుంది. ఇలాంటి వారికి చికిత్సలో పైథాన్‌లు ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

పాములపై సుదీర్ఘ అధ్యయనం

సాధారణంగా వైద్య ప్రయోగాలు ఎలుకలపై ఎక్కువగా చేస్తారు. కొలరాడో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త లెస్లీ లీన్‌వాండ్ మాత్రం రెండు దశాబ్దాలుగా పాములపై అధ్యయనం చేస్తున్నారు. మనుషుల గుండెలకు ప్రమాదకరంగా మారే వాటి నుంచి రక్షణ కల్పించే వ్యవస్థలు పైథాన్‌లకు ఉన్నట్టు ఆమె తెలిపారు. ఇవి ఆహారం లేకుండా కొన్ని నెలల పాటు ఉండగలవని, ఒక్కోసారి ఏడాది వరకు ఉంటాయని చెప్పారు. అయితే, ఆహారం దొరికినప్పుడు మాత్రం దాని శరీర బరువు కంటే ఎక్కువ ఆహారాన్ని కూడా తింటాయని, అయినప్పటికీ దానికి ఎలాంటి నష్టం జరగదని అన్నారు.

సరికొత్త ప్రాణ ఈవీ బైకులు

ధరల శ్రేణి రూ.2.55-3.20 లక్షలు

సింగిల్ చార్జ్‌పై 250 కిలోమీటర్లదాకా ప్రయాణం

చెన్నై, ఆగస్టు 22: తమిళనాడుకు చెందిన శ్రీవారు మోటర్స్.. గురువారం తమ ప్రీమియం ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ ప్రాణ 2.0 మాడల్‌ను ఆవిష్కరించింది. చెన్నై ఎక్స్‌షోరూం ప్రకారం దీని ధర రూ.2,55,150. సింగిల్ చార్జింగ్‌పై 150 కిలోమీటర్లదాకా ప్రయాణం చేయవచ్చు. కాగా, ఈ సందర్భంగానే ప్రాణ ఎలైట్ బైక్‌నూ మార్కెట్‌కు పరిచయం చేసింది శ్రీవారు మోటర్స్. చెన్నై ఎక్స్‌షోరూం ప్రకారం దీని ధర రూ.3,20,250గా ఉన్నది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్ల వరకు వెళ్లవచ్చు. 2021లో ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ ప్రాణను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. తాజాగా ఇప్పుడు దాని అప్‌డేట్ వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కోయంబత్తూర్ సమీపంలోని సూలూర్‌లో ఈ సంస్థకు ప్లాంట్ ఉన్నది. ఇక్కడ నెలకు దాదాపు 2వేల బైకులు తయారవుతాయని ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక సీఈవో మోహన్‌రాజ్ రామస్వామి తెలిపారు. 10వేల యూనిట్ల అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్నది. త్వరలో 'ఎలైవ్' పేరిట ఎలక్ట్రిక్ స్కూటర్లనూ తేవాలని కంపెనీ చూస్తున్నది.





ఆడీ నయా క్యూ8 ఎస్‌యూవీ

ధర రూ.1.17 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..దేశీయ మార్కెట్లోకి నయా మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఎనిమిది రంగుల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.1.17 కోట్లుగా నిర్ణయించింది. రూ.5 లక్షలు చెల్లించి ఈ కారు ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కేవలం 5.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. భద్రత ప్రమాణాలు మెరుగుపరచడంలో భాగంగా ఈ కారులో ఎనిమిది ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. వైర్‌లెస్ చార్జింగ్, రెండు డిజిటల్ స్క్రీన్లు, 3డీ సౌండ్ సిస్టమ్‌తో 17 స్పీకర్లు వంటి ఫీచర్లతో ఈ నయా కారును తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా ఆడీ ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ..ఈవీలతో పోలిస్తే హైబ్రిడ్ వాహనాలపై అత్యధికంగా 43 శాతం పన్నును విధిస్తున్నారని, దీనిని తగ్గించాలన్నారు. గత 15 ఏండ్లలో లక్ష యూనిట్లను దేశీయంగా విక్రయించింది.

టీవీఎస్ న్యూ జూపిటర్ 110

ఎక్స్‌షోరూం ప్రారంభ ధర రూ.73,700

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశీయ ప్రధాన ద్విచక్ర వాహన తయారీ సంస్థల్లో ఒకటైన టీవీఎస్ మోటర్.. గురువారం తమ పాపులర్ మాడల్ జూపిటర్‌లో సరికొత్త వెర్షన్‌ను పరిచయం చేసింది. 110సీసీ సామర్థ్యంతో వచ్చిన ఈ స్కూటర్ ప్రారంభ ధర ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం రూ.73,700లుగా ఉన్నది. కాగా, ముున్ముందు మార్కెట్‌లో స్కూటర్లకు మరింత డిమాండ్ ఉంటుందని, దేశీయ ద్విచక్ర వాహన అమ్మకాల్లో స్కూటర్ల వాటా త్వరలోనే ఇంచుమించుగా 40 శాతానికి చేరగలదని సంస్థ సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ ఈ సందర్భంగా అంచనా వేశారు. ప్రస్తుతం టూవీలర్ అమ్మకాల్లో 32 శాతం స్కూటర్లవేనని తెలియజేశారు. నగరాలేగాక గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్కూటర్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని వివరించారు. ఇక పరిశ్రమ వార్షిక చక్ర వృద్ధిరేటు 8 శాతంగా ఉంటే.. తమ సంస్థది 12 శాతంగా ఉందని చెప్పారు. రాబోయే పండుగ సీజన్‌లో అమ్మకాలు బాగుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త మాడళ్లను ఆవిష్కరిస్తామన్నారు.



హైదరాబాద్-కోల్‌కతా మధ్య ఏఐ ఫ్లైట్

హైదరాబాద్, ఆగస్టు 22: టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా..తాత్కాలికంగా పలు రూట్లలో విమాన సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ పండుగ సీజన్‌లో హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరుల నుంచి నేరుగా కోల్‌కతాలకు అదనపు ఫ్లైట్ సర్వీసును అందుబాటులోకి తీసుకోస్తున్నట్లు వెల్లడించింది. దుర్గ పూజ సందర్భంగా ఈ రూట్లలో అత్యధిక మంది ప్రయాణించే అవకాశం ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. కోల్‌కతాలో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరనున్న ఏఐ530 సర్వీసు హైదరాబాద్‌కు సాయంత్రం 5.40 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరనున్న ఈ సర్వీసు కోల్‌కతాకు 10.40కి చేరుకోనున్నది. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 26 వరకు మాత్రమే నడపనున్నట్లు తెలిపింది.



వాసవి గ్రూపు సంస్థల డైరెక్టర్ అభిషేక్ చందా తదితరులు

'వాసవిపై ఆరోపణలు అవాస్తవం'

అమీర్‌పేట్, ఆగస్టు 22: మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవమున్న సంస్థగా తన కస్టమర్ల పట్ల ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తామో.. సామాజిక బాధ్యతల పట్ల కూడా అంతే నిజాయితీగా వ్యవహరిస్తున్నామని వాసవి గ్రూపు సంస్థల డైరెక్టర్ అభిషేక్ చందా పేర్కొన్నారు. అవగాహన లేమితో కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ చానెళ్లు పని గట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తుండటాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. 1994లో ఎర్రమ్ విజయ్‌కుమార్ ప్రారంభించిన ఈ సంస్థ ఇప్పటి వరకు ఎక్కడా కస్టమర్లను ఇబ్బందులు పెట్టడం కానీ, బఫర్ జోన్ స్థలాలు, క్యాచ్‌మెంట్ భూములు, చెరువులను కబ్జాలు వంటి అక్రమ చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని గురువారం వాసవి గ్రూపు సంస్థ న్యాయ సలహాదారు మాధవరావు, సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులు జాకీర్ హుస్సేన్, నర్సింహారావు, వరుణ్‌శర్మలతో కలిసి హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అక్రమాలకు దూరంగా పూర్తి స్థాయి పారదర్శకతతో ముందుకు సాగుతున్న తమను కొందరు వ్యక్తులు అవగాహన లేమితో కబ్జాలకు పాల్పడుతున్నట్టు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కేవలం వ్యాపారాత్మకంగానే కాక కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వాసవి సంస్థ ప్రభుత్వ సూచనల మేరకు ఇప్పటి వరకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ చెరువుల సుందరీకరణ, వరద నీటి కాలువలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ విద్యాలయాల్లో మౌళిక వసతుల కల్పన, పేద చిన్నారులకు జ్ఞానేంద్రియాల లోటుపాట్లను సవరించడం, మూగజీవాల సంరక్షణ వంటి అనేక కార్యక్రమాలకు సొంత నిధులను పెద్దయెత్తున వెచ్చిస్తున్నట్టు తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా రహదారి విస్తరణ కోసం 2.5 ఎకరాల తమ సొంత స్థలాన్ని ప్రభుత్వానికి గిఫ్ట్ డీడ్ చేసి ఇవ్వడం జరిగిందని, తాత్కాలిక రహదారులను కోట్లాది నిధులతో నిర్మించడం జరిగిందని, ఈ పనులన్నీ ఆయా ప్రభుత్వ విభాగాల అనుమతితో నిబంధనలకు లోబడి చట్టబద్ధంగా చేపట్టినట్టు చెప్పారు.

ఈసారి జీడీపీ 6 శాతమే

ఏప్రిల్-జూన్‌లో 6 త్రైమాసికాల కనిష్టానికి వృద్ధిరేటు పడిపోవచ్చంటున్న ఇక్రా



న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్ లేదా క్యూ1)లో దేశ ఆర్థిక వృద్ధిరేటు 6 శాతంగానే ఉండొచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా గురువారం అంచనా వేసింది. అయితే ఇది 6 త్రైమాసికాల కనిష్ఠం కావడం గమనార్హం. నిజానికి అంతకుముందు త్రైమాసికం జనవరి-మార్చిలోనూ 7.8 శాతంగా ఉన్నది. కానీ 3 నెలల వ్యవధిలో 1.8 శాతం మేర వృద్ధిరేటు పతనం.. ఇప్పుడు ఆర్థిక మందగమనాన్ని సూచిస్తున్నది. ఇక నిరుడు ఏప్రిల్-జూన్‌లోనైతే ఏకంగా 8.2 శాతంగా నమోదైంది. కాగా, ఈ నెల 30న క్యూ1 జీడీపీ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనున్నది. ఈ క్రమంలో తాజా అంచనా ప్రాధాన్యాన్ని సంతరించుకోగా, ప్రభుత్వ మూలధన వ్యయంలో మందగమనం, పట్టణ వినిమయ డిమాండ్‌లో క్షీణతలే వృద్ధిరేటు పతనానికి దారితీస్తున్నాయని ఇక్రా చెప్తున్నది.

వాతావరణం దెబ్బ

దేశవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడకపోవడం, వాతావారణంలో తేమ శాతం పెరిగి వేడి గాలులు వీస్తుండటం కూడా వివిధ రంగాలను ప్రభావితం చేస్తున్నాయని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గిపోవడం కూడా ఎకానమీని బలహీనపరుస్తున్నదని చెప్పారు. ఇదిలావుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా జీడీపీ 6.8 శాతంగా నమోదు కావచ్చని ఇక్రా తమ ప్రకటనలో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) 8.2 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు గురువారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక.. గత నెల వచ్చిన ఆర్థిక సర్వేలో భారత జీడీపీ 6.5-7 శాతంగా ఉండొచ్చన్న అంచనా సరైనదేనని చెప్పుకొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు నిలకడగానే ఉన్నట్టు వెల్లడించింది.

అదానీ చేతికి ల్యాంకో

న్యూఢిల్లీ, ఆగస్టు 22: అదానీ మరో విద్యుత్ ప్లాంట్‌ను హస్తగతం చేసుకున్నది. ఎన్‌సీఎల్‌టీ వద్ద ఉన్న ల్యాంకో అమర్కంటక్ పవర్ లిమిటెడ్‌ను రూ.4,101 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ప్రతిపాదనకు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ అనుమతినిచ్చింది. ఎల్‌ఏపీఎల్ ప్లాంట్‌లో 100 శాతం వాటా కొనుగోలు ప్రతిపాదనకు అనుమతినిచ్చింది.

హైదరాబాద్‌లో ఎహెడ్ ఆఫీస్

AHEAD


న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఐటీ సేవల సంస్థ ఎహెడ్.. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. గతేడాది గురుగ్రామ్‌లో 400 మంది సిబ్బందితో డెలివరీ ఆఫీస్‌ను ప్రారంభించిన సంస్థ..తాజాగా ప్రారంభించిన కార్యాలయం కోసం వచ్చే ఏడాదిలోగా 500 మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకోబోతున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ ప్రవీణ్ గ్రోవర్ తెలిపారు. ఉత్తర భారతంతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభ కలిగిన టెక్నాలజీ నిపుణులు అత్యధికంగా ఉన్నారని, వీరితో క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.



ప్లాస్టిక్ పరిశ్రమ సమస్యలు, డిమాండ్ల పరిష్కారార్థం గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ప్లాస్టిక్ ఇండియా ప్రతినిధులు కలిశారు. ప్లాస్టిక్ రంగాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఏడాది నవంబర్ 27న హైటెక్స్‌లో నిర్వహించబోయే ప్లాస్టిక్ ఇండియా ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కూడా ఈ సందర్భంగా వారు ఆహ్వానించారు.

కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్ సిద్ధం

- నేడు కొంగరకలాన్‌లో ప్రారంభం
- 2వేల మందికి ఉద్యోగావకాశాలు
- బీఆర్ఎస్ హయాంలోనే బీజం



ఆదిబట్ల, ఆగస్టు 22: రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ సమీపంలో శుక్రవారం అధునాతన కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్ సెమీకండక్టర్ల తయారీ సంస్థను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, స్పీకర్ ప్రసాద్ కుమార్‌లు హాజరు కానున్నారు.

రూ.2,800 కోట్ల పెట్టుబడి

కేన్స్ టెక్ ఎలక్ట్రానిక్ యూనిట్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. గత ఏడాది అక్టోబర్‌లో కేన్స్ టెక్నాలజీ నాయకత్వ బృందం అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరమే కొంగరకలాన్‌లో రూ.2,800 కోట్ల పెట్టుబడితో అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ సదుపాయాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు వారు ప్రకటించారు. ప్రభుత్వం తరఫున కావాల్సిన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని కేన్స్ టెక్ ప్రతినిధులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. దీంతో ఈ యూనిట్ ఏర్పాటుతో దాదాపు 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని సంస్థ పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 300లో 46 ఎకరాల భూమిని నాటి ప్రభుత్వం కేటాయించింది.

ఆమెనే సంపాదించుకోమనండి!

6 లక్షల మనోవర్తి కోరిన భార్యకు కోర్టు షాక్

బెంగళూరు: మాజీ భర్త నుంచి భారీగా మనోవర్తి పొందాలనుకున్న మహిళకు కర్ణాటక హైకోర్టు మహిళా న్యాయమూర్తి గట్టి షాక్ ఇచ్చారు. 'అంత సొమ్ము కావాలంటే ఆమెనే సంపాదించుకోమనండి' అని ఆమె తరపు న్యాయవాదికి చెప్పారు. భరణం అనేది భర్తకు శిక్షగా ఉండకూడదని తెలిపారు. న్యాయమూర్తి, న్యాయవాది మధ్య హైకోర్టులో జరిగిన సంభాషణ వీడియోను దీపిక నారాయణ్ భరద్వాజ్ అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు. దీని ప్రకారం, పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, ఆమెకు నెలకు రూ.6,16,300 భరణం కింద చెల్లించే విధంగా ఆమె మాజీ భర్తను ఆదేశించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, ఎవరైనా నెలకు రూ.6 లక్షలు ఏ విధంగా ఖర్చు పెట్టగలరని ప్రశ్నించారు. ఇది అసమంజసంగా ఉందన్నారు. దీనిపై న్యాయవాది వివరణ ఇస్తూ, పిటిషనర్ మోకాలి నొప్పితో బాధపడుతున్నారని, చికిత్స, ఫిజియోథెరపీ, మందులు, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.4-5 లక్షలు అవసరమవుతాయని చెప్పారు. గాజులు, చెప్పులు, శాండల్స్, గడియారాలు వంటివాటి కోసం నెలకు రూ.50,000; ఆహారం కోసం రూ.60,000 కావాలన్నారు. ఆమె మాజీ భర్త అన్నీ బ్రాండెడ్ దుస్తులనే ధరిస్తారని, రూ.10,000 విలువైన కెల్విన్ క్లీన్ టీ-షర్టులు ధరిస్తారని చెప్పారు. కానీ ఆమె పాత దుస్తులతోనే సరిపెట్టుకోవలసి వస్తుందన్నారు. అయితే ఆమె పిల్లల స్కూలు, ట్యూషన్ ఫీజును మాజీ భర్త చెల్లిస్తున్నట్లు అంగీకరించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, 'ఓ వ్యక్తికి ఇవన్నీ అవసరమని మీరు కోర్టుకు చెప్పవద్దు. రూ.6,16,300 ఓ నెలకా? ఎవరైనా ఇంత సొమ్ము ఖర్చుపెడతారా?'' అన్నారు. ''సరే, అంత ఖర్చు చేయాలనుకుంటే, ఆమెను సంపాదించుకోమనండి. ఆమె భర్తపై ఆ భారం మోపవద్దు'' అని చెప్పారు. 'ఇంత సొమ్మును డిమాండ్ చేయడం అసమంజసమని మీ క్లయింటుకు వివరించండి' అని తెలిపారు. ఆమెకు ఇతర కుటుంబ బాధ్యతలేవీ లేవని, పిల్లల సంరక్షణ చూడవలసిన అవసరం లేదని చెప్పారు.

అమెరికాకే మనోళ్ల మొగ్గు!

- 30% పెరిగిన భారత విద్యార్థుల సంఖ్య
- అమెరికా వెళ్లాలనుకునే వారికి 25న ఢిల్లీలో ఎడ్యుకేషన్ ఫెయిర్
- సద్వినియోగం చేసుకోవాలన్న ఆ దేశ ప్రతినిధి గ్లోరియా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థుల మొదటి ఎంపిక అమెరికా. మొత్తం విద్యార్థుల్లో 69 శాతం ఈ దేశంలోనే చదవాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు తమ దేశంలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతర వివరాలను అమెరికా పబ్లిక్ డిప్లొమసీ శాఖ మంత్రి సలహాదారు గ్లోరియా బెర్బెనా ఒక ఆంగ్ల మీడియాకు తెలియజేశారు. అమెరికా వచ్చే భారత విద్యార్థుల సంఖ్య గత ఏడాదిలోనే 30 శాతం పెరిగినట్టు ఆమె చెప్పారు. తమ దేశం పట్ల భారత విద్యార్థుల ఆసక్తి, అనురక్తి తమకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నదని అన్నారు. గత ఏడాది తమ దేశానికి వచ్చిన విదేశీ విద్యార్థుల సంఖ్యలో భారతే నెంబర్ వన్ అని వెల్లడించారు. అమెరికా రావాలనుకునే విద్యార్థులు కొంతమంది బ్రోకర్లు, కన్సల్టెన్సీల చేతిలో మోసపోకుండా నేరుగా తామే విద్యార్థులతో సంబంధాలు పెట్టుకునేందుకు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని వల్ల వారి సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అందులో భాగంగా 125 అమెరికా యూనివర్సిటీల ఆధ్వర్యంలో ఈ ఆదివారం ఢిల్లీలో ఒక ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమెరికా రావాలనుకునే విద్యార్థులు దీనికి హాజరు కావాలని ఆమె కోరారు. వివిధ యూనివర్సిటీలలో ఉన్న కోర్సులు, దరఖాస్తు విధానం, వీసా నిబంధనలు, అయ్యే ఖర్చెంత, ప్రవేశార్హత ఇలా తమకు కావాల్సిన వివరాలన్నీ ఇందులో పొందవచ్చునని ఆమె వెల్లడించారు. తమ దేశంలోని 4,500 ఉన్నత విద్యా సంస్థలు అద్భుతమైన అక్రిడేటెడ్ డిగ్రీ విద్యను అందిస్తున్నాయని, భారత విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



యూకేలో తగ్గుతున్న భారత్ విద్యార్థులు

ఒక వైపు అత్యధికంగా భారత విద్యార్థులకే యూకే వీసాలు మంజూరు చేస్తుండగా, మరో పక్క యూకే యూనివర్సిటీలకు దరఖాస్తు చేసే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ఇటీవల ఆ దేశంలో విధించిన వలస విధాన ఆంక్షలు, వలసదారులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు, ఇతర కారణాల వల్ల ఆ దేశం వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని గురువారం వెలువడిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఉన్న డాటాను పోలిస్తే ఉన్నత విద్య కోసం యూకేకు వచ్చే భారతీయ విద్యార్థుల సంఖ్య 23 శాతం తగ్గింది. గ్రాడ్యుయేషన్ నిమిత్తం వచ్చే విద్యార్థులను ప్రోత్సహించేందుకు చదువైన తర్వాత వారు రెండేండ్ల పాటు దేశంలోనే ఉండేందుకు అనుమతించే గ్రాడ్యుయేట్ రూట్ వీసాను ఇస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తగ్గడం గమనార్హం. స్టూడెంట్ వీసా ఉన్నవారు తమతో పాటు తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను బ్రిటన్‌కు తెచ్చుకునేందుకు గతంలో అనుమతి ఉండేది. అయితే దానిపై ఆంక్షలు విధిస్తూ గత ఏడాది తెచ్చిన కొత్త నిబంధనలు ఈ తగ్గుదలకు ప్రధాన కారణంగా కన్పిస్తున్నది. 2019-2023 కాలంలో యూకేకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా ఉండేది. వీరిలో ఎక్కువగా భారతీయులు, నైజీరియన్లు ఉండేవారు. అయితే తాజా గణాంకాలు చూస్తే వరుసగా వీరిలో 23 శాతం, 46 శాతం తగ్గుదల నమోదైంది.

పాల ఉత్పత్తులపై ఎ1, ఎ2 తొలగించండి

- ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: ఎ1, ఎ2 రకాల పాలు, పాల ఉత్పత్తులంటూ ప్యాకేజింగ్‌లో చేస్తున్న ప్రచారాన్ని ఆహార వ్యాపార కంపెనీలు, ఈ-కామర్స్ సంస్థలు వెంటనే తొలగించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ తరహా ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని తెలిపింది. ఈ తరహా ప్రచారం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006కు అనుగుణంగా లేదని తెలిపింది. పాలలోని బీటా కెరోటిన్ ప్రొటీన్ నిర్మాణానికి సంబంధించిన తేడాలను బట్టి ఎ1, ఎ2 పాలుగా వర్గీకరిస్తున్నారని.. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం తమ సంస్థ ఈ తేడాలను గుర్తించదని వెల్లడించింది.

'హిండెన్‌బర్గ్ నివేదికపై జేపీసీతో దర్యాప్తు జరపాలి'

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సంయుక్త పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో విచారణ జరపాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సెబీ చైర్‌పర్సన్ మాదబి బచ్, అదానీ గ్రూప్‌కు వ్యతిరేకంగా 'హిండెన్‌బర్గ్' బయటపెట్టిన అంశాలపై దర్యాప్తు చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ గురువారం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. లక్నోలో రాజ్‌భవన్, ముంబైలో ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ ద్వారా స్వేచ్ఛాయుత, పారదర్శక దర్యాప్తు నిర్వహించాలని సచిన్ పైలట్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

అల్‌ఖైదా ఉగ్ర కుట్ర భగ్నం

న్యూఢిల్లీ: వివిధ రాష్ర్టాల పోలీస్ సిబ్బందితో కలిసి చేపట్టిన సంయుక్త ఆపరేషన్ ద్వారా అల్‌ఖైదా ఉగ్ర కుట్రలను భగ్నం చేసినట్టు ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో దాడులు నిర్వహించి 11 మందిని అరెస్టు చేశామని, తద్వారా దేశంలో అల్‌ఖైదా పన్నిన ఉగ్ర దాడుల ప్రణాళికలను (టెర్రర్ మాడ్యూల్)ను ఛేదించామని ఢిల్లీ పోలీస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ నిందితుల నుంచి ఆయుధాలు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకుందని, అలీగఢ్‌కు చెందిన మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకుందని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అల్‌ఖైదా టెర్రర్ మాడ్యూల్‌ను నిందితులు దేశంలో అమలుజేస్తున్నట్టు తెలిపారు.

మనోవర్తి కోసం ఏడుగురితో పెండ్లి!

బెంగళూరు: కర్ణాటకలోని ఓ మహిళ ఏడుగురిని వివాహం చేసుకుని, వారందరిపైనా వేధింపుల కేసు పెట్టి, మనోవర్తి పొందుతున్నారు. ఏడో భర్తపై పెట్టిన గృహహింస కేసు విచారణకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. దీపిక నారాయణ భరద్వాజ్ అనే ఎక్స్ యూజర్ ఈ వీడియోను పోస్ట్ చేశారు. జడ్జి, ఆమె తరపు న్యాయవాదుల మధ్య జరిగిన సంభాషణ ఈ వీడియోలో కనిపించింది. ఆమె ఏడుగురిని పెళ్లి చేసుకుని, ఒక్కొక్కరితో 6 నెలల నుంచి 1 సంవత్సరం వరకు కాపురం ఉంటున్నది. ఆ తర్వాత గృహ హింస కేసు పెట్టి, మనోవర్తి పొందుతున్నది. ఇప్పటి వరకు ఆరుగురు మాజీ భర్తల నుంచి మనోవర్తి ఆమెకు లభించింది. ఇప్పుడు ఏడో భర్తపై కేసు విచారణ జరుగుతున్నది. జడ్జి మాట్లాడుతూ, 'మీరు చట్టంతో ఆటలాడుతున్నారు' అన్నారు.

ఆసియన్ల రాకపై బ్రెజిల్ ఆంక్షలు

- యూఎస్‌కు వలసలు నిరోధించేందుకే

సా పౌలో: ఆసియా నుంచి వచ్చే కొందరు విదేశీయులపై బ్రెజిల్ ఆంక్షలు విధించడం ప్రారంభించనుంది. అమెరికా, కెనడాలకు వలస వెళ్లేందుకు తమ దేశాన్ని లాంచింగ్ పాయింట్‌గా వాడుకుంటూ ఉండటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ దేశ న్యాయ శాఖ బుధవారం వెల్లడించింది. విమానాశ్రయంలో ఆశ్రయం కోసం 70 శాతానికి పైగా అభ్యర్థనలు భారత్, నేపాల్ లేదా వియత్నాం జాతీయుల నుంచి వస్తున్నాయని తెలిపింది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆంక్షల్లో భాగంగా ఇకపై ఆసియా దేశాల నుంచి వచ్చేవారు బ్రెజిల్‌లో వలసదారులుగా ఉండాలంటే వీసా ఉండాలి. అయితే ఇప్పటికే వీసా నుంచి మినహాయింపు పొందిన ఆసియన్లకు ఈ నిబంధన వర్తించదు.

ఎయిర్‌పోర్టులో గుండెపోటు.. సీపీఆర్ చేసి రక్షించిన సీఐఎస్ఎఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి గుండెపోటుతో కుప్పకూలిపోయారు. సీఐఎస్ఎఫ్ జవాన్లు ఆయనకు వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించారు. మంగళవారం ఉదయం టర్మినల్-2 ద్వారా శ్రీనగర్ బయలుదేరాల్సిన అర్షిద్ అయూబ్ హఠాత్తుగా కుప్పకూలిపోయారు. సీఐఎస్ఎఫ్ తక్షణ ప్రతిస్పందన బృందం వెంటనే ఆయనకు సీపీఆర్ చేసి ఆయన పరిస్థితి కుదుటపడేలా చేసింది. అనంతరం ఆయనను సఫ్దర్‌జంగ్ దవాఖానలో చేర్పించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



మోదీ తర్వాత ఎవరు?

- సర్వే నిర్వహించిన 'ఇండియాటుడే'
- ఎవరికీ చెప్పుకోదగ్గ మద్దతు లేని వైనం
- 25% మద్దతుతో ముందున్న షా
- తర్వాతి స్థానాల్లో యోగి, గడ్కరీ

న్యూఢిల్లీ: బీజేపీలో 75 ఏండ్ల వయస్సు వచ్చాక రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలనే అనధికార నిబంధన కొనసాగుతున్నది. మరి కొన్ని రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైతం 75 ఏండ్లు రాబోతున్నాయి. ఒకవేళ ఈ నిబంధన పాటించి ప్రధాని పదవి నుంచి మోదీ తప్పుకుంటే ఎవరు ఆ బాధ్యతలు చేపడతారనే ఆసక్తి నెలకొన్నది. ఈ నేపథ్యంలో 'ఇండియా టుడే' మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో ఒక సర్వే జరిపింది. ఏ బీజేపీ నేతకూ చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రజా మద్దతు లేదని ఈ సర్వేలో తేలింది. అమిత్ షాకు 25 శాతం మంది, సీఎం యోగికి 19 శాతం మంది మద్దతు లభించింది. నితిన్ గడ్కరీ ప్రధాని కావాలని 13 శాతం మంది, రాజ్‌నాథ్ సింగ్‌కు మద్దతుగా 5 శాతం మంది, శివరాజ్ సింగ్ చౌహాన్ కావాలని 5 శాతం మంది చెప్పినట్టు ఈ సర్వే తెలిపింది.

చర్చల ద్వారానే శాంతి స్థాపన

- పోలండ్ పర్యటనలో ప్రధాని మోదీ
- ఐదేండ్ల కార్యాచరణ ప్రణాళిక విడుదల

వార్సా, ఆగస్టు 22: యుద్ధ భూమిలో ఏ సమస్యా పరిష్కారం కాదని భారత్ గట్టిగా నమ్ముతున్నదని, ఉక్రెయిన్‌లో శాంతి, సుస్థిర పరిస్థితులు పునరుద్ధరించడానికి అవసరమైన సహకారాన్ని అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత ప్రధాని మోదీ అన్నారు. పోలండ్ పర్యటన సందర్భంగా ప్రధాని గురువారం మీడియాతో మాట్లాడుతూ చర్చలు, దౌత్యపరమైన చర్యల ద్వారా ఎక్కడైనా శాంతి, సుస్థిరత నెలకొల్పవచ్చునని ఆయన పేర్కొన్నారు. మోదీ, పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ సమావేశమై ఇరు దేశాలు రక్షణ, భద్రత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తృతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. చర్చల అనంతరం మోదీ-టస్క్ సంయుక్తంగా ఐదేండ్ల కార్యాచరణ ప్రణాళిక (2024-2028)ను ఆవిష్కరించారు.



వరదలతో ప్రభావితమైన అగర్తల శివార్లలోని ప్రజలను తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్

త్రిపురలో ఆకస్మిక వరదలు

17 లక్షల మందిపై ప్రభావం

గువాహటి, ఆగస్టు 22: త్రిపురను ఆకస్మికంగా ముంచెత్తిన వరదలు అపార నష్టాన్ని మిగిల్చాయి. భారీ వర్షాలకు తోడు వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో సోమవారం నుంచి 12 మంది మృతి చెందగా, ఇద్దరు గల్లంతయ్యారు. పంట పొలాలు దెబ్బతినగా, పలు ఇండ్లు నీటమునిగాయి. పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లక్షలాది మంది నీటమునిగిన ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. భారీ వరదల కారణంగా 17 లక్షల మంది ఇబ్బందులను ఎదుర్కొన్నట్టు ప్రభుత్వం గురువారం తెలిపింది. అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వివిధ ప్రదేశాల్లో చిక్కుకుపోయిన వారిని కేంద్రం పంపిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీవ్రంగా ప్రభావితమైన అమర్‌పూర్‌కు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని తరలించారు. అరుణాచల్ ప్రదేశ్ నుంచి వచ్చిన నాలుగు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తీవ్రంగా దెబ్బతిన్న గోమతి, పశ్చిమ త్రిపుర, సెపహిజల జిల్లాలలో సహాయ కార్యక్రమాలు చేపట్టాయి.

తీరని రుణం... రైతుల రణం

కాంగ్రెస్ సర్కారుపై రైతుల ధర్మాగ్రహం

• గర్జించిన గజ్వేల్ రైతులు




సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

• జనగామలో జంగ్ సైరన్



జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన రైతు ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి, దేవీప్రసాద్, క్యామ మల్లేశ్, రాకేశ్‌రెడ్డి తదితరులు

• నల్లగొండ నగారా



నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో పోస్టర్ పట్టుకొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి.

• ఇచ్చోడలో రగిలిన రైతురణం



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేతృత్వంలో భారీ ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

• రాజుకున్న ఆలంపూర్



జోగుళాంబ జిల్లా ఆలంపూర్ తహసీల్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

• మెతుకుసీమ రణం



మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

• కోరుట్ల కొట్లాట!



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో రైతు ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

• పట్టుబడుతున్న పటాన్‌చెరు



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని గుమ్మడిదలలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు

• ఆదిలాబాద్‌లో ఆరని మంటలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

• గిరిజనం గోస




మెదక్ జిల్లా కొల్చారంలో జరిగిన ధర్నాలో తన రుణమాఫీ కాలేదని వసురాం తండాకు చెందిన గిరిజన మహిళా రైతు సక్రుబాయి ఆవేదన వ్యక్తం చేసింది.

• రణనినాదం



నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నా శిబిరంలో పోస్టర్ చేతబట్టి, పిడికిలెత్తి నినదిస్తున్న రైతు

• మహిళా రైతుల నిర్వేదం



మెదక్ జిల్లా కొల్చారంలో చేపట్టిన ధర్నాలో ఓ మహిళా రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. పోతన్‌శెట్టిపల్లి చౌరస్తాకు చెందిన మహిళా రైతు మజీద్‌పల్లి వెంకటమ్మ తన ఆత్మహత్యతోనైనా ఈ ప్రభుత్వం కండ్లు తెరుస్తుందని, ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు.

రుణమాఫీ.. పెద్ద మోసం: వేముల



బాల్కొండ/వేల్పూర్, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న రుణమాఫీ పెద్ద మోసమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ, వేల్పూర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న వేముల.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

2 లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు ఆంక్షలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. మాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.. రైతులు పేపర్లు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్నా? అని నిలదీశారు. బాల్కొండ నియోజకవర్గంలో 51 వేల మంది పంట రుణాలు తీసుకుంటే, మూడు విడతల్లో కలిపి 15,900 మందికి మాత్రమే మాఫీ చేశారని, మిగతా 36 వేల మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ఇది దగాకోరు ప్రభుత్వం : వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, ఆగస్టు 22: ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పాడని బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ ఆజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. ఇచ్చిన మాటకు విలువ లేకుండా కొర్రీలు పెట్టి సగం మందికి కూడా రుణమాఫీ చేయకపోగా అబద్ధాలతో కాలం గడుపుతున్నాడని విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ అసమర్థత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు రూ.41 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి తీరా రూ.17వేల కోట్లు మాత్రమే చేసి చేతులు దులుపుకోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటం ఆగదు: పటోళ్ల కార్తీక్‌రెడ్డి



అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో రైతులు ఎంత మోసపోయారో అందరికి బాగా తెలుసని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జనాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మితలేరని భావించిన ముఖ్యమంత్రి దేవుళ్ల మీద ఒట్లు వేసి ఆగస్టు 15వరకు రుణమాఫీ చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

రైతు నెత్తిన ముఖ్యమంత్రి రేవంత్ శఠగోపం: ఎర్రబెల్లి



తొర్రూరు, ఆగస్టు 22: నూరుశాతం రుణమాఫీ పేరున రైతు నెత్తిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శఠగోపం పెట్టారని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. తొర్రూరులో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ.. అర్హులైన వారందరికి పూర్తిస్థాయిలో రుణమాఫీ వర్తింపచేసే వరకు రైతుల వెంట నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారే రుణమాఫీ విషయంలో ఆందోళన చేస్తున్నారని, పూర్తి స్థాయిలో రుణాన్ని మాఫీ చేసే వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. రుణమాఫీపై సీఎంతోపాటు మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

9 నెలల్లోనే రోడ్డెక్కించారు: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రైతును రోడ్డెక్కించారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వనపర్తిలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ పేరుతో సర్కార్ రైతును నిలువునా ముంచిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల నుంచి భంగపాటు తప్పదని హెచ్చరించారు. మాఫీపై ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయ మంత్రు మాటలకు, లెక్కలకు పొంతన లేదన్నారు. రాష్ట్రంలో 70 లక్షల రైతు కుటుంబాలుంటే.. కొద్ది మందికి మాత్రమే మాఫీచేసి గారడీ చేసిందని దుయ్యబట్టారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తీర్చిన అప్పుకు క్లియరెన్స్ లేక.. రుణమాఫీ కాలేదు



నా భార్య పేరు మీద ఉన్న భూమిపై అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో రూ.1.15 లక్షల పంట రుణం తీసుకున్నాం. తరువాత ఆ భూమిని మా కొడుకు పేరు మీదికి బదలాయించాం. దీంతో సాగుభూమి లేకుండా రుణం ఉండకూదదంటూ బ్యాంకు అధికారులు చెప్పడంతో ఈ ఏడాది మార్చిలో ఆ రుణం మొత్తాన్ని బ్యాంకుకు తిరిగి చెల్లించాం. కానీ.. రుణం మొత్తం చెల్లించినట్టు క్లియరెన్స్ ఇవ్వలేదు. అదే అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో నా పేరు మీద ఉన్న రూ.1.68 లక్షల పంట రుణం మాఫీ కాలేదు. అధికారులను అడిగితే.. నీ భార్య పేరుతోనూ, నీ పేరుతోనూ కలిపి రూ.2 లక్షలపైగా రుణం ఉన్నందున కాలేదని చెప్పారు. నా భార్య పేరుతో ఉన్న క్రాప్ లోన్ మొత్తాన్ని మార్చిలోనే చెల్లించానని చెప్పడంతో బ్యాంకు నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు. నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చి అధికారులకు ఇవ్వడంతో రుణమాఫీ కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సలహా ఇచ్చారు.

-పలగాని పుల్లయ్య, రైతు, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి, భద్రాద్రి జిల్లా



హైదరాబాద్ సెంట్రల్ కోర్టులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

- రిజర్వేషన్లు 42 శాతం పెంచాలి
- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- బీసీల ఐక్యతను దేశానికి చాటి చెప్పాలి
- మధుసూదనాచారి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : బీసీ కులగణన వెంటనే చేపట్టాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం హైదరాబాద్ సెంట్రల్ కోర్టులో 'బీసీల సమగ్ర కులగణన-స్థానిక ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు' అంశంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మండలి బీఆర్ఎస్ఎల్పీ నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీల ఐక్యతను దేశానికి చాటిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. కులగణన బీసీల హక్కు అని పేర్కొన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన మాటను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమకార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీసీలకు అన్యాయమే జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో వేల సంఖ్యలో బీసీ కులాలు ఉన్నాయని, వాటిలో ఎన్నో కులాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని పరిస్థితులను మనం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోగా బీసీ కులగణన పూర్తిచేయడంతో పాటు 42శాతం రిజర్వేషన్ల విధానం పాటించాలని, లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తమ హక్కులను కాపాడుకునేందుకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందేనని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఖర్గేను కాదనలేక.. అదానీని అనలేక!

- ఈడీ ఆఫీస్ ముందు ధర్నాలో సీఎం తర్జన భర్జన
- అదానీని విమర్శించేందుకు నోరు రాని రేవంత్‌రెడ్డి
- సెబీ చైర్‌పర్సన్ రాజీనామా, బర్తరఫ్‌పైనే ఫోకస్
- సంబంధం లేకున్నా రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రస్తావన
- కేసీఆర్, కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలకే పరిమితం



హైదరాబాద్‌లో ఈడీ ఆఫీస్ ముందు ధర్నాలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అటు చూస్తే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం.. ఇటు చూస్తే అదానీతో 'పారిశ్రామిక' స్నేహం.. అటు ఖర్గేను, రాహుల్‌గాంధీని కాదనలేక, ఇటు అదానీని అనలేక సీఎం రేవంత్ రెడ్డి సతమతమయ్యారు. హైదరాబాద్‌లో గురువారం ఈడీ ఆఫీస్ ముందు జరిగిన ధర్నాలో సీఎం ప్రసంగాన్ని చూస్తే ఇది అర్థం అవుతుంది. అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని, సెబీ చైర్‌పర్సన్ అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలన్న డిమాండ్లతో ఏఐసీసీ పిలుపుమేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొక్కుబడిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సంబంధం లేని ప్రసంగం చేయడంపై అటు రాజకీయ వర్గాలు, ఇటు కాంగ్రెస్ శ్రేణులు విస్మయం వ్యక్తం చేశాయి. అదానీపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి అవినీతి ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా అదానీ కంపెనీకి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెడ్ కార్పెట్ పరిచారు. దావోస్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి, ఫొటోలు దిగారు. రాష్ట్రంలో రూ.12,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పాతబస్తీలో కరెంటు బిల్లుల వసూలు బాధ్యతను అదానీకి అప్పగించారు. ఈ నిర్ణయాలపై ఎన్ని విమర్శలు వస్తున్నా వెనక్కి తగ్గడం లేదు. దీనిని బట్టే అదానీకి, రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న స్నేహం ఎంత బలమైనదో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఆలస్యంగా వచ్చిన అధ్యక్షుడు..

ఏఐసీసీ ఆదేశం మేరకు ఈడీ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి దగ్గరుండి నేతృత్వం వహించాలి. కానీ కార్యక్రమం మొదలైన తర్వాత గంట ఆలస్యంగా సీఎం అక్కడికి వచ్చారు. ఉదయం 11.15 గంటలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ బృందం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటిలో కలిసింది. వారు వెళ్లిపోయిన తర్వాత ప్రముఖులెవరూ రాలేదు. అప్పుడు బయల్దేరినా ధర్నా ప్రారంభం అయ్యే సమయానికి సీఎం ఈడీ ఆఫీస్‌కు చేరుకునేవారని చెప్తున్నారు. కానీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సీఎం ఈడీ ఆఫీస్‌కు చేరుకున్నారు. పెద్దగా బిజీ షెడ్యూల్ లేకున్నా.. ఎందుకు ఆలస్యం చేశారన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతున్నది. పైగా కార్యక్రమం ప్రారంభమైన తర్వాత మంత్రులు, ఇతర ప్రముఖుల ప్రసంగాలు ముగిసినా సీఎం రాలేదు. దీంతో సమయం గడిపేందుకు కొందరు నేతలతో మాట్లాడించారని చెప్పుకుంటున్నారు.

తూతూమంత్రంగా విమర్శలు

ధర్నా ప్రధాన ఎజెండా.. అదానీ గ్రూప్ అవినీతి, సెబీ చైర్‌పర్సన్ పెట్టుబడులు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో తూతూ మంత్రంగా అదానీపై విమర్శలు చేయడం కొత్త అనుమానాలకు తావిస్తున్నది. సీఎం 5 నిమిషాలపాటు ప్రసంగించారు. ఇందులో ప్రధాన అజెండా అయిన అదానీ, సెబీ ఛైర్‌పర్సన్ అవినీతిపై మాట్లాడింది కేవలం నాలుగు నిమిషాలే. అందులోనూ అదానీ పేరును ఏడు సార్లు మాత్రమే తలచుకున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ రాజీనామా చేయాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వమే బర్తరఫ్ చేయాలన్నారే తప్ప.. 'అదానీ అవినీతిపై కేంద్రం విచారణ జరపాలి' అని డిమాండ్ చేయలేదని చెప్తున్నారు. మిగతా మంత్రులు, నేతలు అదానీపై ఎన్ని విమర్శలు చేసినా.. సీఎం మాత్రం ప్రధాన అజెండాను పక్కనబెట్టి తూతూమంత్రం విమర్శలకే ఎందుకు పరిమితం అయ్యారంటూ కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

మళ్లీ అదే ఆవుకథ..

సీఎం తన ప్రసంగంలో ఐదు నిమిషాలు మోదీ, అమిత్ షాను తిట్టడానికి కేటాయిస్తే, దాదాపు ఆరు నిమిషాలు జవహర్‌లాల్ నెహ్రూ నుంచి పీవీ వరకు కాంగ్రెస్ ప్రధానులను పొగడటానికి సరిపోయింది. మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీని దుష్టచతుష్టయంగా అభివర్ణించి.. నలుగురూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. హమ్ దో.. హమారే దో అన్నట్టుగా యావత్ ప్రపంచాన్ని దోచుకునేలా మోదీ, అమిత్‌షా వ్యహరిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి బీజేపీ ముప్పులా మారిందన్నారు. దేశాన్ని ప్రధాని మోదీ అప్పుల ఊబిలో నెట్టారంటూ సందర్భం లేని వ్యాఖ్యలు చేశారు. ఇక.. ధర్నా అసలు ఉద్దేశం కన్నా బీఆర్ఎస్‌ను విమర్శించడానికి ఎక్కువ సమయం తీసుకున్నారు. దాదాపు 10 నిమిషాలపాటు కేసీఆర్, కేటీఆర్‌పై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో కొన్నిరోజులుగా చెప్తున్న ఆవుకథనే మళ్లీ చెప్పారు. రాజీవ్‌గాంధీ గొప్పదనాన్ని వర్ణించడంతోపాటు సచివాలయం ముందు ఆయన విగ్రహాన్ని పెడతామని, దమ్ముంటే తొలగించాలని, దాడులు చేస్తామని.. ఇలా పాత ముచ్చట్లే చెప్పుకొచ్చారు. అదానీని, అసలు విషయాన్ని పక్కనపెట్టి.. అనవసరంగా కేసీఆర్‌ను, కేటీఆర్‌ను ఎందుకు విమర్శించారో అక్కడికి వచ్చిన నేతలకు కూడా అర్థం కాలేదు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఉన్నాయి.. రైతులు రోడ్డెక్కొద్దు

రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, రైతులు రోడ్డెక్కొద్దని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఏ రైతుకు రుణమాఫీ కాకపోయినా.. సమస్య ఉన్నా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. కలెక్టరేట్లలో అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేశారని, వారికి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఆయా సమస్యలను పరిష్కరించి రుణమాఫీ చేస్తారని తెలిపారు.



మురుగు కాలువలో లభ్యమైన చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న కార్మికుడు

డ్రైనేజీలో గల్లంతైన చిన్నారి మృతి

ఇంటికి కొద్ది దూరంలో మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, ఆగస్టు 22: ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి గల్లంతైన చిన్నారి మృతి చెందింది. ఇంటికి సమీపంలోనే మురుగు నీటిలో మృతదేహం లభించింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నందనగర్‌లో నివాసముండే బాలిక అను (2) బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ మురుగు కాలువలో పడి గల్లంతయింది. ఆనంద్‌నగర్ కాలనీ నుంచి కాలువలో గాలిస్తూ వెళ్లగా.. న్యాల్‌కల్ రోడ్డులోని పీఎఫ్ కార్యాలయం సమీపంలో చెత్తలో పాప మృతదేహం కనిపించింది. అప్పటి దాకా ముద్దులొలికే మాటలతో గడిపిన అను.. విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు పూజ, మారుతి గుండెలు బాదుకున్నారు. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రికార్డు స్థాయిలో మక్కల ధరలు

క్వింటాకు రూ.2821

కాశీబుగ్గ, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర రెండు నెలల క్రితం క్వింటాకు రూ.2790 పలకగా ఆ తర్వాత రేట్ తగ్గింది. మళ్లీ గతవారం రూ.2765కు చేరింది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా గురువారం క్వింటాకు రూ.2,821 ధర పలికినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన రైతు చిలుమురి మొగిలి 33 క్వింటాళ్ల మక్కలు తీసుకురాగా.. మాధవి ట్రేడర్స్ అడ్తి ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ ఖరీదు వ్యాపారి కొనుగోలు చేశారు.

అదానీపై రేవంత్‌ది ద్వంద్వ వైఖరి

- రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలను రద్దు చేయాలి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ బహిరంగలేఖ



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అదానీ వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. అదానీ అవినీతిపై నిగ్గుతేల్చాలని ఈడీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ధర్నా నిర్వహించిందని, ఆయన సీఎం హోదాలో అదానీ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తు చేశారు. 2024 జనవరిలో రేవంత్‌రెడ్డి సర్కార్ డేటా స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ, సిమెంట్, డిఫెన్స్, ఏరో స్పేస్‌తో సహా వివిధ రంగాల్లో రూ.12,400 కోట్ల పెట్టుబడుల విషయంలోనే కాకుండా హైదరాబాద్‌లోని పాతబస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలుకు అదానీ గ్రూప్‌నకు అనుమతులు ఇచ్చిన విషయాలను ఎలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ దశలో అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. బీజేపీతో కుమ్మక్కు అయింది.. రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈడీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి నిరసన తెలిపారని పేర్కొన్నారు. అదానీ విషయంలో రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై తేల్చుకోవాలని ఆయన రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేకు సూచించారు. తక్షణమే అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎం తమ్ముడికో న్యాయం సెబీ చైర్‌పర్సన్‌కో న్యాయమా?

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు
- హిండెన్ బర్గ్ వెనుక కాంగ్రెస్? : ఏలేటి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): వ్యాపారాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడికి ఓ న్యాయం, సెబీ చైర్‌పర్సన్‌కు ఒక న్యాయమా? అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తన తమ్ముడైతే వ్యాపారాలు చేసుకోవద్దా? అని సీఎం అన్నారని, మరి సెబీ చైర్ పర్సన్ కంపెనీల షేర్లు ఎందుకు కొనొద్దని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి హిండెన్ బర్గ్ వార్తలపై తప్ప సెబీపై, సుప్రీంకోర్టుపై, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని మండిపడ్డారు. బ్లిట్జ్ పేపర్‌లో రాహుల్ గాంధీకి పెండ్లయిందని, పిల్లలున్నారని రాశారని చెప్పారు. హిండెన్ బర్గ్ రాసింది నిజమే అయితే బ్లిట్జ్ రాసింది కూడా నిజమేనా? అని ప్రశ్నించారు. ఒకవేళ తప్పయితే నోటీసులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. బ్లిట్జ్ పేపర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సిట్ వేస్తారా? అని సవాల్ విసిరారు. హిండెన్ బర్గ్ నివేదికకు కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చి రాజకీయంగా రచ్చ చేయడం చూస్తుంటే ఆ నివేదిక రూపకల్పనకు కాంగ్రెస్ సహకరించిందనే అనుమానం కలుగుతున్నదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు.

భర్త బతికుండగానే డెత్ సర్టిఫికెట్

- ఇంటి జాగ విక్రయించి భార్య ఘరానా మోసం
- ఆపై 478 (ఏ) కింద కేసు

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 22: భర్త బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని.. అతని పేరిట ఉన్న ఇంటి జాగను అమ్ముకుని.. తిరిగి అతనిపైనే వేధింపుల కింద కేసు వేసింది ఓ భార్య. ఇందుకు సంబంధించిన ఫొటోలు స్థానికంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన మాలోత్ వినోద్‌కు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గుమ్మడివెల్లికి చెందిన నిర్మలతో 2008లో వివాహం జరిగింది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తి 2013లో అక్కడి పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల చట్టం 498 (ఏ) కింద కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు విషయంలో తిరుగుతున్న వినోద్.. ఇటీవల వరంగల్ కోర్టులో ప్రాక్టీస్ చేసే ఒక లాయర్‌ను సంప్రదించాడు. వినోద్ తరఫు లాయర్ వివరాలు సేకరించగా విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. 2013 మార్చిలోనే నిర్మల వినోద్ మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నది. అదే ఏడాది సెప్టెంబర్‌లో 498 (ఏ) ఫిర్యాదు చేసింది. 2021లో వినోద్ పేరిట ఉన్న 150 గజాల భూమిని సైతం ఇతరులకు విక్రయించింది. ఈ ఘరానా మోసంపై బాధితుడు కాజీపేట పోలీసులను ఆశ్రయించగా.. ఇది ఇక్కడి అంశం కాదని, నేరం జరిగిన దగ్గర ఫిర్యాదు చేయాలని సూచించారు. సాక్ష్యాలు చూసి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బాధితుడి తరఫు లాయర్ తెలిపారు. ఈ విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డిని సంప్రదించగా బాధితుడు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని వివరించినట్టు తెలుస్తున్నది.

సీఎం శాఖలో పదోన్నతుల అర్రాస్!

మొదటిపేజీ తరువాయి...

317జీవో కారణంగా మరికొద్దిమంది డిగ్రీ లెక్చరర్లు స్థానికతను కోల్పోయారు. వాస్తవంగా ఇక్కడ విషయం ఏమిటంటే మెరిట్ ఆధారంగా డిస్‌లొకేట్ అయినవారికి, 317జీవో బాధితులకు ఎక్కడా సంబంధం లేదు. ఒకరు మెరిట్ ఆధారంగా స్థానికతను కోల్పోతే, మరొకరు 317 జీవో కారణంగా స్థానికతను కోల్పోయారు. కానీ సొసైటీ మాత్రం ఇక్కడ వేర్వేరుగా పరిగణించకుండా 317, మెరిట్ ఫలితంగా డిస్‌లొకేట్ కేసులన్నింటినీ ఒకే ఘాటన కట్టి ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్లకు సీనియార్టీ లిస్ట్‌ను రూపొందించడం గమనార్హం. అభ్యర్థులు పెట్టుకున్న అప్లికేషన్లలోనే ఆర్ఎల్1 (రిక్రూట్‌మెంట్ 1బ్యాచ్), ఆర్ఎల్2 బ్యాచా? అపాయింట్‌మెంట్ ఎక్కడ? సొంత ప్లేస్ ఎక్కడనేది సర్టిఫికెట్ల ద్వారానే తెలుస్తుంది. కానీ అవేవీ చేయకుండా కామన్ సీనియార్టీ పేరిట, నచ్చిన వారికి, అడ్డదారిలో వచ్చిన వారికి కోరుకున్న చోటుకు, కాలేజీకి నిబంధనలకు విరుద్ధంగా జోన్లకు జోన్లనే మార్చి పోస్టింగ్‌లు ఇచ్చారు. అర్హతలున్నా, మెరిట్ ఉన్నా కూడా అనేక మందిని దూరప్రాంతాలకు నెట్టేశారు. సొంత జోన్లలో ఉన్నవారిని సైతం తాజా బదిలీల్లో ఇతర జోన్లకు పంపించారు. డిస్‌లొకేట్ అయినవారిని సొంత ప్రాంతాలకు పంపి న్యాయం చేయాల్సింది పోయి మరింత అన్యాయానికి గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. బాధిత అధ్యాపకులంతా ఇప్పుడు కన్నీటిపర్యంతమవుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రిన్సిపాళ్ల ప్రమోషన్లు

బదిలీల సంగతి అంటుంచితే డిగ్రీ గురుకుల కాలేజీల ప్రిన్సిపాళ్ల పోస్టుల ప్రమోషన్లలోనూ సొసైటీ పూర్తిగా నియమనిబంధనలకు పాతరేసింది. సొసైటీ 2020లో మొత్తంగా 19 డిగ్రీ ప్రిన్సిపాల్ పోస్టులను నోటిఫై చేసింది. వాటిలో 8 పోస్టులే భర్తీ అయ్యాయి. 11 పోస్టులు మిగిలిపోయాయి. తాజాగా ఆ పోస్టులతోపాటు అదనంగా మరో 6 పోస్టులు కూడా మంజూరుకాగా మొత్తంగా 17 పోస్టులు అందుబాటులోకి వచ్చాయి. సొసైటీ బైలాస్ ప్రకారం వీటిలో 30శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా, 70శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలి. ఇందుకు విరుద్ధంగా పూర్తిగా 100శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారానే సొసైటీ భర్తీ చేసింది. డీఎల్, ప్రిన్సిపాల్ పోస్టులను సీనియార్టీ ఆధారంగా నింపిన చరిత్ర సొసైటీలోనే కాదు, దేశ విద్యా వ్యవస్థలోనే ఎక్కడా లేదు. డీఎల్ పోస్టు బోధనకు సంబంధించినదయితే, ప్రిన్సిపాల్ పోస్ట్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించింది. యూజీసీ గైడ్ లైన్స్ ప్రకారం 15 ఏండ్ల టీచింగ్ అనుభవం, పీహెచ్‌డీ, సమర్పించిన రీసెర్చ్ పత్రాలు తదితర అకడమిక్ ఫర్మార్మెన్స్ ఇండెక్స్ (ఏపీఐ) ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలి. ఇదే యూజీసీ గైడ్‌లైన్స్‌నే పాటించాలని అన్ని సొసైటీలకు తెలంగాణ ప్రభుత్వం 2019లో జీవో 15ను విడుదల చేసింది. కానీ సొసైటీ ఆ నిబంధనలన్నీ తుంగలో తొక్కిపెట్టి, అర్హతలను పరిశీలించకుండానే కేవలం కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించింది. ఇక్కడ మరో విషయం ఏమిటంటే సోషల్ వెల్ఫేర్‌లో మొత్తం మహిళా డిగ్రీ కాలేజీలే ఉన్నాయి. మహిళా గురుకులాల్లో మహిళా టీచర్లనే నియమించాలనే నిబంధన ఉన్నది. కానీ ఆ నిబంధనకు సొసైటీ పాతరేసింది. నోటిఫై చేసిన పోస్టులకు సంబంధించి రిజర్వేషన్లను కూడా ప్రమోషన్లలో కల్పించలేదు. అర్హులకు ఇచ్చారా? అంటే అదీ లేదు. సొసైటీ బైలాస్‌ను కూడా తుంగలోతొక్కి 100శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేశారు. అలా చేయాలంటే సంబంధిత మినిస్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ, మినిస్ట్రీ, ఇద్దరు ఎడ్యుకేషనలిస్ట్‌లు, రెండు యూనియన్ల మెంబర్లు, అక్కడున్న సీనియర్ మోస్ట్ ప్రిన్సిపాళ్లు ఇలా జీబీ మెంబర్లు కూర్చుని నిర్ణయాలు తీసుకుని తీర్మానించాలి. జీబీలో నోట్ చేసి ఆ తర్వాత చేపట్టాలి. ఆ మినట్స్ నోట్‌ను ప్రమోషన్ ఆర్డర్‌లో రెఫరెన్స్ ఐడీగా చూపాలి. కానీ అదేమీ లేకుండా సొసైటీ నిర్వహించింది. కేవలం డిపార్ట్‌మెంటల్ టెస్ట్, కామన్ సీనియార్టీ లిస్ట్‌ను ఫాలో అవుతున్నామని చెప్పి స్కూల్ ఎక్స్‌పీరియన్స్ వాళ్లను తీసుకొచ్చి డీఎల్ ప్రిన్సిపాళ్లుగా ప్రమోషన్ కల్పించడం గమనార్హం. ఈ తతంగం వెనుక పెద్దమొత్తంలో చేతులు మారాయని డీఎల్ అభ్యర్థులు వెల్లడిస్తున్నారు.

చక్రంతిప్పిన అధికార పార్టీ లీడర్.. ఓ యూనియన్ లీడర్

డీఎల్ ప్రిన్సిపాల్ ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించిన మొత్తం వ్యవహారంలో అధికారపార్టీకి చెందిన కీలక నాయకుడు, సొసైటీకి చెందిన ఓ యూనియన్ నాయకుడు, ఓడీల మీద పనిచేసిన ఇద్దరు ఉన్నతాధికారులు, ఒక డాటా ఆపరేటర్ కలిసి అక్రమాలకు తెరలేపారని అధ్యాపకులే బాహాటంగా చెబుతున్నారు. ప్రమోషన్లకు సంబంధించిన ప్రక్రియే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం డీఎల్ ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ తీసుకున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ డిగ్రీ లెక్చరర్‌తోపాటు, మరో పీడీ నెల రోజుల పాటు ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకుండా సొసైటీ ప్రధాన కార్యాలయంలో నెల పాటు తిష్ట వేసి ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ లిస్ట్‌లను రూపొందించడం గమనార్హం. సూటిగా చెప్పాలంటే ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్న టీచరే ప్రమోషన్ల ప్రక్రియను నిర్వహించిన చరిత్ర సొసైటీలో ఉండడం గమనార్హం. లక్షల్లో వసూలు చేసి డీఎల్ ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు, న్యూ నియామకాలు అన్నింటినీ చక్కబెట్టారని విశ్వసనీయ సమాచారం. అక్రమాల కోసమే ఎక్కడ ఎన్ని మంజూరు పోస్టులున్నాయి? వేకెన్సీలున్నాయి? అనేవి స్పష్టంగా చూపించలేదు. సీనియార్టీ జాబితాలను ఏకంగా మూడు సార్లకు మించి మార్చారు. నచ్చిన వారికి, డబ్బు ముట్టజెప్పినవారికి ప్రమోషన్లు, బదిలీలు కల్పించేందుకు డాటా ఆపరేటర్‌ను అడ్డంపెట్టుకుని కావాలని క్లరికల్ మిస్టేక్స్‌కు పాల్పడ్డారు. అభ్యర్థుల వివరాలనే గోల్‌మాల్ చేయడం కొసమెరుపు. డీఎల్ ఒక్కటే కాదు జేఎల్, పీజీటీ, టీజీటీ బదిలీలు, ప్రమోషన్లలోనూ ఇదే తంతు కొనసాగిందని, ఒక్కో పోస్టుకు 5-10లక్షల వరకూ చేతులు మారాయని తెలుస్తున్నది. మొత్తంగా 5 కోట్ల మేర కుంభకోణం జరిగిందని సొసైటీ టీచర్లే బాహాటంగా ఆరోపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

ఇదేమని అడిగితే బెదిరింపులు..

బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన ప్రక్రియలో అన్యాయానికి గురైన టీచర్లు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నచ్చిన ప్లేస్‌కోసం ప్రమోషన్ వదులుకుంటే చివరికి ఆ చోటు దక్కక, ప్రమోషన్ కూడా చేజారి కన్నీటి పర్యంతమవుతున్నారు. అర్హతలుండి, మెరిట్ ఉండీ ప్రమోషన్లు రాక, జోన్లు ఎందుకు మారాయో తెలువక, అడిగితే చెప్పేవారు లేక, కుటుంబాలకు దూరమై మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఇదేమని అడిగితే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌పై సస్పెన్షన్ చేస్తామని సొసైటీ ఉన్నతాధికారులు బాధిత టీచర్లపై బెదిరింపులకు దిగడం గమనార్హం. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా ఎవరూ హెడ్ ఆఫీస్‌కు రావద్దని ఆంక్షలు విధించడమే కాకుండా అలా ఎవరైనా వస్తే సంబంధిత ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేస్తామని సెక్రటరీయే స్వయంగా ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న శాఖలో ఇంతగా అక్రమాలు జరుగుతున్నా ఎవరూ స్పందించకపోవడంపై టీచర్లు నిప్పులు చెరుగుతున్నారు. సీఎస్‌కు ఫిర్యాదు చేసినా, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసినా ఫలితం లేకుండా పోయిందని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లపై డిపార్ట్‌మెంట్‌కు చెందిన విజిలెన్స్, లేదంటే ఏసీబీతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సర్కారు స్పందించకుంటే మూకుమ్మడిగా తరలివచ్చి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని సోషల్ వెల్ఫేర్ గురుకుల టీచర్లు హెచ్చరిస్తున్నారు.

ఇవీ ఉదాహరణలు..

- డీల్ పిన్సిపాల్ ప్రమోషన్‌కు 15ఏళ్ల టీచింగ్ అనుభవముండాలి. కానీ పీజీటీగా సొసైటీలో పదేళ్లపాటు పని చేసి దశాబ్దకాలం క్రితమే ఒకరు సొసైటీ హెడ్ ఆఫీస్‌లో ఓడీ పేరిట చేరారు. అక్కడే జేఎల్ ప్రమోషన్ తీసుకున్నారు. బోధన అనుభవం లేకుండానే మళ్లీ డీఎల్‌గా ప్రమోషన్ తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ డీఎల్ ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ పొందారు. ఇప్పుడైనా కేటాయించిన కాలేజీకి వెళ్లారా అంటే అదీలేదు. ఆ వెంటనే ఇప్పుడు మళ్లీ ఓడీ (ఆన్‌డ్యూటీ) ఆర్డర్‌ను తీసుకుని సొసైటీ ప్రధాన కార్యాలయంలో తిష్టవేయడం గమనార్హం.
- వరంగల్ ఈస్ట్‌కాలేజీలో కామర్స్‌కు సంబంధించి 5 పోస్టులు మంజూరు ఉన్నాయి. కానీ ఏడుగురికి పోస్టింగ్ ఇచ్చారు. హిస్టరీ లెక్చరర్‌ను ఎకనామిక్స్ చెప్పుమంటున్నారు. అక్కడ పోస్టింగ్ తీసుకున్న తెలుగు టీచర్‌ను లైబ్రరీ చూసుకోమంటున్నారు.
- సిద్దిపేట కాలేజీలో ఎంపీసీఎస్ కోర్సు లేదు. అయినా మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్స్ కెమిస్ట్రీ వేకెన్సీ చూపెట్టారు. ముగ్గురు టీచర్లకు వర్క్‌లోడ్ లేదు.

తప్పులు జరిగితే రాసివ్వండి: సెక్రటరీ వర్షిణి

ఇదే విషయమై సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణిని 'నమస్తే తెలంగాణ' సంప్రదించింది. అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై వివరణ కోరగా అలాంటిదేమీ లేదని ఆమె తెలిపారు. ప్రమోషన్లు, బదిలీలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టామని వివరించారు. తప్పులు ఎక్కడ జరిగాయో టీచర్లు చూపాలని, రాసివ్వాలని సూచించారు. కోర్టు ఆదేశాలతో సొసైటీకి పని లేదని, సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ సొసైటీకి ఉన్నదని వెల్లడించారు.

హెచ్‌పీసీ నిర్ణయంతోనే రీ డిజైన్

- పీసీ ఘోష్ కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్సీ మురళీధర్

హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ): హైపవర్ కమిటీ (హెచ్‌పీసీ) నిర్ణయం మేరకే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీ డిజైన్ చేశామని విశ్రాంత ఈఎన్సీ మురళీధర్ పునరుద్ఘాటించారు. జస్టిస్ ఘోష్ కమిటీ ఎదుట గురువారం మరోసారి హాజరైన ఆయన పలు విషయాలను వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వాములైన ఇంజినీర్ల విచారణ గురువారమూ కొనసాగింది. ప్రాజెక్టు రీడిజైన్‌పై ఇప్పటికే పలు ప్రశ్నలను సంధించిన కమిషన్ మరోసారి అందుకు సంబంధించిన అంశాలపైనే వివరాలను సేకరించింది. రీ డిజైన్ ఎలా? ఎప్పుడు, ఏ విధానం ద్వారా చేశారు? మారిన ప్రాజెక్టు ఆయకట్టు ఎంత? బరాజ్‌లకు టీఏసీ అనుమతులు ఎప్పుడు లభించాయి? తదితర అంశాలపై మురళీధర్‌ను కమిటీ ప్రశ్నించింది. ఈ సందర్భంగా ప్రతి ప్రశ్నకూ సూటిగా, ఎలాంటి తడబాటు లేకుండానే రిటైర్డ్ ఈఎన్సీ మురళీధర్ బదులిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు, కాంతనపల్లి, దుమ్ముగూడెం ప్రాజెక్టుల్లో సవాళ్ల పరిష్కారానికి గత ప్రభుత్వం 2014 జూలై 22న హైపవర్ కమిటీని నియమించిందని, ఆ మేరకు జీవో 10ని జారీ చేసిందని గుర్తుచేశారు. ఆ కమిటీ సూచనలతో సవాళ్ల పరిష్కారానికి రీ డిజైన్లు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 11 డైరెక్టరేట్లు, టీఏసీ అనుమతులు వచ్చాయని తెలిపారు. మురళీధర్ చెప్పిన అంశాలన్నింటినీ కమిషన్ రాతపూర్వకంగా తీసుకున్నది.

సీడబ్ల్యూసీ గైడ్‌లైన్స్ ప్రకారమే డిజైన్లు

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లను రూపకల్పన చేసిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) రిటైర్డ్ ఈఎన్సీ నరేందర్‌రెడ్డిని గురువారమే జస్టిస్ ఘోష్.. క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. డిజైన్లకు సంబంధించి నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన అఫిడవిట్లలోని అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రాజెక్టు రూపకల్పన, సర్వేలు, లోకేషన్ల ఎంపికలో సీడీవో పాత్ర ఏమీ లేదని నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యాప్కోస్ సర్వే, లోకేషన్ల ఎంపిక పూర్తయిన తర్వాత డిజైన్ల కోసం వచ్చారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సందర్శించి సైట్ కండీషన్లను పరిశీలించాక, హైడ్రాలజీ, జియో ఇన్వెస్టిగేషన్ నివేదికలు వచ్చాక, 2డీ స్టడీస్ తర్వాతే డిజైన్లను రూపొందించామని తెలిపారు. 3డీ స్టడీస్ రిపోర్టు అంశాలు, డిజైన్లు సరిపోలాయని తెలిపారు. ఫీల్డ్ ఇంజినీర్లు బాధ్యత వహిస్తామని ఒప్పుకున్న తర్వాతే డిజైన్ల చెక్‌లిస్ట్‌పై సంతకాలు చేశామని తెలిపారు. డిజైన్ల అంశాలపై ఎప్పటికప్పుడు ఎల్అండ్‌టీ ఏజెన్సీ ప్రతినిధులు సమ్మతించాకే ఆమోదించామని స్పష్టంచేశారు. షూటింగ్ వెలాసిటీ అంచనాలకు అనుగుణంగా డిజైన్లను రూపొందించకపోవడం వల్లే బరాజ్‌లోని 2 పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయంటే తాను అంగీకరించబోనని నరేందర్‌రెడ్డి తేల్చిచెప్పారు. రాఫ్ట్ కింద ఒక చోట ఇసుక కొట్టుకుపోవడం వల్లే ఇది జరిగి ఉంటుందని తెలిపారు. అయితే రాఫ్ట్ మొత్తాన్ని పూర్తిగా ఓపెన్ చేసి పరీక్షించి నిర్ధారించాల్సి ఉంటుందని, ఇదే విషయమై డిజైన్లు రూపకల్పన చేసిన ఇంజినీర్‌గా సెక్రటరీకి, ఏజెన్సీకి లేఖలు కూడా రాశానని స్పష్టం చేశారు.

తీరని రుణం... రైతుల రణం

రేవంత్.. నీ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకో!

మొదటిపేజీ తరువాయి...

రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, రాకేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని, రైతుల రుణం తీరుస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులతో రణం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అక్రమ కేసులతో వేధిస్తున్నదని దుయ్యబట్టారు. చివరి రైతు వరకూ రుణమాఫీ అయ్యేదాకా రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆగస్టు 15లోగా మాఫీ చేస్తానని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టు వేసి, మోసం చేశారని, రేవంత్‌రెడ్డి పాపం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టమని పేర్కొన్నారు. సీఎంను క్షమించాలని, ప్రజలను ఆశీర్వదించాలని స్వామివారిని వేడుకున్నట్టు చెప్పారు. అన్ని రకాల వడ్లకు బోనస్, రైతుభరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ అయ్యేంత వరకు పోరాడేలా బీఆర్ఎస్‌కు శక్తిని ప్రసాదించాలని లక్ష్మీనరసింహుడిని కోరినట్టు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రమాణం చేసిన ఆలయాలు, మెదక్ చర్చి, జహంగీర్‌పీర్ దర్గా వంటి అన్ని చోట్లకూ వెళ్లి దేవుళ్లను ప్రార్థిస్తామని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రికి రుణమాఫీపై మాట్లాడే మొహం లేక మీడియాతో మాట్లాడాలంటూ మంత్రులను కాళ్లావేళ్లా పడుతున్నారని ఎద్దేవా చేశారు.

రేవంత్ రెడ్డిని క్షమించండి.. తెలంగాణ ప్రజలను దీవించండి

'డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది రేవంత్ రెడ్డా? కాదా? డిసెంబర్ 7న ఎందుకు మాఫీ చేయలేదు? గద్దెనెక్కాక రుణమాఫీ మర్చిపోయిండు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల హామీలతో ప్రజలను మోసగించిండు. పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మడం లేదని చివరికి దేవుళ్ల మీద ఒట్లు పెట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతానని ఏ ఊరికి పోతే ఆ ఊరు దేవుడి మీద ఒట్టు పెట్టిండు.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై కూడా ఒట్టు పెట్టిండు. నర్సన్న తెలంగాణ కొంగుబంగారం. ఎంతో మహిమ గల దేవుడు. ఆయన మీద ఒట్టు పెట్టి మాట తప్పితే క్షమించరాని నేరం. పాలకుడే పాపం చేసి మాట తప్పడం వల్ల ప్రజలకు, రాష్ట్రానికి అరిష్టం వాటిల్లవద్దని స్వామివారిని దర్శించుకున్నాం. ఈ పాపాత్ముడిని, దుర్మార్గుడిని, దివాలాకోరు ముఖ్యమంత్రిని క్షమించండి. రేవంత్‌రెడ్డి చేస్తే శిక్ష ప్రజలకు పడవద్దని.. తెలంగాణ ప్రజలను దీవించండని స్వామివారిని వేడుకున్నాం. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి చేయకపోవడం మోసం కాదా? రైతులనే కాదు.. దేవుడిని కూడా రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. దైవ ద్రోహానికి పాల్పడ్డారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

రేవంత్‌రెడ్డి అందరినీ మోసం చేశారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. అన్ని రకాల పంటలకు బోనస్ వచ్చే దాకా, రైతులకు పూర్తిగా రుణమాఫీ జరిగే దాకా, రైతుభరోసా ఇచ్చే దాకా పోరాడే శక్తిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అందించాలని స్వామివారిని వేడుకున్నామని, ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేసి ఉంటే, రైతుల మీద వడ్డీల భారం పడేది కాదని, ఆగస్టులో మాఫీ చేయడం వల్ల ఏడు నెలల వడ్డీ భారం రైతుల మీద పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీలో జాప్యం చేసినందుకు ఏడు నెలల వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పు నీది.. శిక్ష రైతులకా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



యాదగిరిగుట్టలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

> నిజంగా రుణమాఫీ అయితే బ్యాంక్‌ల వద్ద రైతులు ఎందుకు పడిగాపులు కాస్తున్నరు? వ్యవసాయ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ఎందుకు తిరుగుతున్నరు? సీఎం దిష్టిబొమ్మలను ఎందుకు తగలబెడుతున్నరు? రోడ్ల మీదకు వచ్చి ఎందుకు ధర్నాలు చేస్తున్నరు? రైతుభరోసా ఎందుకు ఇవ్వలేదు? ఎప్పుడు ఇస్తవ్? చిన్న సన్నకారు రైతులు అప్పులు చేసుకునే పరిస్థితి వచ్చింది. - హరీశ్‌రావు

దేవుళ్లను మోసం చేసిన చరిత్ర రేవంత్‌ది

'రైతు రుణమాఫీ చేశాం.. నన్ను రాజీనామా చేయమంటుండు. ప్రజల పక్షాన పోరాడటమే నాకు తెలుసు. మాట మీద నిలబడటం నాకు తెలుసు. రెండుసార్లు ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసిన చరిత్ర మాది. మోసం చేసే చరిత్ర నీది. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పిన చరిత్ర నీది. రుణమాఫీ అంటూ దేవుళ్లను కూడా మోసం చేసిన చరిత్ర నీది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు.

ప్రజాపాలనలో ధర్నాలు నిషేధం

'ప్రజాపాలనలో ధర్నాలు నిషేధం అంటూ పోలీసులు రైతులకు నోటీసులు ఇస్తున్నరు. బాల్కొండలో ధర్నాలో పాల్గొంటే కేసులు, చర్యలు ఉంటాయని రైతులకు నోటీసులు ఇచ్చారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మీడియా ప్రతినిధులపై సీఎం అనుచరులు దాడులు చేశారు. కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడిలో నిరసన తెలపడానికి వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఆదిలాబాద్‌లో పోలీస్ యాక్ట్ అమల్లోకి తీసుకొచ్చారు. అడుగడుగునా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నరు' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ రాజ్యమంటే అణిచివేయడమేనా?

ప్రజారాజ్యం, ఇందిరమ్మ రాజ్యమంటే అణిచివేయడమేనా? ఇందిరమ్మ రాజ్యంలో నిరసన తెలిపే హక్కు ఉండదా? రైతులు తమ బాధలను చెప్పుకొని, నిరసన తెలిపే హక్కు ఉండదా? అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఆంక్షలు పెట్టినా, చివరి రైతు వరకూ రుణమాఫీ అయ్యేదాకా ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కొట్లాడుతూనే ఉంటదని స్పష్టంచేశారు. పోలీసులు కూడా చట్టం ప్రకారం నడుచుకోవాలని, చట్టాన్ని అతిక్రమించి ప్రభుత్వానికి కొమ్ముగాయొద్దని హితవు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతం కాదు..అన్నీ రాసిపెడుతున్నాం.. నాలుగేండ్లకు మళ్లీ మేం వస్తాం.. చట్ట ప్రకారం వ్యవహరించండి జాగ్రత్త'అంటూ పోలీసులను హెచ్చరించారు. ఆగస్టు నెల వచ్చినా ఊర్లల్లో చెరువులు నింపడం లేదని, 11 విడతల్లో రూ.72 కోట్ల రైతుబంధు, రైతుబీమా ఇచ్చి చెరువులు నింపి ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకేలా నీళ్లు నింపిన ఘనత కేసీఆర్‌ది అని స్పష్టంచేశారు.

> లాఠీలతోనో, బెదిరింపులతోనో, పోలీసులతోనో రైతుల ఆగ్రహానికి ఆనకట్టు వేయలేరు. నువ్వు చేసిన మోసం, ద్రోహాన్ని సరిచేసుకోవాలి. పోలీసులు, లాఠీలతో రైతులను అడ్డుకోవడం మూర్ఖత్వం. అన్నదాతకు అన్యాయం చేసినోడు బాగుపడినట్టు చరిత్రలో లేదు. - హరీశ్‌రావు

> రేవంత్‌రెడ్డీ.. నీకు నీతి, నిజాయతీ ఉంటే బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పు. నువ్వు ఒట్టు వేసిన దేవుళ్ల దగ్గరకు వెళ్లి ప్రాయశ్చిత్తం చేసుకో. 'దేవుడా! నేను తప్పు చేసిన.. నన్ను క్షమించు.. తొందరపడి ప్రమాణం చేసిన' అని చెప్పి ప్రాయశ్చిత్తం చేసుకో. నువ్వు చేసుకోవు గనుకనే మేం రావాల్సి వచ్చింది. పాపాత్ముడు, అబద్ధాలకోరు, దివాలాకోరు, దగాకోరు సీఎంను తెలంగాణ ప్రజల ముఖం చూసి క్షమించాలని, రాష్ట్ర ప్రజలను దీవించాలని లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నాం. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టం చుట్టుకుంటుందని పాప పరిహార పూజలు చేశాం. - హరీశ్‌రావు

హరీశ్‌రావు ప్రెస్‌మీట్‌లో కరెంట్ కట్

యాదగిరిగుట్టలోని హరిత హోటల్‌లో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతుండగా కరెంటు పోయింది. దీంతో ప్రజాప్రతినిధులతో పాటు అక్కడున్న మీడియా ప్రతినిధులు నవ్వుకున్నారు. దాంతో కొంతసేపు కరెంట్ లేకుండానే ప్రెస్‌మీట్ కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతులే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తరు : గొంగిడి సునీత

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవనేని కృష్ణారావు, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు క్యామ మల్లేశ్, బూడిద భిక్షమయ్యగౌడ్, గొంగిడి మహేందర్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి అంటే కుచితం, కుతంత్రం, కుటిలం, కపటం: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

రేవంత్‌రెడ్డి అంటే కుచితం, కుతంత్రం, కటిలం, కపటమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కపట నాటక సూత్రధారి అని మండిపడ్డారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ గీతాన్ని పాడని గొంతు ఉందంటే అది రేవంత్‌రెడ్డిదేనని విమర్శించారు. రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డికి రైతన్నలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్: పల్లా

సంపూర్ణ రుణమాఫీ జరిగేదాకా, రూ.2 లక్షలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేదాకా ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. డిసెంబర్‌లో చేయాల్సిన రుణమాఫీని ఆలస్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ చెల్లించలేదని, వేలాది రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు.

స్పీకర్, ఎమ్మెల్యేలకు ఇచ్చి.. చిరుద్యోగులకు ఇవ్వరా..?

'రూ.2 లక్షలకుపైగా ఉన్న అప్పుపై ప్రభుత్వానికి స్పష్టత లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రూ.2 లక్షలు పైన రుణం ఉన్నవారు మిగతా డబ్బులు కట్టాకే మాఫీ చేస్తామనే నిబంధన ఎందుకు? ఈ రూల్‌తో మళ్లీ మూడు, నాలుగు రూపాయల వడ్డీతో అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఎందుకు కల్పిస్తున్నరు? అని నిలదీశారు. రేషన్‌కార్డు, ఇన్‌కం ట్యాక్స్ నిబంధనలతో చిన్న ఉద్యోగులైన ఆర్టీసీ, సింగరేణి కార్మికులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా రుణమాఫీ ఆపారని, కానీ స్పీకర్‌కు, ఎమ్మెల్యేలకు మాఫీ చేస్తున్నారని మండిపడ్డారు. చిరు ఉద్యోగులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు.

46% మందికే మాఫీ

'రేవంత్‌రెడ్డి రుణమాఫీ అయిపోయిందంటరు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాఫీ పూర్తిగా కాలేని చెప్తున్నరు' అని హరీశ్‌రావు వివరించారు. రాష్ట్రంలో 46% రైతులకు మాత్రమే మాఫీ అయ్యిందని, ఇంకా 54% మందికి బాకీ ఉన్నదని చెప్పారు. మాఫీ కాలేదని మంత్రులే చెప్తున్నరు. దీనిని బట్టి ఎవరు రాజీనామా చేయాలి అని ప్రశ్నించారు.



తిరుమలగిరి చౌరస్తాలో బీఆర్ఎస్ ధర్నా శిబిరంపై దాడికి పాల్పడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు



సూర్యాపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

ధర్నాపై కాంగ్రెస్ విధ్వంసకాండ

- బీఆర్ఎస్ ధర్నా శిబిరంపై దాడి
- పలువురు నాయకులకు గాయాలు
- తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ఘటన
- పరామర్శించేందుకు వస్తున్న మాజీ మంత్రిని అడ్డుకున్న పోలీసులు
- సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే దాడి
- మోసాలను కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్ హింస
- రైతులకు న్యాయం జరిగేదాకా పోరాడుతాం : జగదీశ్‌రెడ్డి
- బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేయదు : గాదరి కిశోర్



తిరుమలగిరిలో కాంగ్రెస్ దాడిలో గాయపడిని వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన పెరుమాళ్ల రాజేశ్

సూర్యాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి : పదేండ్ల కింద రాజకీయ కక్షలు, హత్యలకు అడ్డాగా ఉన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో మళ్లీ గూండాయిజం.. విధ్వంసకాండ మొదలయ్యాయి. స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ మూకలు విధ్వంసానికి తెగబడ్డారు. రుణమాఫీపై కాంగ్రెస్ మోసానికి నిరసనగా తిరుమలగిరిలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శిబిరంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. రాళ్లు, గుడ్లు విసిరి దాదాపు గంట పాటు వీరంగం సృష్టించారు. ఈ దాడిలో పలువురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీఆర్ఎస్ నాయకులకు చెందిన కార్లు, వాహనాల అద్దాలను కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేశారు.

రెచ్చిపోయి.. రెచ్చగొట్టి..

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేసిన మోసంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు తిరుమలగిరిలో గాదరి కిశోర్ నేతృత్వంలో ధర్నా చేపట్టగా పెద్ద ఎత్తున రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోటీగా బీఆర్ఎస్ శిబిరం సమీపంలోనే సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. నినాదాలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా వందలాది మంది కాంగ్రెస్ మూకలు కర్రలు, రాళ్లు, కోడిగుడ్లు పట్టుకొని బీఆర్ఎస్ శిబిరం వైపు పరుగులు తీస్తూ ఏకబిగిన దాడి చేశారు. రాళ్లు, గుడ్లు రువ్వుతూ టెంట్లు కూల్చి వేశారు. కుర్చీలు ఎత్తికొడుతూ బీఆర్ఎస్ నేతల కార్లు, వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో తాటిపాములకు చెందిన పెరుమాళ్ల రాజేశ్, తుంగతుర్తి మండలం బండరామారానికి చెందిన పొదిల అంజయ్య, శాలిగౌరారం మండలం వంగమర్తికి చెందిన శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. వారిని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, గాదరి కిశోర్ పరామర్శించారు. కాంగ్రెస్ మూకలు బీఆర్ఎస్ శిబిరంపైనే కాకుండా రోడ్డువెంట వెళ్తున్న ఇతర వాహనాలపైనా రాళ్లు రువ్వారు. ఓ బస్సుపైకి రాళ్లు రువ్వడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ముగ్గురు మహిళలు కాంగ్రెస్ శ్రేణులపై మండిపడ్డారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

దాడికి పోలీసుల మద్దతు.. బీఆర్ఎస్ శిబిరం కూల్చివేత

బీఆర్ఎస్ ధర్నా శిబిరంపై కాంగ్రెస్ మూకల దాడికి పోలీసులూ మద్దతు పలికారు. కర్రలు, రాళ్లతో కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిందిపోయి పోలీసులే స్వయంగా బీఆర్ఎస్ ధర్నా శిబిరం టెంట్‌ను కూల్చారు. వాస్తవానికి ముందుగా తిరుమలగిరి చౌరస్తా సమీపంలో బీఆర్ఎస్ శ్రేణులు టెంట్ వేసి ధర్నాకు కూర్చున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసేందుకు పోటీగా వస్తున్నారనే విషయం గమనించి వారిని వారించాల్సిన పోలీసులే దగ్గరుండి ఉసిగొలిపి తీసుకొచ్చారని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

జగదీశ్‌రెడ్డి వాహనం అడ్డగింత

గాయపడిన బీఆర్ఎస్ నాయకులను పరామర్శించేందుకు సూర్యాపేట నుంచి తిరుమలగిరికి వస్తున్న జగదీశ్‌రెడ్డిని జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారితో మాజీ మంత్రి వాగ్వాదానికి దిగారు. గాయపడ్డవారిని పరామర్శించేందుకు వెళ్లనీయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

పదేండ్లలో ఇంత చిల్లర ఏనాడూ లేదు : మాజీ ఎమ్మెల్యే కిశోర్

కాంగెస్‌లాగా బీఆర్ఎస్ చిల్లర రాజకీయం చేయదని, పదేండ్ల పాలనలో ఏనాడూ ఇంత నీచంగా ప్రవర్తించలేదని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్పష్టంచేశారు. రుణమాఫీపై మంత్రులకే స్పష్టత లేదని, ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని, రైతులను మోసం చేస్తామంటే ఊరుకునేది లేదని చెప్పారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ రజాక్, బీఆర్ఎస్ నాయకుడు యుగేంధర్‌రావు పాల్గొన్నారు.

రెచ్చగొట్టాలని చూస్తే సహించేదిలేదు: జగదీశ్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్లోనే దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ శ్రేణులు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌పై కాంగ్రెస్ మూకల దాడి హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుమలగిరిలోని గాదరి కిశోర్ నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శిబిరంపై కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ తప్పులను, మోసాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూస్తున్నదని, హింసను ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. పోలీసులు కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నారని దీక్ష శిబిరాన్ని పోలీసులే కూలగొట్టడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎన్ని దాడులు చేసినా ప్రజల కోసం అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నామని, రెచ్చగొట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. తిరుమలగిరి ఘటనపై విచారణ చేయాలని, రైతులకు న్యాయం జరిగేదాకా తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ పాపం హరీశ్‌రావు పరిహారం

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని దేవుళ్లందరి మీద ఒట్టు వేసి మరీ చెప్పారు. తెలంగాణలో ఒట్టంటే నమ్మకం. 'రశీదు తప్పితే మసీదే గతి' అని తెలంగాణలో నానుడి. మాట విషయంలో తేడా వస్తే చివరికి దేవుడిపై ఒట్టేయడమే గ్రామీణ ప్రాంతాల్లో పరిపాటి. పచ్చబియ్యం పట్టుకొని ప్రమాణం చేస్తే, దాన్ని సత్యంగానే పరిగణిస్తారు. అటువంటిది దేవుళ్ల మీదే ఒట్టేసి మాట తప్పడమంటే.. చాలా పెద్ద పాపమే. గతంలో యాదగిరిగుట్టలో తడిబట్టలతో తప్పుడు ప్రమాణం చేసిన నాయకుడు త్వరలోనే రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవిని కోల్పోయిన సంగతి అందరికీ గుర్తే. ఈ నేపథ్యంలో మాట తప్పిన రేవంత్‌రెడ్డి చేసిన పాపం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శాపం కాకుండా ఉండాలని ఆయా ఆలయాలను దర్శించి పూజలు చేసేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఆలయయాత్ర చేపట్టారు. అందులో భాగంగా తొలుత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆ సందర్భంగా అక్కడ అందరితో కలిసి హరీశ్‌రావు చేసిన సంకల్పం.



యాదాద్రి నర్సన్న సన్నిధిలో పూజలు చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

రేవంత్ ప్రమాణం చేసిన దేవుళ్లు

తేదీ	దేవుడు/దేవత
ఏప్రిల్ 19	భద్రాద్రి రామయ్య
ఏప్రిల్ 20	మెదక్ చర్చి ఏడుపాయల దుర్గమ్మ
ఏప్రిల్ 21	యాదాద్రి నరసింహస్వామి
ఏప్రిల్ 22	బాసర సరస్వతీదేవి
ఏప్రిల్ 23	అలంపూర్ జోగులాంబ
ఏప్రిల్ 24	రామప్ప శివుడు హనుమకొండ వేయి స్తంభాలు మేడారం సమ్మక్క
ఏప్రిల్ 27	జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి
మే 2	కొమురవెల్లి మల్లన్న
మే 5	కురుమూర్తిస్వామి

కర్షకాణాం రుణబాధా నివృత్తి విషయే
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి కృత అసత్య
ప్రలాప పాప పరిహారార్థం

విశేషేన రుణ విముక్తి విషయే తస్యకృత
వాగ్దానభంగ ప్రాయశ్చిత్తార్థం
తస్య కృత దైవ ప్రమాణభంగ తీవ్ర
పాప పరిహారార్థం

సమస్త తెలంగాణ రాష్ట్ర స్థిత అమాత్యానాం, ముఖ్యమంత్రీనాం
సత్యానాం సర్వేషాం ప్రజానాం
విషయే సద్బుద్ధి ప్రసాద సిద్ధ్యర్థం

విశేషేన కర్షకాణాం రుణవిముక్తి
పర్యంతం త్వయమేవ సంకల్పిత
యుద్ధాయ శక్తి హేతవే
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి
అనుగ్రహ ప్రసాద సిద్ధ్యర్థం

ఏతస్మిన్ ముఖ్యమంత్రి కృత అసత్య
ప్రలాప ప్రజానాం బాధా
నివారణార్థం
అస్మిన్ సంకల్పిత ప్రథమ దేవాలయే
శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫల సిద్ధ్యర్థం

పుణ్య దర్శనంచ అర్చనంచ అహం కరిష్యే
ప్రజానాం త్వయమేవ కరిష్యామః

యాదగిరిగుట్టలో హరీశ్‌రావుపై కేసు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ నేతలపై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్ నేతలు మాఢవీధుల్లో సంకల్పం చేయడంపై అభ్యంతరం తెలుపుతూ ఈవో భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేశ్ తెలిపారు.

విప్ ఐలయ్యపై కేసు నమోదు చేయాలి: గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగరిగుట్ట, ఆగస్టు 22: హరీశ్‌రావుపై కేసు నమోదు చేసినట్టుగానే ఆలయ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయపరమైన శుద్ధి కార్యక్రమం చేపట్టిన విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల నాయకులు కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతి తదితరులపై కూడా కేసు నమోదు చేయాలని నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.






గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో జర్నలిస్టు సరితను దూషిస్తూ దాడులకు దిగుతున్న కాంగ్రెస్ మూకలు.. పోలీసు అధికారికి ఫిర్యాదు చేస్తున్న మరో మహిళా జర్నలిస్టు విజయారెడ్డి... రోదిస్తున్న మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి

సీఎం స్వగ్రామంలో మహిళా జర్నలిస్టులపై దాడి

కొండారెడ్డిపల్లిలో రుణమాఫీపై రైతులతో మాట్లాడుతుండగా దౌర్జన్యం.. 150 మంది చుట్టుముట్టి వికృత ప్రవర్తన.. ఫోన్లు, కెమెరాలు లాక్కుని బెదిరింపులు

కొండారెడ్డిపల్లెలో గూండారాజ్

> మొదటిపేజీ తరువాయి...

వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే.. అక్కడే అదే అరాచకం. చేష్టలుడిగి చూస్తున్న ఖాకీల ముందు కూడా వారి ఆగడాలు ఆగలేదు. 'ఇయ్యాల ప్రాణాలతో బయటపడ్డరా?''ఎవడొస్తడో చూస్తం.. ఇంటిదాక ఎట్లబోతవో చూస్తం' అంటూ బెదిరింపులు కొనసాగాయి. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న మిగితా జర్నలిస్టులపైనా వారి దౌర్జన్యం ఆగలేదు.

ఇది ఏ బీహార్‌లోనో, యూపీలోనే జరగలేదు!

ఇది ఏ ఫ్యాక్షన్ సినిమా విలనీకి తక్కువకాదు!

ఇందిరమ్మ పాలనలో మహిళా జర్నలిస్టులను వేధిస్తున్న వీడియోలు బయటకురావడంతో రాష్ట్రమంతా ఉలిక్కిపడింది. నిజాంకు వ్యతిరేకంగా కలం ఝుళిపించిన తొలితరం పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ రజాకార్ల చేతుల్లో హత్యకావించబడిన రోజునే.. ఇద్దరు మహిళా జర్నలిస్టులపై అధికార పార్టీ అనుయాయుల గూండాగిరీ నాటికీ నేటికీ మారని దుస్థితికి అద్దం పట్టింది. అనుముల గడీలోని ఆగడాల తీవ్రత అందరికీ తెలిసివచ్చింది. గతంలో జర్నలిస్టు శంకర్‌పై దాడి ఘటనతోనే ఆకురౌడీల అరాచకం వెలుగులోకి వచ్చినప్పటికీ.. ఈ సారి మహిళా జర్నలిస్టులనూ టార్గెట్ చేయడం విషాదం.

ఇదీ తెలంగాణలో కొడగంటిన పౌరస్వేచ్ఛ!

ఇదీ రాష్ట్రంలో కొరవడిన మహిళా రక్షణ

కలానికి, గళానికి శృంఖలాలు తొడిగిన విశృంఖలత

ఈ ఆకృత్యాలపై మహిళా కమిషన్ స్పందిస్తదా?

సీఎం సొంతూర్లో దౌర్జన్యంపై నోటీసులు ఇవ్వగలదా?

చర్యలు తీసుకుని స్వతంత్రతను కాపాడుకోగలదా?

- **పోలీస్ స్టేషన్‌లోనూ దాడికి యత్నం.. పోలీస్ స్టేషన్ బయట కార్లలో కాపలా**
- **కేటీఆర్ చొరవతో ఎస్కార్ట్‌తో వారిని హైదరాబాద్ చేర్చిన పోలీసులు**
- **పోలీసులు చోద్యం చూశారు: జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 22: రాష్ట్రంలో జర్నలిస్టులకు కూడా స్వాతంత్ర్యం లేకుండా పోయింది. ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొండారెడ్డిపల్లి వెళ్లిన మహిళా జర్నలిస్టులపై పట్టపగలే దాడి జరిగింది. కాంగ్రెస్‌కు చెందిన దాదాపు 150 మంది వారిని చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించారు. ఇక్కడ మీకేం పని అంటూ దౌర్జన్యానికి దిగారు. వారు రికార్డు చేసిన దృశ్యాలు బయటకు రాకుండా మెమొరీ కార్డులు లాక్కున్నారు. పట్టపగలు సినిమాల్లోని వీధి గూండాలను తలపించారు. ఇంత జరిగాక, విషయం పోలీస్ స్టేషన్‌కు చేరాక కూడా వారిపై వేధింపులు ఆగలేదు. పోలీస్ స్టేషన్‌లోనే ఒకడు జర్నలిస్టుల్లో ఒకరిపై దాడికి యత్నించాడు. అయినా పోలీసులు చోద్యం చూశారు.

అసలేం జరిగింది?

ఇద్దరు మహిళలు, అందునా జర్నలిస్టులు. చుట్టూ 150 మంది యువకులు. ఒకడు వాళ్ల దగ్గర ఉన్న ఫోన్ లాగుతాడు. మరొకడు కెమెరా, చిప్‌లను గుంజుకుంటాడు. ఇంకొందరు వాళ్లను తోసివేయడం.. బైక్‌లపై మరో పది మంది వాళ్లను రౌండప్ చేయడం. వెకిలి చేష్టలతో కొందరు ఆ మహిళలను వేధించడం. యువకులు లాక్కున్న మైకులు, ఫోన్ కోసం మహిళలు ప్రయత్నిస్తే ఒకడి చేతిలో నుంచి ఒకడి చేతిలోకి విసిరేసుకోవడం. దీంతో వారు అటూ.. ఇటూ ఫోన్, కెమెరాల కోసం పరిగెత్తడం. చివరకు బైక్‌లపై ఉన్న యువకులు ఆ మహిళలను బురదలోకి నెట్టడం..' ఇదంతా ఏదో సినిమాలో జరిగిన సంఘటన కాదు. సాక్షాత్తు మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో జరిగిందీ ఘటన. ఆయన ఇంటి ముందు జరిగిన తతంగం. రాష్ట్రంలో రైతులందరికీ రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామంటూ ఆర్భాటపు ప్రకటన చేసిన ముఖ్యమంత్రి అనేక సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో అసలు ముఖ్యమంత్రి స్వగ్రామంలో పరిస్థితి ఎలా ఉన్నదో తెలుసుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన వేర్వేరు మీడియా సంస్థలకు చెందిన మహిళా జర్నలిస్టులు గురువారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లెకు వెళ్లారు. ఉదయం ఆరుగంటలకే హైదరాబాద్ నుంచి వేర్వేరుగా బయల్దేరిన 'తెలుగు స్క్రైబ్' అనే వార్తా సంస్థ కంటెంట్ హెడ్ ఆవుల సరిత, 'మిర్రర్' వార్తా సంస్థకు చెందిన విజయారెడ్డి ఉదయం 9 గంటలకల్లా కొండారెడ్డిపల్లెకు చేరుకున్నారు. వారు ఎవరికి వారు స్థానికంగా ఉన్న రైతులు, మహిళా రైతులతో మాట్లాడుతున్నారు. స్థానిక దేవాలయం వద్ద, హోటల్ వద్ద ఉన్న పెద్దవాళ్లను పలకరిస్తూ అక్కడ పంటలు పండుతున్న తీరు, స్థానికంగా ఉన్న నీటి వసతి, పంటల రకాల గురించి తొలుత మాట్లాడారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ గురించి రైతుల వద్ద ప్రస్తావించి వారి అభిప్రాయలను సేకరించారు.

30 శాతం మందికే రుణమాఫీ

ఉదయం 9 గంటలకు కొండారెడ్డిపల్లిలో రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టిన సరిత, విజయారెడ్డి బృందానికి అనూహ్యమైన సమాధానాలు వచ్చాయి. తమ గ్రామంలో అత్యధిక మంది రైతులకు కల్వకుర్తిలోని ఎస్‌బీఐలో రుణ ఖాతాలున్నాయని, 1100 మందికి ఖాతాలుంటే కేవలం 300–350 మందికే రుణాలు మాఫీ అయినట్టు పాలకేంద్రం వద్ద ఉన్న రైతులు చెప్పారు. తనకు రూ. 60వేలు రుణం ఉన్నదని, అది కూడా మాఫీ కాలేదని ఒక రైతు చెప్పగా, తమలో చాలా మందికి మాఫీనే కాలేదని మరో ఇద్దరు చెప్పారు. అక్కడ 12 మందితో జర్నలిస్టుల బృందం మాట్లాడితే ఒకరికే మాఫీ అయిందని చెప్పారు.

రాలేదని చెప్తే కొట్టి సంపుతరు..

ఈ సందర్భంగా ఓ రైతు స్పందిస్తూ తమకు రుణమాఫీ కాలేదని అయితే, ఆ విషయం చెప్తే కొట్టి సంపేస్తారని భయపడుతూ చెప్పాడు. ఎవరు కొట్టిసంపుతరు అని అడిగితే, అమ్మో నేను చెప్పలేను అంటూ ఆయన వెళ్లిపోవడం గ్రామంలోని పరిస్థితికి అద్దంపడుతున్నది. పాల కేంద్రం నుంచి అలా నడుచుకుంటూ జర్నలిస్టుల బృందం అక్కడ గుడివద్ద, అక్కడి నుంచి అటే పంచాయతీ ఆఫీసు వద్దకు చేరుకున్నది. అక్కడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా ఉన్నది.

మా ఊరికి ఎందుకు వచ్చారు?

రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న పంచాయతీ కార్యాలయం సమీపంలోకి వెళ్తున్న సరిత, విజయారెడ్డి బృందానికి అనూహ్యమైన పరిస్థితి ఎదురైంది. కొందరు యువకులు వచ్చి తమ గ్రామానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు తీసుకునేందుకు వచ్చామని జర్నలిస్టులు బదులిచ్చారు. రుణమాఫీపై అభిప్రాయాలన్నీ ఏకపక్షంగా ఉన్నాయని, మాఫీ కానివారి వద్ద మాత్రమే తీసుకున్నారని ఆ యువకులు ఆరోపించారు. అదేమీ లేదు గ్రామంలోని రైతులందరినీ అడుగుతున్నామని, మాఫీ అయితే అయిందని చెప్తారని, తమకు గ్రామంలోని వారు తెలియదు కదా జర్నలిస్టులు బదులిచ్చారు. పొద్దున్నుంచి మీరు మా వెంట ఎందుకు పడ్డారని ప్రశ్నించారు. దీంతో వారు మరింత రెచ్చిపోయారు. 'ఇది మా ఊరు. మా ఇష్టం. ఎక్కడికైనా వస్తాం' అని సమాధానమిచ్చారు. దీనికి స్పందిస్తూ సరిత, విజయరెడ్డి స్పందిస్తూ 'మేం జర్నలిస్టులం. మా ఉద్యోగం మేం చేస్తున్నాం. రాజ్యాంగం మాకు కూడా హక్కు ఇచ్చింది. మాకు కూడా రైట్ ఉంది. వచ్చినం. మీరు హైదరాబాద్ వస్త లేరా.. పక్క ఊర్లకు పోతలేరా'' అని ప్రశ్నించారు.



"జీవితంలో ఇలాంటి ఘటన చూడలేదు"

నేను 15 ఏళ్లుగా మీడియాలో ఉన్నా. ఎక్కడా ఇలాంటి సంఘటనలు చూడలేదు. ఒక దశలో చంపేస్తారేమోనని అనిపించింది. పదుల సంఖ్యలో వారు మమ్మల్ని చుట్టుముట్టారు. మేం కొండారెడ్డిపల్లెకు వెళ్లడమే తప్పు అన్నట్టుగా మాట్లాడారు. భయభ్రాంతులకు గురిచేశారు. స్టేషన్‌కు వెళ్తే అక్కడా పట్టించుకోలేదు. మా సెల్‌ఫోన్లు గుంజుకున్నారు. కెమెరాలు, చిప్‌లు లాక్కున్నారు. అసభ్యకరంగా మాట్లాడారు. అనుచితంగా ప్రవర్తించారు. మా దగ్గర ఆధారాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు.

- విజయారెడ్డి, జర్నలిస్టు

"ఇంత ఆటవికంగా ప్రవర్తిస్తారా?"

ముఖ్యమంత్రి సొంత గ్రామంలో ఇంత ఆటవిక పాలన ఉంటుందని ఊహించలేదు. మా పట్ల ప్రవర్తించిన తీరు హేయంగా ఉన్నది. ఇంత ఆటవికంగా ప్రవర్తిస్తారా? రాష్ట్రంలో మహిళలు పట్టపగలు కూడా ఊర్లలో తిరగవద్దా? రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యం కూడా మాకు లేదా? రుణమాఫీ జరిగిందని సీఎం చెప్తున్నారు. సీఎం ఊర్లో రైతులకు ఎంత లాభం జరిగిందో చూద్దామని వెళ్లినం. మేం నిష్పక్షపాతంగా వార్తలు ఇద్దామని వెళ్లాం. పోలీసుల తీరు నిరాశ కలిగించింది.

- ఆవుల సరిత, జర్నలిస్టు

• ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు

తమపై దాడి జరిగినట్టు మధ్యాహ్నం 12.30 గంటలకు మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి వంగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మీనమేషాలు లెక్కిన పోలీసులు.. రాజకీయ వర్గాలు, ప్రజలు, సీనియర్ పాత్రికేయుల నుంచి వస్తున్న విమర్శలతో రాత్రి 9 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులు అనిల్ ఎరుకలి, చందుయాదవ్, శేఖర్ మల్లెపాకుల, కృష్ణ చాకలి, వంశీలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 126(2), 352, 351 (1), 79 ఆర్/డబ్ల్యూ, 3(5) కింద కేసు నమోదు చేశారు.

పోలీసుల నుంచి స్పందన కరువు

వంగూరు పోలీసు స్టేషన్‌లో మహిళా జర్నలిస్టులకు విచిత్ర పరిస్థితి ఎదురైంది. వారిదే తప్పన్నట్టుగా పోలీసులు మాట్లాడారు. జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అసలు మీరెందుకు కొండారెడ్డిపల్లెకు వెళ్లారని ఎస్ఐ ప్రశ్నించారు. మీకు కావాల్సింది ఫోను, కెమెరాలే కదా అని చెప్పి కొద్దిసేపు అక్కడ వారిని కూర్చోబెట్టి ఫోను తెచ్చి ఇచ్చారు. ఫోను మా నుంచి ఎత్తుకెళ్లడం నేరం కదా.. మీకు ఎవరు తెచ్చి ఇచ్చారు.. వాళ్లపై కేసు పెట్టారా అని అడిగితే పోలీసుల నుంచి సమాధానం లేదు. ఎఫ్ఐఆర్ చేయాల్సిందే అని పట్టుపడితే ఫిర్యాదు తీసుకున్నట్టు ఒక అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపించేశారు. కొండారెడ్డిపల్లిలో తమపై దాడిచేసి, తమ విధులకు ఆటంకం కలిగించి, తమపట్ల అసభ్యంగా ప్రవర్తించి, తమను దూషించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయానికి అక్కడకు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా వచ్చారు. ఆయన జర్నలిస్టులకు తమ మద్దతు తెలిపి తనకు పార్టీ కార్యక్రమం ఉన్నదని వెళ్లిపోయారు. అప్పటికే మధ్యాహ్నం దాటడంతో జర్నలిస్టులు కూడా కల్వకుర్తి వెళ్లి భోజనం చేశారు.

మళ్లీ వెంటపడ్డ మూకలు..

కల్వకుర్తిలో భోజనం చేసిన తర్వాత వంగూరు వెళ్లి పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ తీసుకుందామని జర్నలిస్టుల బృందం భావించింది. దీని కోసం మళ్లీ వంగూరు వైపు వెళ్లేందుకు కార్లలో బయల్దేరారు. ఇదే సమయంలో కొండారెడ్డిపల్లి, వంగూరు రోడ్డుపై రెండు ఫార్చ్యూనర్ కార్లలో ఎనిమిది మంది యువకులు జర్నలిస్టుల బృందాన్ని చూడడంతో 'అదిగో వాళ్లే.. మన న్యూస్ బయటకు వెళ్లకుండా ఉండాలి' అంటూ జర్నలిస్టుల బృందం ఉన్న కార్లను వెంబడించారు. జర్నలిస్టుల బృందంలోని ఒక కారులోని కొంత మంది దీన్ని చూసి ముందున్న వారికి సమాచారం ఇచ్చారు. దీంతో ముందున్న మహిళా జర్నలిస్టులు కారు స్పీడ్ పెంచారు. అలా రోడ్డుపై వెళ్తుంటే దగ్గరలోనే వెల్దండ మండల పోలీసు స్టేషన్ కనిపించింది. దీంతో మహిళా జర్నలిస్టులు పోలీసు స్టేషన్‌లోకి వెళ్లారు.

పోలీసు స్టేషన్ సాక్షిగా హత్యాయత్నం!

వెల్దండ పోలీసు స్టేషన్ వద్ద జర్నలిస్టుల వాహనం ఆగడమే ఆలస్యం.. వారిని వెంబడిస్తున్న కొండారెడ్డిపల్లి కాంగ్రెస్ నాయకుల ఫార్చ్యూనర్ కార్లు కూడా వచ్చి ఆగాయి. జర్నలిస్టులు స్టేషన్ లోపలికి వెళ్లకముందే వారిని అడ్డుకుని బూతులు తిట్టారు. 'కొండారెడ్డి పల్లెకు ఎందుకు వచ్చారు? మాకు వ్యతిరేకంగా మీరు పనిచేస్తారా?' అంటూ జర్నలిస్టు సరితను కొట్టేందుకు ఒకడు చెయ్యెత్తాడు. దీంతో నివ్వెరపోయిన ఆమె పోలీసు స్టేషన్‌లో కూడా మీ దౌర్జన్యం ఏమిటి? అని ప్రశ్నిస్తూ స్టేషన్‌లోపలికి వెళ్లింది. పోలీసులు దీనిని చూసినా కాంగ్రెస్ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. తనపై హత్యాయత్నం జరిగిందని, పోలీసు స్టేషన్‌లోనే ఇది జరిగిందని సరిత స్థానిక ఎస్ఐ దృష్టికి తీసుకువచ్చింది. సాక్ష్యం ఉందా? అని ఎస్ఐ ప్రశ్నించడంతో 'మీ పోలీసు స్టేషన్' ముందున్న సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వండి. దాంట్లో ఉన్నది చూడండి అని అన్నారు. సీసీటీవీ ఫుటేజ్ చూసేందుకు, దాన్ని ఇచ్చేందుకు పోలీసులు నిరాకరించారు. తమకు రక్షణ కల్పించాలని జర్నలిస్టుల బృందం వేడుకున్నది. ఒకవైపు లోపల ఇది జరుగుతుంటే మరోవైపు పోలీసు స్టేషన్ బయట అచ్చం సినిమాల్లో చూపించిన దృశ్యమే కనిపించింది. సుమారు మరో పది వాహనాల్లో కొండారెడ్డిపల్లెకు చెందిన కాంగ్రెస్ వాళ్లు మాటు వేసి ఉన్నారు. బయట అంత మంది తమ కోసమే ఉన్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవా? అంటూ సరిత కన్నీటి పర్యంతమైంది. తమకు రక్షణ ఇవ్వరా? ఇదేమి రాజ్యం? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.

• ఎస్పీకి కేటీఆర్ ఫోన్

కొండారెడ్డిపల్లిలో జరిగిన సంఘటనను పలువురు సీనియర్ జర్నలిస్టులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్థానిక పార్టీ నాయకులతో మాట్లాడారు. గువ్వల బాలరాజు, ఎడ్మ సత్యం సహా నేతలందరినీ వెల్దండ పోలీసు స్టేషన్‌కు వెళ్లి జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చూడాలని చెప్పా రు. దీంతోపాటు నాగర్‌కర్నూల్ ఎస్పీతో కూడా మాట్లాడారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకోవాలని, మహిళా జర్నలిస్టులపై ఎలాంటి అఘాయిత్యం జరగకుండా వారిని సురక్షితంగా హైదరాబాద్‌కు పంపించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. పోలీసు ఎస్కార్ట్ ఇచ్చి వారిని పంపించాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ ఫోన్ చేయడం, జర్నలిస్టు సంఘాలు కూడా కలుగజేసుకోవడంతో పోలీసులు ఎస్కార్ట్ ఇచ్చి జర్నలిస్టు బృందాన్ని హైదరాబాద్‌కు పంపించారు.

• ఖండించిన జర్నలిస్టు సంఘాలు

నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు జరిపిన దాడిని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.



మహిళా జర్నలిస్టులపై దాడులా?: కేటీఆర్

రైతు రుణమాఫీ అసలు వాస్తవాలను ప్రజలకు చూపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లికి వెళ్లిన మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై సీఎం అనుచరులు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పాలనగా పోజులు కొట్టే రేవంత్‌రెడ్డి పాలనలో మహిళా జర్నలిస్టులకే రక్షణ లేదా? అని ప్రశ్నించారు. మహిళా జర్నలిస్టులు ఏం తప్పు చేశారు? రేవంత్‌రెడ్డి లెక్క అడ్డమైన భాష మాట్లాడారా? అని నిప్పులు చెరిగారు. కొండారెడ్డి పల్లెలో రైతులకు రుణమాఫీ జరిగిందా? అని తెలుసుకోవడానికి వెళ్తే కాంగ్రెస్ గుండాలు దాడి చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే, రుణమాఫీ వందశాతం చేసింది నిజమైతే ఎందుకు భయం? అని ప్రశ్నించారు. మహిళా జర్నలిస్టులపై దాడిచేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



ప్రజాస్వామ్యం ఖూనీ: హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంతగ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై భౌతికదాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సమాజ హితాన్ని కాంక్షించే జర్నలిస్టుల పట్ల దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిపై ప్రజాస్వామ్యవాదులు స్పందించాలని కోరారు.



దాడి హేయం

- **మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి**

జర్నలిస్టులపై జరిగిన దాడి హేయమని అని మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో గురువారం మహిళా జర్నలిస్టులపై దాడికి పాల్పడినవారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరులు గుండాల్లా కెమెరాలు, వస్తువులు, ఫోన్లు లాక్కోవడం వారిపై దాడికి పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్‌లోనే మహిళా జర్నలిస్టు సరితపై దాడికి పాల్పడిన తీరు చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నదా? అనే అనుమానం కలుగుతున్నదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా సమైక్య పాలకులను సోదరి సరిత ఎంతో ధైర్యంగా ప్రశ్నించిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు

మహిళా జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకు శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని చెప్పేందుకు కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటనే నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్ జిల్లా వంగూరు మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తున్న గువ్వల మహిళా జర్నలిస్టులపై దాడి విషయం తెలుసుకుని పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 40 శాతానికి మించి రుణమాఫీ జరగలేదన్నది జగమెరిగిన సత్యమని, ప్రభుత్వం మాత్రం 100 శాతం రుణమాఫీ చేశామని చెప్పున్నదని మండిపడ్డారు. రుణమాఫీపై నిజానిజాలు తెలుసుకునేందుకు సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి వెళ్లిన జర్నలిస్టులపై దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. ఇంతకుమించి దుర్మార్గం ఉంటుందా? అని నిలదీశారు. దాడిని ఖండిస్తున్నామని, దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఊరెలా దాటుతారో చూస్తాం

జర్నలిస్టుల మాటలతో ఆగ్రహంతో ఊగిపోయిన యువకులు.. 'మాకు రుణ మాఫీ వస్తే మీకెందుకు? రాకుంటే మీకెందుకు?' అంటూ గొడవకు దిగారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే ఫలితం అనుభవిస్తారని హెచ్చరించారు. వారి నుంచి ఫోన్లు, మెమొరీకార్డులు లాక్కున్నారు. వాటిని ఇవ్వకుండా అడుకున్నారు. కెమెరామెన్‌ను, కారు డ్రైవర్‌ను భయభ్రాంతులకు గురిచేశారు. కెమెరామెన్ నుంచి కెమెరా లాక్కున్నారు. సరితను తోసిపడేశారు. దీంతో ఆమె అక్కడున్న బురదలో పడిపోయారు. దీంతో విజయారెడ్డి తన కెమెరాతో ఈ ఘటనను రికార్డు చేయడం మొదలుపెట్టారు. మరో అల్లరిమూక విజయారెడ్డిని రౌండప్ చేసి ఆమె కెమెరానూ లాక్కున్నారు. దీంతో విజయారెడ్డి ఫోన్‌లో చిత్రీకరించే ప్రయత్నం చేయగా ఫోన్‌ను కూడా లాక్కున్నారు. తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఒకరి తర్వాత ఒకరు మొబైల్‌ను తీసుకుంటూ విజయారెడ్డిని చుట్టూ పరిగెత్తించారు. చివరకు ఒకడు ఆ మొబైల్‌ను తీసుకొని బైక్‌పై వెళ్లిపోయాడు. కెమెరా గుంజుకున్నవాడు ఇన్నోవా కారులో వెళ్లిపోయాడు. సరిత, విజయ బృందం తమ కార్లలో వెంటపడి కెమెరాలు తీసుకోగలిగారు. ఈ క్రమంలో తమ వెంటపడుతున్నవారితో సరిత, విజయారెడ్డి వాదిస్తూ.. 'పోలీసు స్టేషన్‌కు వెళ్దాం. మేం రికార్డు చేసిన ప్రతీ వీడియో చూపిస్తాం' అని చెప్పారు. దగ్గర్లోని వంగూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు.

ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులా ?: రాజీవ్‌సాగర్



సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై సీఎం అనుచరులు, కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కొండారెడ్డిపల్లి ఏమైనా నిషేధిత ప్రాంతమా? ఎవరూ వెళ్లకూడదా? అని ప్రశ్నించారు. 100 శాతం రుణమాఫీ జరిగితే కొండారెడ్డిపల్లిలోకి జర్నలిస్టులను ఎందుకు రానీయడం లేదని నిలదీశారు. రుణమాఫీ పేరుతో సర్కారు చేసిన అంకెలగారడీ బయటపడుతుందన్న భయంతోనే మహిళా జర్నలిస్టులపై దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి : క్రాంతికిరణ్



మహిళా జర్నలిస్టు సరిత, విజయరెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, జర్నలిస్టుల విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నట్టు మాజీ ఎంఎల్ఏ క్రాంతికిరణ్ అన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారి పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వస్తుండగా పోలీసు స్టేషన్‌లోనూ దాడి చేయడాన్ని బట్టి ఈ రాష్ట్రంలో సాధారణ ప్రజలకు ఎలాంటి భద్రత ఉందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు: దేవీప్రసాద్



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు కొండారెడ్డిపల్లికి వెళ్లిన మ హిళా జర్నలిస్టులపై దాడి హేయమని బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని పూర్తిచేసినట్టు బుకాయిస్తున్నదని మండిపడ్డారు. రూ. 31వేల కోట్ల రుణమాఫీని రూ.17వేల కోట్లకు తగ్గించి రైతులకు దగా చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ బీఆర్ఎస్ నిరసనలు తెలుపుతుంటే దాడులు చేస్తూ ప్రశ్నించే గొంతుకలను పోలీసుల ద్వారా నొక్కే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు.

అది రేవంత్ సన్నిహితుడి పనే!

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): సీఎం సొంత ఊరిలో రుణమాఫీ వివరాల సేకరణ కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టులపై దౌర్జన్యానికి దిగినవారిలో కాంగ్రెస్ కార్యకర్త అనిల్ ప్రధాన కారకుడని తేలింది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన అనిల్ తండ్రి కొన్నేండ్ల కిందట మరణించగా.. తల్లి కూలి పనులు చేస్తూ జీవిస్తున్నది. చెడు వ్యసనాలకు అలవా టుపడ్డ అనిల్, కాంగ్రెస్‌లో అభిమాన సం ఘం పేరుతో బీఆర్ఎస్ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం అధికార పార్టీ కార్యకర్తగా ఉంటూ సీఎం రేవంత్‌రెడ్డి వర్గీయుడిగా చెలామణి అవుతున్నాడు. వీధు లవెంట తిరగడం.. బెదిరింపులకు పాల్పడడం అతడికి అలవాటుగా మారింది. గంజాయికి కూడా అలవాటు పడినట్టు సమాచారం.

దాడిపై స్పందించని మహిళా కమిషన్!

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): మహిళలపై అత్యాచారాలు, అన్యాయాలు జరిగితే స్పందించాల్సిన మహిళా కమిషన్ అన్ని సందర్భాల్లో స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో మహిళా జర్నలిస్టులపై దాడి జరిగి, వారిపై హత్యాయత్నం జరిగితే రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో గతకొంత కాలంగా దళిత మహిళలపై జరిగిన అత్యాచారాలు, వేధింపులపై కమిషన్ స్పందించలేదని, కేవలం రాజకీయ ప్రేరేపిత అంశాలపై మాత్రమే స్పందిస్తున్నదన్న ఆరోపణలు ఉన్న విషయం తెల్సిందే. ఇటీవల ఏదో రాజకీయ సభలో ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణం గురించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాజకీయం చేశారు. ఈ అంశాన్ని తాము సుమోటోగా తీసుకుంటున్నామని, దీనిపై కేటీఆర్ విచారణకు హాజరు కావాలంటూ మహిళా కమిషన్ ఎక్స్ వేదికగా పేర్కొన్న విషయం తెల్సిందే. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మహిళా జర్నలిస్టులపై దాడి, హత్యాయత్నం కేసులో మహిళా కమిషన్ స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తున్నది. మహిళా కమిషన్ తీరుపై కొందరు జర్నలిస్టులు, మేధావులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తామే వెళ్లి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, డీజీపీని కూడా కలుస్తామని చెప్తున్నారు. ఇద్దరు సీనియర్ మహిళా జర్నలిస్టులపై దాడి జరిగితే స్పందించకపోవడం సరికాదని, మహిళా కమిషన్ రాజకీయ నిరుద్యోగ కమిషన్‌గా మారవద్దని ఆశిస్తున్నట్టు పలువురు మహిళా నాయకులు పేర్కొన్నారు.